ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




శుక్రవారం 28 ఆగస్టు 2026 | Friday 28 August 2026 | హైదరాబాద్ Hyderabad
సంపుటి: 28 సంచిక: 138 | Vol.No 28 Issue No .138
➪ పేజీలు: 12+12 ➪ వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in



## అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాఖీ పౌర్ణమి పండుగ శుభాకాంక్షలు

హైదరాబాద్,ఆగస్ట్27 : రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అక్కచెల్లెళ్ళలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ళ, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకైన ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం వెల్లివిరియాలని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే బృహత్ సంకల్పంలో భాగంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని సీఎం తెలిపారు.

## ఖేలో ఇండియా సంవాద్

- దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం
- క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు



న్యూఢిల్లీ,ఆగస్ట్27 : దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారంనిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అ÷–లథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను మిగతా 2లో..

## యశోదాలో గవర్నర్‌కు సిఎం పరామర్శ



హైదరాబాద్,ఆగస్ట్27 : అనారోగ్యంతో హై టెక్ సిటీ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను సిఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలసి వెళ్లిన సిఎం గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసారు. ఈ మేరకు గవర్నర్ ఆరోగ్యంపై వైద్యులను ఆరా తీసారు.

# మిర్ ఆలం చెరువుకు సర్కారు కొత్త హంగులు

- ఫ్యామిలీ టూరిస్టు హబ్ గా డెవలప్‌మెంట్
- అకస్మికంగా పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి
- గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- సస్పెన్షన్ బ్రిడ్జి, వాటర్ స్పోర్ట్స్, ఐలాండ్ల అభివృద్ధికి ప్రణాళికలు



హైదరాబాద్,ఆగస్ట్27 : చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త రూపు, సరి కొత్త హంగులు ఇవ్వాలని యోచన చేస్తోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి, వినోదం, విశ్రాంతిని ఆస్వాదించేలా దీనిని ప్రముఖ పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మిర్ ఆలం చెరువును ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం అకస్మికంగా పరిశీలించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై మిగతా 2లో..

## ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలి

- ముఖ్య కార్యదర్శి సంజయ్ జజు



హైదరాబాద్ నగరంలో, ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించి, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్య కార్యదర్శి శ్రీ సంజయ్ జజు అధికారులను ఆదేశించారు. గౌరవనీయ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీనియర్ అధికారులతో జరిగిన సమావేశంలో ముఖ్య కార్యదర్శి ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత అంశాలపై మిగతా 2లో..

## ఏఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

- అధిష్టానం తీసుకునే నిర్ణయం అందరికీ శిరోధార్యం
- కాంగ్రెస్‌లో వ్యక్తిగత కోపాలకు తావు లేదన్న మహేశ్ గౌడ్



నిజామాబాద్,ఆగస్ట్27 : మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర మిగతా 2లో..


## జిందాల్ వర్సిటీలో లెక్చర్‌కు కెటీఆర్‌కు ఆహ్వానం



హైదరాబాద్,ఆగస్ట్27 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు హర్యానాలోని ప్రముఖ ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ఆహ్వానం అందింది. విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషించడంతో పాటు వారిని ఉద్దేశించి 'డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్' మిగతా 2లో..

## జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు

- 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను తెరిచిన ప్రజలు
- వివరాలను వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ




న్యూఢిల్లీ,ఆగస్ట్27 : దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లకు చేరాయి. 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను ప్రజలు తెరిచారు. ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఇది బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పేర్కొన్నారు. మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, నగర ప్రాంతాల్లో ఉండగా.. అందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉండటం విశేషం. ఖాతాదారులకు ఇప్పటివరకూ 41.29 కోట్లకు పైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాతాల ద్వారా ఉచిత ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నారు. కనీస మిగతా 2లో..

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

- మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి
- ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
- తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్



న్యూఢిల్లీ,ఆగస్ట్27 : లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే మిగతా 2లో..

## నేపాల్ విలయంతో భారత్‌కు హెచ్చరిక

- చైనా నిర్మిస్తున్న డ్యామ్‌తో భారత్‌కు ముప్పే
- బ్రహ్మపుత్రపై చైనా డ్యామ్ ప్రకృతి విలయానికి నాంది
- ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు



న్యూఢిల్లీ,ఆగస్ట్27 : నేపాల్ విలయం తరవాత ఇప్పుడు భారత్‌కూ ఇలాంటి ముప్పే పొంచి ఉందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే అది చైనా వల్లనే అని తెలుస్తోంది. బ్రహ్మపుత్రపై చైనా నిర్మిస్తున్న భారీ డ్యామే. బీజింగ్‌తో మనకు నదీజల వివాద పరిష్కార ఒప్పందాలు, యంత్రాంగం లేవు. బ్రహ్మపుత్రలో ప్రవాహ హెచ్చుతగ్గులు, వర్షపాతం వంటి సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికైతే ఒక అవగాహనా ఒప్పందం ఉంది. దాన్ని అయిదేళ్లకు ఒకసారి పునరుద్ధరించవచ్చు. ఒకవేళ డ్యామ్ నిర్మాణం తర్వాత చైనా దాన్ని పునరుద్ధరించకపోతే.. భారత్‌కు పెను సమస్యగా మారుతుంది. దీనికి తోడు ఈ నిర్మాణం చేపట్టే ప్రాంతంలో ప్రకృతి విపత్తులకూ ఆస్కారం ఎక్కువే. అందువల్ల భవిష్యత్తులో ఈ నదిలో టిబెట్ వైపు ఏదైనా విపత్తు సంభవిస్తే.. చైనా దాన్ని భారత్‌కు చేరవేయకపోతే ఈశాన్య రాష్ట్రాలు వరదల్లో మునిగే ప్రమాదం ఉంది. మిగతా 2లో..

# పచ్చని ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం ప్రగతి ప్రణాళిక

- 50 శాతం గ్రీన్ కవర్ కార్యక్రమాలను ఒకే వేదికపైకి తెచ్చేందుకు ఏపీ గ్రీన్
- ఉప ముఖ్యమంత్రి పవన్ పర్యవేక్షణలో గ్రీన్ కవర్ కార్యక్రమాల సమన్వయం
- రాష్ట్ర స్థాయి పాలక మండలి ఛైర్మన్ గా ఉప ముఖ్యమంత్రివర్యులు
- ఏపీ గ్రీన్ ఛైర్మన్ అధ్యక్షతన కార్యనిర్వాహక కమిటీ విధులు
- జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమాల సమన్వయం
- పచ్చదనం పెంపు, పర్యావరణ పునరుద్ధరణలో ప్రజా భాగస్వామ్య కార్యచరణ



అమరావతి, ఆగస్టు 27 : ప్రకృతి ఆధారిత జీవనోపాధి, గ్రామీణ ఉపాధి అవకాశాల సృష్టిప్రకృతి ఒడిలో రాష్ట్ర ప్రగతి ప్రయాణం సాగాలి. అది పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం నుంచి రాష్ట్రాన్ని రక్షించాలి. ఉన్న అడవులను కాపాడుకుంటూ, కొత్త అడవులను సృష్టించాలి. ప్రతి గ్రామాన్ని పచ్చదనపు ఛత్రం కిందకు చేర్చాలి. చెట్లను కాపాడుకుంటూ, ఆ చెట్ల నుంచి వచ్చే ఫలసాయం ద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందించుకుంటూ, గ్రామాల్లో ప్రకృతి ఆధారిత జీవనోపాధి లక్ష్యాలు సాధించాలన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆలోచనల నుంచి ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ మిగతా 2లో..

## ఆనాడు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే ఈ దుస్థితి వచ్చేదా

- జగన్ దుర్నీతి వల్ల ప్రాజెక్టులు పూర్తి కాలేకుండా పోయాయి
- గత వైఫల్యాలను కప్పిపుచ్చి మాట్లాడడం విడ్డూరంగా ఉంది
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు



విశాఖపట్నం,ఆగస్ట్27 : ఈరోజు రాష్ట్రంలో వ్యవసాయం దెబ్బతినడానికి వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగనే కారణమని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఆ రోజు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే.. నేడు ఎల్ నినో వచ్చినా సరే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదన్నారు. గురువారం విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తు కంటే అతి పెద్ద విపత్తు గొడ్డలి పార్టీ అని అభివర్ణించారు. ఎల్ నినో కంటే పెద్ద విపత్తు వైఎస్ జగన్ అని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రాజెక్టులు గాడిలో పెట్టామని తెలిపారు. ముఖ్యమంత్రిగా పని చేసిన జగన్.. తన పాలనను గుర్తుపెట్టుకోకుండా మాట్లాడడం బాధగా ఉందన్నారు. ఎల్ నినో పట్ల రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. రైతుల పట్ల ప్రేమ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని వైసీపీ అధినేత జగన్‌కు మంత్రి మిగతా 2లో..

## నేపాల్ విలయంతో భారత్‌కు హెచ్చరిక

బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో యార్లంగ్ జాంగ్బో అంటారు. ఈ నదిపైనే చైనా ఏకంగా 167 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో భారీ జలవిద్యుత్తు ప్రాజెక్ట్ నిర్మిస్తోంది. ఇందుకోసం డ్యామ్ నిర్మాణం చేపడుతోంది. చైనా గతంలో నిర్మించిన ప్రపంచంలో అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్‌కన్నా ఇది మూడురెట్లు భారీది. బ్రహ్మపుత్ర నది 'గ్రేట్ బెండ్'గా పిలిచే భారీ వంపు ప్రాంతంలో నీరు రెండువేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. స్వల్పదూరంలో పైనుంచి పడటంవల్ల అక్కడ జల విద్యుత్తు ఉత్పత్తి ఎక్కువగా చేయొచ్చు. ఏటా 60వేల మెగావాట్ల విద్యుత్‌ను ఇది ఉత్పత్తి చేయగలదని చైనా చెబుతోంది. అయితే, ఈ నిర్మాణ ప్రాంతమే ఇప్పుడు భారత్‌కు సమస్యగా మారింది. ఈ ప్రాజెక్ట్‌పై ఆ మధ్య చైనా జియలాజికల్ సర్వే పర్యవేక్షణలో ఓ అధ్యయనం జరిగింది. ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న ప్రాంతం అడుగు భాగంలోనే 'పైజెన్ ఫాల్ట్' (పగులు) ఉందని, ఇది అక్కడున్న రాళ్లను చీల్చుతున్నట్లుగా అందులో గుర్తించారు. ఈ బీటలు జల విద్యుత్ ప్రాజెక్టు సమీపంలో నిర్మించే డ్యామ్‌లు, రోడ్లు, వంతెనలు, సొరంగాల వంటి మౌలిక సదుపాయాలను గణనీయంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల భూకంపాలు సంభవిస్తే ఇక్కడ పరిస్థితిని అంచనా వేయడం కూడా కష్టమేనని నిపుణులు పేర్కొంటున్నారు. బ్రహ్మపుత్ర నదిపై భారత్‌లో కోట్లాది మంది ప్రజల జీవనం ఆధారపడి ఉంది. అస్సాం, అరుణాచల్ రాష్ట్రాల ప్రజలకు ఈ నదే ప్రాణాధారం. మామూలుగానే ఏటా బ్రహ్మపుత్రలో వరదల కారణంగా ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పుడు చైనా ఈ డ్యామ్‌ను నిర్మించిన తర్వాత.. ఇరు దేశాల మధ్య ఘర్షణలు తలెత్తి మెగా డ్యామ్ నుంచి ఒక్క పెట్టున అపార జలరాశిని విడుదలచేస్తే అది మన ఈశాన్య రాష్ట్రాల్లో విలయం సృష్టించే ప్రమాదం ఉంది. మరోవైపు, డ్యామ్ నిర్మాణం వల్ల బ్రహ్మపుత్రలో ప్రవాహం తగ్గిపోయినా పర్యవసానాలు తీవ్రంగానే ఉంటాయి. చైనా దిగువకు నీటికి విడుదల చేయకపోయినా.. నదిలో నీటి లభ్యత తగ్గితే సాగునీటికీ, తాగునీటికీ ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందుకే బీజింగ్ మెగా డ్యామ్ సమస్యను ఎదుర్కొనేందుకు భారత్ కూడా 11వేల మెగావాట్ల సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సిద్ధమైంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని సియాంగ్ నదిలో నిర్మించతలపెట్టిన ఈ డ్యామ్.. ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు సాయపడుతుంది. కొందరు భూగర్భ శాస్త్రవేత్తలు దీన్ని డ్యామ్ అని కాకుండా 'వాటర్ బాంబ్' అని పిలుస్తున్నారు. చైనా ఆధీనంలోని టిబెట్ అటానమస్ రీజియన్‌లోని ఈ ఆనకట్ట నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ రీజియన్ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తాయి. ఒకవేళ డ్యామ్ నిర్మించాక భూకంపం ఏర్పడితే భారత్, బంగ్లాదేశ్‌లపై తీవ్ర ప్రభావం పడుతుంది. భూకంపాల కారణంగా భారీ వరదలు ఏర్పడతాయి. అందుకే మైడాగ్ డ్యామ్ భారత్‌కు వాటర్ బాంబ్‌లాగా మారనుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మైడాగ్ డ్యామ్ విషయంలో భారతీయులు మాత్రమే ఆందోళన చెందడం లేదు. చైనా భూగర్భ శాస్త్రవేత్తలూ ఈ ఆనకట్టపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే బ్రహ్మపుత్ర జలాలు చైనా ఆధీనంలోకి వెళ్లిపోతాయి. చైనా జలాలను ఎక్కువ కాలం నిల్వ ఉంచి ఒకేసారి విడుదల చేస్తే ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వరదలు ఏర్పడతాయి. మరోవైపు సమ్మర్ లాంటి సీజన్లలో చైనా అసలు జలాలనే విడుదల చేయకపోతే నీటి ఎద్దడి నెలకొంటుంది. అయితే ఈ ముప్పు నుంచి తప్పించుకోవడానికి భారత్ కూడా ఓ మెగా ప్రాజెక్టును నిర్మించ తలపెట్టిందని సమాచారం.

## ఆనాడు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే ఈ దుస్థితి వచ్చేదా

అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. సభలో అన్నింటికీ సమాధానాలు చెబుతామని పేర్కొన్నారు. సెంబ్లీకి వస్తే ఐదేళ్లలో చేసిన అన్యాయాలను నిలబెట్టి.. చెబుతామంటూ జగన్‌కు స్పష్టం చేశారు. క్రిమినల్ ముసుగులో ఓ రాజకీయ పార్టీ పెట్టడం వల్ల ఇలా ఉన్నాడని.. లేకుంటే ఎక్కడ ఉండే వాడో కూడా తెలియదని జగన్‌ను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. రెడ్ బుక్ ఇంప్లిమెంట్ చేస్తే.. ఎవరైనా ఉంటారా? అని వైసీపీ అధినేతను సూటిగా ప్రశ్నించారు. తప్పు చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. మ వద్ద కక్ష సాధింపులు ఉండవని కుండబద్దలు కొట్టారు. వైసీపీ హయాంలో బలహీన వర్గాలపై దమనకాండకు దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. ఆయన మాయ మాటలు బీసీలు నమ్మరని అన్నారు. బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్‌ని తగ్గించింది జగన్మోహన్ రెడ్డి అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. టీడీపీలో బీసీలకు స్వేచ్ఛ ఉందని అన్నారు. కానీ వైసీపీలో బీసీలకు స్వేచ్ఛ ఉందా? అని వైఎస్ జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. ప్రస్తుతం తాము బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని చూస్తే.. దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ జగన్‌పై అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను భయపెట్టి, ఏకగ్రీవం చేసుకున్నారని విమర్శించారు. ఇప్పుడు ఏకగ్రీవాలు అయితే సీట్లు ఇవ్వనంటూ భయపెడుతున్నారని ఆరోపించారు. తిరిగి ఎన్నికలు సాఫీగా జరిగితే తామే గెలుస్తామని వైఎస్ జగన్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అచ్చెన్నాయుడు తెలిపారు. గొడ్డలి పార్టీ అధినేత ప్రతి పది రోజులకు ఓ సారి ప్రెస్ మీట్ పెట్టి అబద్ధాలను అలవోకగా చెప్పేస్తున్నాడంటూ మంత్రి అచ్చెన్నాయుడు వ్యంగ్యంగా అన్నారు. దీనిని ప్రతి ఒక్కరు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. అయినా దీనిని జగన్ ఆపడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. కూటమి పార్టీపై బురద చల్లడం జగన్‌కు అలవాటుగా మారిపోయిందని విమర్శించారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు చెప్పే అబద్ధాలను ఎవరైనా నమ్ముతారేమోనని.. ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకే తాము ముందుకు వస్తున్నామని అచ్చెన్నాయుడు వివరించారు.

## ఖేలో ఇండియా సంవాద్

ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిథ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

## ఎఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందని, అయితే అది క్రమశిక్షణకు లోబడి ఉండాలన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే స్వేచ్ఛ ఎక్కువన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. ఇకపోతే తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు సర్ నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# మిర్ ఆలం చెరువుకు సర్కారు కొత్త హంగులు

అధికారులతో సమీక్షించారు. చెరువు చుట్టూ జరుగుతున్న పనులు, మిర్ ఆలం చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను సీఎం పరిశీలించారు. అధికారులు ఫొటో ప్రదర్శన ద్వారా పనుల పురోగతిని సీఎంకు వివరించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. చెరువు పునరుజ్జీవనం, చెరువు పరిసర ప్రాంతాలు, అందులోని ఐలాండ్ల అభివృద్ధి, చెరువుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం.. ఈ మూడు ప్రధాన అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అయితే, మిర్ ఆలం చెరువులోకి మురుగు నీరు చేరకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను సందర్శన సందర్భంగా ఆదేశించారు. చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవనంతో పాటు నీటి నాణ్యతను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

వాటర్ స్పోర్ట్స్‌కు డిజైన్

మిర్ ఆలం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. అవసరమైన సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, అడ్వెంచర్ కార్యకలాపాలకు అవకాశాలను పరిశీలించాలన్నారు. దీంతో యువతతో పాటు కుటుంబాలకు కూడా ఆకర్షణీయమైన వినోద కేంద్రంగా మిర్ ఆలం మారుతుందని అభిప్రాయపడ్డారు. చెరువు చుట్టూరా ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వినోద, కార్యకలాపాల కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. పాదచారులకు అనుకూలంగా వాకింగ్, పబ్లిక్ స్పేస్‌లను తీర్చిదిద్దడంతో పాటు రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరచనున్నారన్నారు.

ఐలాండ్లకూ కొత్త రూపు

మిర్ ఆలం చెరువులో ఉన్న ఐలాండ్లను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్(టెంట్లు వేయడం), ఇతర పర్యాటక కార్యకలాపాలకు ఈ ప్రాంతాన్ని వినియోగించుకునే అవకాశాలను అధికారులను పరిశీలించాలని చెప్పారు. వెడ్డింగ్, ఈవెంట్ డెస్టినేషన్ల ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల అభివృద్ధిలో పీపీపీ విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు.

జూ పార్కుతో సమగ్ర పర్యాటక అనుసంధానం

సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని అనుసంధానం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూ సందర్శన, ప్రకృతి, చెరువు అందాలు, కుటుంబ వినోదం అన్నీ ఒకే పర్యాటక అనుభవంగా అందించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ట్యాంక్ పునరుజ్జీవనం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం రూపుదిద్దుకుంటుందన్నారు.

సస్పెన్షన్ బ్రిడ్జి పనుల్లో 50 శాతం పురోగతి

అయితే, మిర్ ఆలం ట్యాంక్‌పై నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. ఆగస్టు 27, 2026 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 పూర్తయ్యాయి. అంటే 50.18 శాతం పనులు పూర్తయ్యాయి. 62 పైల్ క్యాప్స్‌లో 28 పూర్తికాగా, 45.16 శాతం పురోగతి నమోదైంది. 62 పియర్-కమ్-పియర్ క్యాప్స్‌లో ఇప్పటివరకు ఆరు పూర్తయ్యాయి. విమానాశ్రయానికి సమీపంలో ఉన్న మిర్ ఆలం చెరువును పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సందర్భంగా సూచించారు. చారిత్రక చెరువు, పచ్చని పరిసరాలు, నెహ్రూ జూ పార్కు సమీపం, ఐలాండ్లు, వాటర్ స్పోర్ట్స్, కుటుంబ వినోదం, ఫుడ్‌కోర్టులు, ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జితో మిర్ ఆలం ట్యాంక్‌కు సరికొత్త గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. సమగ్ర అభివృద్ధి పూర్తయితే హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే ప్రముఖ పర్యాటక కేంద్రంగా మిర్ ఆలం ట్యాంక్ మారనుంది. కుటుంబం మొత్తం ఒకే చోట రోజంతా ప్రకృతి, వినోదం, జలక్రీడలు, విశ్రాంతిని ఆస్వాదించేలా మిర్ ఆలం చెరువును తీర్చిదిద్దనున్నారు.

# పచ్చని ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం ప్రగతి ప్రణాళిక

ఎన్‌రిచ్‌మెంట్ (ఏపీ గ్రీన్) రూపుదిద్దుకొంది. భవిష్యత్ తరాల కోసం పచ్చని, స్వచ్ఛమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించేందుకు చేపడుతున్న 50 శాతం గ్రీన్ కవర్ కార్యక్రమాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావడం కోసం అడుగులుపడ్డాయి. స్వయం ప్రతిపత్తి కలిగిన ఈ సంస్థ ఎలాంటి లాభాపేక్ష లేకుండా విధులు నిర్వహిస్తూ, అటవీ, వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్య, పరిశ్రమలు, జలవనరులు, పట్టణ స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సీఎస్ఆర్ సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాన్ని పవన్ సూచనల మేరకు ముందుకు తీసుకువెళ్తుంది. ప్రధాన లక్ష్యం: 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ భౌగోళిక విస్తీర్ణంలో అడవులు, పచ్చదనపు విస్తీర్ణాన్ని 50 శాతానికి పెంపొందించడం. ప్రస్తుతం రాష్ట్ర భూభాగంలో 37.42 లక్షల హెక్టార్లలో నోటిఫైడ్ అటవీ ప్రాంతం ఉంది. ఇది రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో కేవలం 22.96 శాతం. 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాల్లో భాగంగా భావి తరాలను వాతావరణ మార్పుల ప్రభావాల నుంచి కాపాడేందుకు ఉప ముఖ్యమంత్రివర్యులు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలను నిరంతరాయంగా అమలు పరుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఫార్మ్ ఫారెస్ట్రీ, అగ్రో ఫారెస్ట్రీ, అవెన్యూ ప్లాంటేషన్లు, కాలువ గట్లు, షెల్టర్ బెల్ట్‌లు, పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో మొక్కల పెంపకాన్ని సంస్థ ద్వారా చేపడతారు. ముఖ్యంగా పచ్చదనం క్షీణించిన భూములు, మైనింగ్ ప్రభావిత ప్రాంతాలు, బంజరు భూములు, ఇతర ఎకో సెన్సిటివ్ జోన్ల పునరుద్ధరణకు ఈ కార్యచరణలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ మొత్తం కార్యక్రమాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతోపాటు రైతులు, స్వయం సహాయక సంఘాలు, విద్యా సంస్థలను అనుసంధానిస్తూ, నాణ్యమైన మొక్కల ఉత్పత్తి, పంపిణీ కోసం రాష్ట్రవ్యాప్తంగా నర్సరీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలన్న భేదం లేకుండా 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, చెట్ల ఆధారిత జీవనోపాధి అవకాశాలను ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి సృష్టించడం, వాతావరణ మార్పులకు అనుగుణమైన జాతుల ఎంపిక, పెంపకం, తద్వారా శాస్త్రీయ పద్ధతులతో పర్యావరణ పునరుద్ధరణ చేపట్టడం అనే ప్రధాన లక్ష్యాలను ఒఖ-ఉఖీఇఇఔ అత్యంత నిబద్ధతతో ముందుకు తీసుకువెళ్తుంది. కార్యక్రమాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, నాబార్డ్, సీఎస్ఆర్ నిధులు, కార్బన్ ఫైనాన్స్, కార్బన్ క్రెడిట్లు, గ్రీన్ బాండ్లు, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, ఎకో-టూరిజం వంటి వివిధ వనరుల ద్వారా నిధులను సమీకరించనున్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో- ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ఆధ్వర్యంలో నిధుల వినియోగం, పచ్చదనం పెంపొందించే అంశంలో అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసి, మిషన్ మోడ్‌లో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. గ్రీన్ కవర్ కార్యక్రమాల రాష్ట్ర స్థాయి సమన్వయం, పర్యవేక్షణ చేపడుతుంది. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీలు , మండల స్థాయిలో ఎంజీఐసి ద్వారా కార్యక్రమాలు అమలు చేస్తారు. ప్రతి అడుగులో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళ్లనున్నారు. 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాల్లో భాగంగా 2030 నాటికి 33 శాతం పచ్చదనం పెంపొందించాలని నిర్ణయించారు. ఆరు నెలలు, మూడు నెలలు, నెలవారీ లక్ష్యాలను నిర్దేశించి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజన్‌కు అనుగుణంగా 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 50 శాతం గ్రీన్ కవర్ సాధించే లక్ష్యంతో చేపట్టిన ఈ మహా యజ్ఞంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పరిపాలనా కార్యకలాపాలు మొదలవుతున్న వేళ పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

మూడంచెల వ్యవస్థతో ఏపీ గ్రీన్ కార్యకలాపాలు

ఏపీ గ్రీన్ మూడంచెల వ్యవస్థ ద్వారా కార్యకలాపాలు కొనసాగిస్తుంది. రాష్ట్ర స్థాయి పాలక మండలికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఛైర్మన్‌గా, ఏపీ గ్రీన్ ఛైర్‌పర్సన్ వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. అటవీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక , వ్యవసాయ , గిరిజన సంక్షేమ , విద్యా, పరిశ్రమల, రెవెన్యూ, జలవనరులు, రోడ్లు-భవనాల శాఖల ప్రధాన కార్యదర్శులు, పీసీసీఎఫ్ డైరెక్టర్లుగా ఉంటారు. వీరితోపాటు ఏపీ గ్రీన్ సీఈఓ, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్, స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ కన్వీనర్, కార్పొరేట్ రంగానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యా సంస్థ ప్రతినిధి, ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక అటవీకరణ రంగంలో ఉన్న స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజానికి చెందిన ప్రతినిధులతో కలిపి మొత్తం 24 మంది పాలక మండలిలో భాగస్వాములుగా ఉంటారు. రాష్ట్ర స్థాయి పాలక మండలి ఏటా రెండుసార్లు సమావేశమై విధానాల రూపకల్పన, ఏపీ గ్రీన్ కార్యకలాపాల పర్యవేక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంది. రెండో అంచెలో ఎగ్జిక్యూటివ్ కమిటీ కేబినెట్ హోదా కలిగిన ఏపీ గ్రీన్ ఛైర్‌పర్సన్ అధ్యక్షతన విధులు నిర్వహిస్తుంది. కమిషనర్ గా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి సమన్వయ బాధ్యతలను పర్యవేక్షిస్తారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశమవుతుంది. జిల్లా స్థాయి గ్రీన్ డెవలప్‌మెంట్ అథారిటీ జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన పని చేస్తుంది. జిల్లా స్థాయి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, వ్యవసాయం, ఉద్యానవనం, పరిశ్రమలు, ఆర్ అండ్ బీ, దేవాదాయ, జలవనరులు, విద్యాశాఖల అధికారులు సభ్యులుగా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసే బాధ్యతలు చేపడతారు


# ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలి

విస్తృతంగా సమీక్షించారు. ఈ సమావేశంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ సిగ్నళ్ల నిర్వహణ, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించడం, అత్యవసర సేవలకు వేగవంతమైన మార్గాలను ఏర్పాటు చేయడం వంటి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నగరాలు, జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీలు, పట్టణ ప్రాంతాలు, ా== పొడవునా ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని ముఖ్య కార్యదర్శి అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి మున్సిపల్, పోలీస్, రవాణా, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, వీలైనంత త్వరగా వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక (ఖూ=)ను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. నవంబర్, డిసెంబర్ నెలల నాటికి అవసరమైన ప్రదేశాలలో సిగ్నలింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

అంతర్-శాఖల సమన్వయం

ట్రాఫిక్ నిర్వహణ మరియు రహదారి భద్రతను ఒకే శాఖకు పరిమితం చేయలేమని, పోలీస్, రవాణా, రోడ్లు & భవనాలు, పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి మరియు ఇతర శాఖల సమన్వయ ప్రయత్నాల ఆవశ్యకతను ప్రధాన కార్యదర్శి నొక్కి చెప్పారు. వివిధ ప్రదేశాల నుండి ట్రాఫిక్ డేటాను సమీకరించి, ఒకే వేదికపై విశ్లేషించడానికి ఒక సమీకృత ట్రాఫిక్ డేటా ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను అన్వేషించాలని ఆయన అధికారులను ఆదేశించారు. నార్కోటిక్స్ బ్యూరో మరియు టీజీ-సేఫ్ మాదిరిగానే, ట్రాఫిక్ నిర్వహణ మరియు రహదారి భద్రత కోసం టీజీ-టీఎంఎఆర్ఎస్ (ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ) అనే ప్రత్యేక మరియు స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థలను ఆధునీకరించాలని, ఎలక్ట్రానిక్ అమలును బలోపేతం చేయాలని, గౌరవనీయ సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రహదారి భద్రతా చర్యలను అమలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను నివారించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం 429 ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థలు ఉన్నాయని, ఈ ప్రదేశాలలో అధునాతన సిగ్నల్ నియంత్రణ వ్యవస్థలను వినియోగిస్తున్నారని అధికారులు ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా, రహదారి ప్రయాణాన్ని సురక్షితంగా మార్చేందుకు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేందుకు ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞాన వినియోగం కేవలం ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించడానికే పరిమితం కాకూడదని, పౌరులకు సురక్షితమైన, వేగవంతమైన, మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడంపై కూడా దృష్టి సారించాలని ఆయన నొక్కి చెప్పారు. ట్రాఫిక్ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారాలను గుర్తించేందుకు, డేటా ఆధారిత, సాంకేతికతతో కూడిన, ప్రజాహిత పరిష్కారాలను అవలంబించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఏఐ ఆధారిత ట్రాఫిక్ నిర్వహణ, రహదారి భద్రత కోసం అందుబాటులో ఉన్న సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాలను అధ్యయనం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా అనువైన ప్రదేశాలలో పైలట్ ప్రాజెక్టులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టుల ఫలితాల ఆధారంగా ఈ కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా క్రమంగా విస్తరించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశానికి డీజీపీ సి.వి. ఆనంద్, రవాణా, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా కమిషనర్ ఇళంబర్తి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు




అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

## జిందాల్ వర్సిటీలో లెక్చర్‌కు కెటిఆర్‌కు ఆహ్వానం

ఇవ్వాలని యూనివర్సిటీ కేటీఆర్‌ను ఆహ్వానించింది. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సి. రాజ్ కుమార్ ఈ మేరకు కేటీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. కేటీఆర్ రాక, ఆయన ఆలోచనలు, ప్రసంగం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తి, ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు. కేటీఆర్‌కు అనుకూలమైన తేదీ, సమయాన్ని బట్టి సెప్టెంబర్, అక్టోబర్ 2026లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన భారత్‌లోనే తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమిని సందర్శించాలని కూడా కేటీఆర్‌ను ఆహ్వానించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లోనూ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ విశేష గుర్తింపు సాధించింది. గతంలో రాష్ట్రపతులు, ఉప రాష్ట్రపతులు, భారత ప్రధాన న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సహా పలువురు ప్రముఖులు జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేటీఆర్ ఈ ఆహ్వానాన్ని స్వీకరించి యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులతో తన ఆలోచనలను పంచుకుంటారని యూనివర్సిటీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు

మొత్తం లేకుండానే రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్ ధన్-ఆధార్- మొబైల్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి. 2014 ఆగస్టు 28న ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది. జన్‌ధన్ ఖాతాలను కనీస నిల్వ లేకుండానే నిర్వహించుకోవచ్చు.. కానీ చెక్కు సౌకర్యం కావాలంటే మాత్రం ఖాతాలో కనీస బ్యాలన్స్ తప్పనిసరి నిబంధన విధించారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# మంచుకొండల్లో మహా విలయం

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. భోటే కోషి, త్రిశూలి నదుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాలు వరద ప్రవాహానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ప్రకృతి విలయానికి ఇది సజీవ సాక్ష్యంగా నిలిచింది. గతంలో భారత్‌లో జరిగిన హిమానీ నదాలు ఉప్పొంగి న దానికి మించి అన్నట్లుగా ఈ విలయం ఉంది. ఊళ్లకు ఊళ్లే ధ్వంసం అయ్యాయి. కొండ ప్రాంతాలను కబళించి..కట్టడాలతో ప్రకృతిని దెబ్బతీసారు. దీంతో విలయం తీవ్రంగా ఉంది. ఊళ్లకు ఊళ్లు కొట్టుకు పోవడంతో ప్రజలు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయారు. పర్యాటకులు కూడా కొట్టుకు పోయారు. ఎంతమంది ఎక్కడెక్కడ పోయారో లెక్కకట్టడం ఇప్పట్లో అయ్యే పనికాదు. ఇది మనకు హెచ్చరికలాంటిది. ప్రకృతి విలయాలకు పరిష్కారం కనుగొనడం లేదు. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా తీసిన ఏరియల్ వీడియోల్లో వరద విధ్వంసం భయానకంగా కనిపిస్తోంది. ఇళ్లు, మార్కెట్లతో కళకళలాడిన ప్రాంతాలు వరద తర్వాత బురద, శిథిలాలతో నిండిపోయాయి. కొన్ని చోట్ల గ్రామాలు ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. వరద ఉధృతికి అనేక ప్రాంతాల్లో ఇళ్ల కింది అంతస్తులు పూర్తిగా బురదలో కూరుకు పోయాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం కూడా కష్టంగా మారింది. హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలను వరద, బురద కలిసి ముంచెత్తింది. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, హిమనీ సరస్సు బద్దలవడం వల్లే ఈ విపత్తు సంభవించినట్లు తాజాగా అమెరికా జియాలాజికల్ సర్వే తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ప్రతినిధి డేవిడ్ ఫిషర్ మాట్లాడుతూ.. మొత్తం గ్రామాలు, మార్కెట్ ప్రాంతాలు తుడిచిపెట్టుకుపోయాయని తెలిపారు. బుధవారం ఉదయం 8.37 గంటల సమయంలో టిబెట్‌లోని గోసాయిన్‌కుండ ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు తొలుత అమెరికా అధ్యయన సంస్థ అంచనా వేసింది. దాని ప్రభావంతో టిబెట్, నేపాల్ (సరిహద్దులోని పర్వత సమూహం నుంచి భారీ కొండ చరియ విరిగిపడినట్లు పేర్కొంది. అయితే, తాజాగా దీనిపై వివరణ ఇచ్చింది. కొండచరియలు విరిగిపడటం వల్లే ప్రకంపనలు సంభవించినట్లు తేలింది. హిమనీ సరస్సు బద్దలై భారీ మంచు చరియలు, రాళ్లు పడ్డాయి. దీంతో లిండే నది ఉప్పొంగి.. బోటే కోషి నదిలోకి వరద ఒక్కసారిగా దూసుకొచ్చిందని అమెరికా జియాలాజికల్ సర్వే స్పష్టం చేసింది. పర్వత ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ఉన్న మంచు, రాళ్ల చరియలు విరిగిపడుతున్నట్లు శాటిలైట్ దృశ్యాల ద్వారా తెలిసిందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వరదలను జర్మన్ రీసర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ విశ్లేషించింది. జల ప్రళయానికి దాదాపు 7 నిమిషాల ముందు 4.4 తీవ్రతతో ప్రకంపనలు సంభవించినట్లు తాము గుర్తించామని తెలిపింది. ఆ వెంటనే భీకర వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తినట్లు పేర్కొంది.ఈ విపత్తులో ఇప్పటివరకు 157 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గల్లంతయ్యారు. వీరిలో అత్యధికులు విదేశీయులే. భారత్ నుంచి 140 మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. అటు టిబెట్ వైపు కూడా వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆ దేశంలో ముగ్గురు మరణించగా.. 553 మందికి పైగా గల్లంత య్యారు. హిమాలయ దేశం నేపాల్‌లో జలప్రళయం వెనుక సమాచార లోపం కూడా ఓ బలమైన కారణంగా కన్పిస్తోంది. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు వరద సంభవించినట్లు చైనాకు ముందే తెలిసినా తమను హెచ్చరించలేదని నేపాల్ గగ్గోలు పెడుతోంది. ఇరు దేశాల మధ్య ఈ సమాచారమార్పిడికి అధికారిక ఒప్పందం లేకపోవడంతో నేపాల్‌ను బీజింగ్ ముందస్తుగా అప్రమత్తం చేయలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, చైనా విషయంలో ఇప్పుడు భారత్‌ను కూడా ఇలాంటి సమస్యే వేధిస్తోంది. బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తోన్న భారీ డ్యామ్‌తో మన ఈశాన్య రాష్ట్రాలకు కూడా నేపాల్ లాంటి ముప్పు పొంచి ఉందని మరోసారి నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేపాల్ కాలమానం ప్రకారం ఉదయం 8.15 గంటలకు టిబెట్‌లోని కెరుంగీ కౌంటీలో మెరుపు వరదలు సంభవించాయి. ఈ ఘటన జరిగిన దాదాపు 45 నిమిషాల తర్వాత నేపాల్‌కు వరదల విషయం తెలిసిందే. అంత సమయం ఉన్నా కూడా చైనా అధికారులు నేపాల్‌ను అప్రమత్తం చేయలేదట. కెరుంగీ నుంచి భారీగా వరదల నేపాల్ దిశగా పోటెత్తినట్లు కొంతమంది స్థానికుల నుంచి చివరకు విపత్తు నిర్వహణ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో వీరు హుటాహుటిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతుండగా.. అప్పటికే వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తింది. మధ్యాహ్నం ఒంటిగంటకు చైనా నుంచి నేపాల్‌కు సమాచారం అందింది. టిబెట్ వైపు నదిలో కొండచరియలు విరిగి పడటంతో.. భోటేకోషీ, త్రిశూలి నదులకు ముప్పు ఏర్పడిందనేది దాని సారాంశం. టిబెట్‌లో వరదల గురించి బీజింగ్ ముందుగానే తెలుసుకున్నా.. ఆ విషయాన్ని చేరవేయకపోవడంతో పెను నష్టం వాటిల్లినట్లు నేపాల్ ఆరోపిస్తోంది. అయితే, ఈ విపత్తును చైనాను బాధ్యులను చేయలేమని, ఇరు దేశాల మధ్య ఆ ఒప్పందం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.



# రాజధాని గ్రామాల్లో1437 కోట్ల రూ.లతో మౌలిక సదుపాయాల కల్పన

- లైబ్రరీ,ఆడిటోరియం,హెచ్ఆర్ భవనాల నిర్మాణానికి రూ.596 కోట్లు
- మంగళగిరి పట్టణానికి రోజుకు 30 ఎంఎల్డీ త్రాగునీరు సరఫరా
- రాజధాని గ్రామాలకు సైతం ఇకపై రోజుకు 135 లీటర్లు త్రాగునీరు సరఫరా
- ఇన్నర్ రింగ్ రోడ్,రైల్వే లైన్ల నుండి రాజధాని వరకు గల భూమి ల్యాండ్ పూలింగ్ కు అనుమతి
- రాజధాని ప్రాంతంలోని గ్రామాలన్నిటిలో ఇక అన్నిబీటీ రోడ్లే
- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామాత్యులు పొంగూరు నారాయణ



అమరావతి,ఆగస్టు27 :రాజధాని గ్రామాల్లో రూ.1437 కోట్లతో వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు సిఆర్డిఏ అధారిటీ ఆమోదం తెలిపిందని రాష్ట్ర వ్ర ర పా ల క , వ ట్ట ణా భి వృ ద్ధి శాఖామాత్యులు పొంగూరు నారాయణ చెప్పారు.గురువారం ఎపి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 65వ సీఆర్డీఏ అథారిటీ సమవేశ వివరాలను ఆయన సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలోని శాఖమూరులో రూ.596 కోట్లతో సెంట్రలైజ్డ్ పబ్లిక్ లైబ్రరీ,ఆడిటోరియం,హ్యూమన్ రిసోర్స్ భవనాలు నిర్మాణానికి సీఆర్డీఏ అథారిటీ అనుమతి ఇచ్చిందని తెలిపారు.ముఖ్యంగా రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో క్రిటికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లో భాగంగా రహదారులు,అండర్ గ్రౌండ్ డ్రేనేజీలు,మంచినీటి పైపులు,వీధి దీపాల ఏర్పాటుకు 1437 కోట్ల రూ.లకు అనుమతి ఇచ్చిందని వివరించారు.ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో రోజుకు ఒక్కొక్కరికి 40 లీటర్లు నీరు అందిస్తుండగా లెక్కల ప్రకారం ఒక్కో వ్యక్తికి 135 లీటర్లు అందించాల్సి ఉందన్నారు.కావున ఆయా గ్రామాల్లో తాగునీటి సరఫరా పైపు లైన్లు కూడా పూర్తిగా మార్చే ప్రతిపాధనకు సిఆర్డిఏ అధారిటీ ఆమోందించిందని తెలిపారు.ఆయా గ్రామాల గుండా వెళ్తున్న ట్రంక్ రోడ్లకు ల్యాండ్ టూ ల్యాండ్ ఇవ్వడానికి సైతం ఈ నిధులు వినియోగిస్తామని ఇందుకై మరో రూ.533 కోట్లు మంజూరు ఆమోదం లభించిందని పేర్కొన్నారు.గతంలో ఈ 29 గ్రామాల్లో మౌలిక సౌకర్యాల నిమిత్తం విడుదల చేసిన రూ.904 కోట్లుతో కలిపి మొత్తం రూ.1437 కోట్లతో నూటికి నూరు శాతం మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందని మంత్రి నారాయణ వెల్లడించారు. రాజధాని ప్రాంతంలోని గ్రామాల్లోని లే అవుట్లలో రహదారులను గతంలో సీసీ రోడ్లు నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది అయితే సీఆర్ఆర్ఐ న్యూఢిల్లీ,ఐఐటీ ఖరగ్ పూర్ ఆర్గనైజెషన్ లతో పరిశీలన చేయించగా 54 అడుగుల కంటే తక్కువ వెడల్పు ఉన్న రహదారులను సైతం సీసీ కాకుండా బీటీ రోడ్లుగా మర్చాలన్న అభిప్రాయం వ్యక్తం చేయడం జరిగిందని మంత్రి నారాయణ చెప్పారు.నిపుణుల సలహా మేరకు ఆయా రహదారులను సైతం బీటీ రోడ్లుగా నిర్మించడానికి సీఆర్డీఏ అథారిటీ సమ్మతి తెలిపిందన్నారు.మంగళగిరి పట్టణానికి ప్రస్తుతం రోజుకు 30 మిలియన్ లీటర్లు(ఎంఎల్డీ)ప్రతి కిలో లీటర్(కెఎల్డీ) రూ.10 చొప్పున ఇవ్వడానికి అనుమతి లభించిందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.భవిష్యత్తులో 80 ఎంఎల్డి నీరు ఆపట్టణానికి అవసరం ఉంటుందని తెలిపారు.డిస్ట్రిక్ కూలింగ్ సిస్టమ్ కు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు.మిక్స్ డ్ యూజ్ క్రింద ప్రైవేట్ వారికి భూమి ఇవ్వడానికి పిచ్చికలపాలెంలో 7.9 ఎకరాలు,తుళ్లూరులో 5ఎకరాలు,మందడంలో 12.38 మరియు 6 ఎకరాలు, కూరగల్లులో 6 ఎకరాలు ఇలా మొత్తం 42 ఎకరాలు సీఆర్డీఏ గుర్తించడం జరిగిందని వాటికి ఆర్ఎఫ్పి పిలవడానికి అనుమతి లభించిందన్నారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే నిబంధనల మేరకు కేటాయించిన భూమి కంటే ఎక్కువ కావాలని కోరుతున్నస్కూల్స్,హోటల్స్ తదితర సంస్థలకు ఎకరా ప్రాథమిక విలువ రూ.4.1 కోట్లు కంటే 250 శాతం ఎక్కువ అంటే సుమారు రూ. 10.25 కోట్లు చెల్లిస్తే వారికి ఆ భూమి అందించడానికి అనుమతి లభించిందన్నారు.రాజధానిలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ ఫర్మేషన్ టెక్నాలజీ డిమ్డ్ యూనిర్సిటీ నిర్మాణానికి 8.5ఎకరాలు కేటాయించేందుకు సిఆర్డిఏ అధారిటీ అనుమతిచ్చిందని చెప్పారు.అమరావతి రాజధాని ప్రాంతంలో గ్రీన్ ఎనర్జీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి ఐఓసీఎల్ తో ఎంవోయూ కుదుర్చుకోవడానికి సీఆర్డీఏకి అనుమతిస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. రాజధాని ప్రాంతంలో నిర్మించే ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే లైన్లు కంతేరు,తాడికొండ ప్రాంతాల గుండా వెళుతున్నాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు.రాజధాని ప్రాంతం నుండి వాటి వరకు ఉండే భూములను ల్యాండ్ పూలింగ్ క్రింద తీసుకోవడానికి సీఆర్డీఏ అథారిటీ అనుమతి ఇచ్చిందన్నారు.రాజధాని ప్రాంతంలో కొత్తగా ల్యాండ్ పూలింగ్ చేసే భూముల రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందన్నారు.అదీ 2026 జనవరి 6 కంటే ముందు వ్యవసాయ రుణాలు తీసుకున్నవారికి రూ.1లక్ష వరకు రుణమాఫీ అందుతుందని స్పష్టం చేశారు.

# రాఖీ బంధం బాలికల భద్రతకు మన ప్రతిజ్ఞరాఖీ

- వేడుకలు సంతకాల ప్రచారం



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 27, ( విజన్ ఆంధ్ర ) : రంగారెడ్డి జిల్లా రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో, బేటీ బచావో బేటీ పడావో బిబిబిపి కార్యక్రమంలో భాగంగా రాఖీ బంధం బాలికల భద్రతకు మన ప్రతిజ్ఞ అనే సందేశంతో రాఖీ వేడుకలు మరియు సంతకాల ప్రచార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన భారీ రాఖీ ద్వారా ఆడపిల్లల భద్రత, గౌరవం, విద్య, సమానత్వం మరియు సురక్షితమైన భవిష్యత్తు పట్ల సమాజం యొక్క బాధ్యతను చాటిచెప్పే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. కార్యక్రమం యొక్క ప్రధాన సందేశం ఈ రాఖీ బంధం సాక్షిగా ఆడపిల్లల భద్రతకు మన సంతకం, ఆమె గౌరవానికి మన హామీ, ఆమె భవిష్యత్తుకు మన భరోసా. రాఖీ కేవలం సోదర సోదరీమణుల మధ్య ప్రేమకు ప్రతీక మాత్రమే కాకుండా, ప్రతి ఆడపిల్లను రక్షించాలి, గౌరవించాలి, చదివించాలి, సమాన అవకాశాలు కల్పించాలి అనే సామాజిక బాధ్యతకు ప్రతీకగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతకాల ప్రచారంలో జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, మహిళలు, యువత మరియు ప్రజలు పాల్గొని బాలికల భద్రత మరియు సాధికారతకు తమ మద్దతును సంతకాల ద్వారా తెలియజేశారు. ఆడపిల్లకు రక్షణ కల్పించడం ఒకరి బాధ్యత కాదు సమాజం మొత్తం తీసుకోవాల్సిన బాధ్యత. అనే సందేశంతో ప్రతి ఒక్కరూ బాలికల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ శ్రీ సి. నారాయణ రెడ్డి, ఐ.ఏ.ఎస్. గారు పాల్గొని మాట్లాడుతూ, బాలికలకు సురక్షితమైన మరియు గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.బాలికలకు విద్య, భద్రత, సమాన అవకాశాలు మరియు ఆత్మవిశ్వాసం కల్పించడం ద్వారా మాత్రమే సమాజం సమగ్ర అభివృద్ధి సాధించగలదని తెలిపారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం యొక్క లక్ష్యాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. చేవెళ్ల శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య గారు మాట్లాడుతూ, బాలికలు మరియు పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని, విద్య ద్వారా మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఎబి కిరణ్మయి గారు కార్యక్రమంలో పాల్గొని బాలికల రక్షణ, విద్య మరియు సాధికారత కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాఖీ పండుగను ఒక సామాజిక బాధ్యతకు ప్రతీకగా మలచడం ద్వారా బాలికల భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించవచ్చని తెలిపారు. అదనపు కలెక్టర్ చంద్ర రెడ్డి గారు మాట్లాడుతూ, బాలికల భద్రత మన బాధ్యత అని పేర్కొన్నారు. బాలికల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి శాంతి శ్రీ గారు మాట్లాడుతూ, బాలికల భద్రత, గౌరవం మరియు ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిలవాలని పిలుపునిచ్చారు. రాఖీ బంధం ద్వారా బాలికల రక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొని కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు. బాలికల రక్షణ, విద్య, ఆరోగ్యం, గౌరవం మరియు సమానత్వం కోసం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొని కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు. జిల్లా సివిల్ సప్లైస్ అధికారి హరీష్ గారు,ఎఓ సునీల్ నాధాని గారు,ఐడిఓసి సూపరింటెండెంట్ గారు, ట్రెజరీ అధికారి శ్రీ జి. సూర్యనారాయణ గారు, ఇతర ప్రభుత్వ అధికారులు, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సిబ్బంది,డిహెచ్ఇ డబ్ల్యూ సిబ్బంది, ఐసిపిఎస్ సిబ్బంది, కిశోర బాలికలు మరియు పిల్లలు పాల్గొన్నారు.

# భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించడం కుదరదు

- పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య బానిస కాదు
- పెళ్లంటే పరస్పర గౌరవంతో బతికే బంధం
- పనిమానిషిగా చూడాలనుకునే తీరు క్షమార్హం కాదు
- కర్నాటక హైకోర్టు సంచలన వ్యాఖ్యలు




బెంగళూరు,ఆగస్ట్27 : వివాహ బంధంలో భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య ఇంటి పనులు చేయాలి, అత్తమామలను తప్పనిసరిగా చూసుకోవాలి, పుట్టింటికి వెళ్లాలంటే భర్త అనుమతి తీసుకోవాలనే నిబంధన ఏదీ లేదని పేర్కొంది. వివాహం అంటే పరస్పర గౌరవం, నమ్మకం, సమానత్వంతో కొనసాగాల్సిన బంధమని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ చిల్లకూరు సుమలత ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. బెంగళూరు రూరల్ జిల్లాకు చెందిన సతీష్ అనే వ్యక్తి తన భార్య, కుమార్తెకు కుటుంబ న్యాయస్థానం నెలకు రూ.9,000 చొప్పున భరణం చెల్లించాలని ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తన తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, తన అనుమతి తీసుకోకుండానే తరచూ పుట్టింటికి వెళ్తోందని అతడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ వాదనలపై కోర్టు తీవ్రంగా స్పందించింది. భర్త చేసిన ఆరోపణలను పరిశీలిస్తే భార్యను కుటుంబ సభ్యురాలిగా కాకుండా ఇంటి పనుల కోసం ఉంచుకున్న వ్యక్తిగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. భార్య తన తల్లిదండ్రులను కలవడానికి పుట్టింటికి వెళ్లాలంటే భర్త లేదా అత్తమామల అనుమతి తీసుకోవాలనే ఆలోచనను కోర్టు ప్రశ్నించింది. ఒక మహిళ తన తల్లిదండ్రులను కలవడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భార్య ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి అనే విషయాలను పూర్తిగా భర్త నియంత్రించడం సరైన పద్ధతి కాదని కోర్టు పేర్కొంది. ఇలాంటి ఆంక్షలు మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను దెబ్బతీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇంటి పనులన్నీ భార్యే చేయాలనే భావన సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ జీవితంలో భార్యాభర్తలు ఇద్దరూ బాధ్యతలను పరస్పరం పంచుకోవాలని పేర్కొంది. అలాగే వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా వారి సొంత పిల్లలపై ఉంటుందని కోర్టు తెలిపింది. అత్తమామలను చూసుకోవడాన్ని కోడలిపై తప్పనిసరి బాధ్యతగా మోపడం సమంజసం కాదని స్పష్టం చేసింది. కోడలు అత్తమామలకు సేవ చేయడం ఆమె ఇష్టంతో జరగాలి తప్ప, బలవంతం చేయడం సరికాదని పేర్కొంది. వివాహ బంధం కేవలం కొన్ని ఆచారాలు, సంప్రదాయాలతో ఏర్పడే సంబంధం కాదని కోర్టు పేర్కొంది. భార్యాభర్తల మధ్య ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, సహకారం ఉండాలని తెలిపింది. లింగం ఆధారంగా మహిళల స్వేచ్ఛను పరిమితం చేయడం రాజ్యాంగం అందించే సమానత్వ సూత్రాలకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. భార్య, కుమార్తెకు రోజుకు రూ.150 చొప్పున కూడా భరణం చెల్లించలేనని భర్త చేసిన అభ్యర్థనను కోర్టు కొట్టివేసింది.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మందమర్రి, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అదనపు గదుల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. విద్యాలయంలోని వంటశాల,భోజనశాలలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత,వంటశాలలో పాటిస్తున్న పారిశుద్ధ్య ప్రమాణాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాలయంలో అందుతున్న విద్యా బోధన,వసతులు, మధ్యాహ్న భోజన నాణ్యత,త్రాగునీరు,పారిశుద్ధ్యం,ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని,విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

# రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 27,(విజన్ ఆంధ్ర ) : జిల్లాలో భూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి లైసెన్స్డ్ సర్వేయర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వేలో భాగంగా లైసెన్స్డ్ సర్వేయర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, జిల్లాలోని ప్రభుత్వ భూములు, అటవీ భూములు, గ్రామాల హద్దులు తదితర ప్రాంతాలను సమగ్రంగా సర్వే చేయాలని తెలిపారు. ప్రతి బృందం లక్ష్యానికి అనుగుణంగా సర్వే పనులను పూర్తి చేయాలని, ఒక బృందం రోజుకు 30 ఎకరాల వరకు సర్వే చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. సర్వే, కొ-రిలేషన్ స్టేట్‌మెంట్ తయారీతో పాటు నోటీసుల జారీ ప్రక్రియను ఏకకాలంలో చేపట్టాలని, రైతులకు నోటీసులు సకాలంలో అందజేయాలని, రీ-సర్వే ప్రక్రియపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. నోటీసుల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల హద్దుల నిర్ధారణకు సంబంధించిన సమాచారం సర్పంచులు, రైతులకు అందించాలని, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రీ-సర్వే ప్రక్రియలో ప్రజల సహకారం తీసుకుని పారదర్శకంగా పనులను పూర్తి చేయాలని తెలిపారు. రీ-సర్వేకు సంబంధించి ఫారాలు అందుబాటులో ఉన్నాయని, నిబంధనల ప్రకారం సక్రమంగా పూర్తి చేసి రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో రీ-సర్వేకు పైలట్ గ్రామంగా తాండూర్ మండలంలోని రాంపూర్ గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందని, గ్రామంలో సుమారు 581 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ప్రతి మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, ఆ గ్రామంలో రీ-సర్వే ప్రక్రియపై అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. రీ-సర్వే పనులపై తహసిల్దార్లు ప్రత్యేక చొరవ చూపి క్షేత్రస్థాయిలో పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. జి.పి.ఓ.లు భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి, రీ-సర్వేకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ సమయంలో తహసిల్దార్ కార్యాలయాలలో సీలింగ్ డిక్లరేషన్‌ను పరిశీలించి, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. భూభారతి దరఖాస్తులలో భూమి విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులతో సరిపోల్చిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎస్.ఐ.ఆర్. నోటీసుల జారీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, జిల్లాలో ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. రీ-సర్వే, ఎస్.ఐ.ఆర్., రెవెన్యూ రికార్డుల నవీకరణ ప్రక్రియలు సమన్వయంతో కొనసాగిస్తూ నిర్ణీత లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములు సహా జిల్లాలోని అన్ని భూముల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా సర్వే చేసి, రికార్డులను నవీకరించాలని సూచించారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని, ప్రతి రోజు సాధించిన పురోగతిని సమీక్షిస్తూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

**- అనుమతులు లేకుండా చేపట్టిన జీ+5 భవనం కూల్చివేత**

**- నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్న దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్**




దుండిగల్, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర): అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేటలో అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని అధికారులు గురువారం కూల్చివేశారు. బౌరంపేటలోని ఇందిరమ్మ కాలనీ పక్కన సర్వే నంబర్ 576లో సుమారు 120 గజాల స్థలంలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా జీ+5 అంతస్తుల భవన నిర్మాణం చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టి నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ మాట్లాడుతూ.. మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘించి, అనుమతులు లేకుండా నిర్మించే ఏ ఒక్క భవనాన్నీ ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజలు భవన నిర్మాణాలకు ముందుగా నిబంధనల మేరకు అనుమతులు పొందాలని సూచించారు.

అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక నిఘా

సర్కిల్ పరిధిలో తక్కువ విస్తీర్ణం గల స్థలాల్లో సైతం అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. అనుమతి పొందిన నిర్మాణానికి విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్న వారిపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. నిర్మాణ అనుమతుల్లో పేర్కొన్న నిబంధనలను ఉల్లంఘించి అదనపు అంతస్తులు చేపట్టినా, పూర్తిగా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను నిరంతరం గుర్తించి అవసరమైన మేరకు కూల్చివేతలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కూల్చివేత కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌తో పాటు టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు

# నేపాల్ వరదల్లో చిక్కుకున్న వారిపై ఆరా

**- ఎపి వాసుల క్షేమంపై నారా లోకేశ్ సమీక్ష**

అమరావతి,ఆగస్ట్27 : నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ యాత్రికుల క్షేమ సమాచారాలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. నేపాల్‌ల్లో చిక్కుకున్న ఏడుగురు ఏపీ యాత్రికుల గురించి అడిగి తెలుసుకున్నారు. నలుగురు సురక్షితంగా ఉన్నారని.. మరో ముగ్గురి ఆచూకీ లభ్యం కాలేదని మంత్రికి ఏపీ ఢిల్లీ భవన్ అధికారులు తెలియజేశారు. కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ గ్రూప్‌కు చెందిన శశికుమార్, రాజ్యలక్ష్మిల ఆచూకీ లభించలేదని వెల్లడించారు. కనిపించకుండా పోయిన ముగ్గురి ఆచూకీని కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని లోకేశ్ సూచించారు. చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద ఈషా ఫౌండేషన్ సభ్యుడు శశికుమార్ చివరిసారిగా కనిపించినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు.. కైలాస మానససరోవర్ యాత్రకు వెళ్లి వరదల్లో చిక్కుకున్నా.. క్షేమంగానే ఉన్నట్లు అధికారులు తెలిపారు. సురక్షితంగా ఉన్న వారిని వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.యాత్రికుల భద్రతపై భారత రాయబార కార్యాలయం, చైనా, నేపాల్ ఎంబసీలు, గైరోంగ్ ఇమ్మిగ్రేషన్ సెంటర్, ఈషా ఫౌండేషన్ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని మంత్రి లోకేశ్ సూచనలు చేశారు. నేపాల్‌లో చిక్కుకున్న యాత్రికులు, మానస సరోవర్ యాత్రకు వెళ్లిన ఏపీ వాసుల సమాచారాన్ని ఆర్టీజీఎస్ అధికారులు తెలుసుకుంటున్నారు. మంత్రి లోకేశ్ సూచనల మేరకు ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.


తెలంగాణ ప్రభుత్వం - దేవాదాయ ధర్మాదాయ శాఖ

**శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి దేవస్థానము**

మద్దిమడుగు గ్రామం - పదరా మండలం - నాగర్ కర్నూల్ జిల్లా

నెం. 9/SPASD/2026. తేది: 27.08.2026

**ఈ-ప్రొక్యూర్‌మెంట్-కం-సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలము ప్రకటన**

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది, సదరు దేవస్థానములో 2026-27 సం.నకు ఈ క్రింది హక్కుల గురించి ఈ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలములు తేది: 17.09.2026 రోజు ఉదయం గం.10-30 ల నుండి శ్రీయుత సహాయ కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, మహబూబ్‌నగర్ జిల్లా వారి కార్యాలయము నందు నిర్వహించబడును. ఆసక్తి గలవారు ముందుగా నిర్ణీత డిపాజిటును D.D. ద్వారా మాత్రమే చెల్లించి, టెండరు నిబంధనలకు లోబడి టెండరులలో పాల్గొన వలసినదిగా కోరనైనది.

| క్ర.సం. | హక్కు వివరము | కాల పరిమితి | డిపాజిటు (D.D.) రూ. |
|---|---|---|---|
| 1 | కొబ్బరికాయలు అమ్ముకొను హక్కు | తేది: 20.11.2026 నుండి 19.11.2027 వరకు | 5,00,000.00 |
| 2 | తలనీలాలు సేకరణ హక్కు | తేది: 23.11.2026 నుండి 22.11.2027 వరకు | 10,00,000.00 |
| 3 | కొబ్బరి చిప్పల సేకరణ హక్కు | తేది: 01.11.2026 నుండి 31.10.2027 వరకు | 1,00,000.00 |
| 4 | పాదరక్షలు భద్రపరచుకొను హక్కు | తేది: 01.11.2026 నుండి 31.10.2027 వరకు | 20,000.00 |

1. ఒక సంవత్సర కాలానికి టెండర్లు 3 విధాలుగా సీల్డ్ టెండర్, బహిరంగ వేలం, ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నిర్వహించబడును.
2. ఆసక్తి కలవారు పై మూడింటిలో దేనిలో నైనను పాల్గొన వచ్చును.
3. ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరునందు తేది: 01.09.2026 నుండి https://tender.telangana.gov.in లో చూడవచ్చును.
4. డిపాజిటు DD ద్వారా మాత్రమే చెల్లించి టెండరులో పాల్గొన వలెను.
5. హక్కుదారులు మొదట చెల్లించిన డిపాజిటు సెక్యూరిటీగా ఉంచుకొని, కాలపరిమితి ముగిసిన పిదప, కరెంట్ బిల్లులు వగైరా తనఖీ చేసుకొనిన మీదట, ఎటువంటి వడ్డీ లేకుండా మాత్రమే తిరిగి చెల్లించబడును లేదా చివరి చెల్లింపులో సర్దుబాటు చేయబడును.
6. టెండరులలో గత సం.ర రేటు కంటే తక్కువగా వచ్చినచో లేదా ఏ కారణం చేతనైన టెండరు వాయిదా పడినచో, మొదటి హెచ్చు టెండరుదారుని డిపాజిటు మినహాయించి మిగతా వారి డిపాజిట్లు తిరిగి ఇవ్వబడును.
7. టెండరు ఖరారైనచో మొదటి, రెండవ హెచ్చు టెండరు దారులవి తప్ప, మిగతా వారి డిపాజిట్లు తిరిగి ఇవ్వబడును.
8. DD ని Executive Officer, Sri Pabbathi Anjaneya Swamy Devasthanam, Maddimadugu పేరున SBI, Amrabad Branch, IFS Code: SBIN0005647 నందు చెల్లుబాటు అగునట్లు తీసి, D.D.ని, ఆధార్ కార్డ్ జిరాక్స్ ప్రతిని సమర్పించవలెను.
9. ఇతర షరతులు టెండరు షెడ్యూల్ నందు & వేలం సమయములో తెలుపబడును.

వివరాలకు Mob. No. 96766 19532 / 88977 68938 / 90001 28342 సంప్రదించగలరు.

దేశావత్ రాములు, చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

చిలుకూరి రంగారావు, కార్యనిర్వహణాధికారి

DIPR RO NO 8738-PP/CLA/ADVT/2026-27 తేది 27/08/2026


# కల్వకుర్తి సర్కిల్ ఆఫీస్ లో డీఎస్పీ వెంకట్ రెడ్డి వార్షిక తనిఖీలు - రికార్డుల పరిశీలన

**- ప్రజలకు మెరుగైన సేవలందించాలి..**

**- పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారానికి ఆదేశం...**

**- సిబ్బందికి దిశానిర్దేశం...**



కల్వకుర్తి,విజన్ ఆంధ్ర,ఆగస్టు 27: కల్వకుర్తి డీఎస్పీ వెంకట్ రెడ్డి గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా కల్వకుర్తి సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి, విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సర్కిల్ ఆఫీస్ కు చేరుకున్న డీఎస్పీకి సీఐ భీమ్ కుమార్, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకట్ రెడ్డి సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల రికార్డులు, క్రైమ్ రిజిస్టర్లు, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, పెండింగ్ కేసుల వివరాలు, కోర్టు పెండింగ్ కేసులు, గ్రేవ్ క్రైమ్ కేసుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి కేసు ఫైల్ ను స్వయంగా తిరగేసి, దర్యాప్తులో జరుగుతున్న జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పోలీస్ శాఖ అంటే ప్రజలకు నమ్మకం, ఆ నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతి పోలీస్ పై ఉందన్నారు. స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యలను ఓపికగా విని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని, అటువంటి కేసుల్లో వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని, ప్రతి రికార్డు అప్‌డేట్ గా ఉండాలని, సీనియర్ అధికారుల తనిఖీల సమయంలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎక్కడా లోటు రాకూడదని, రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేయాలని, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగించాలని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి



తెలుసుకున్న డీఎస్పీ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా, నిజాయితీగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో కల్వకుర్తి సీఐ భీమ్ కుమార్, ఎస్సైలు, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# హుజురాబాద్ మున్సిపల్ డంపింగ్ యార్డ్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో)27 ఆగస్ట్.హుజురాబాద్ మండలం సిర్సపల్లి సమీపంలో జాతీయ రహదారి 563ని ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డ్ ను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా గురువారం రాత్రి పరిశీలించారు. జాతీయ రహదారిని ఆనుకొని డంపింగ్ యార్డ్ ఉండడం పట్ల భారత జాతీయ రహదారుల ప్రాధికారత సంస్థ అభ్యంతరం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ స్థలాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా రెవిన్యూ, మునిసిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న స్థలంలో కొంత దూరం వరకు చెత్త డంప్ చేయడం నిలిపివేయాలని అన్నారు. ఇదే స్థలంలో రహదారికి కొంత దూరం తర్వాత డంప్ చేయాలని సూచించారు. రహదారిని అనుకున్న స్థలంలో పచ్చదనం పెంపొందించాలని, మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. రెవిన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో చెత్త సేకరించే వాహనాలు జాతీయ రహదారి నుండి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల నుండి ఈ స్థలంలోకి వచ్చి డంప్ చేసేలా ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని అన్నారు. జాతీయ రహదారి నుండి చెత్త సేకరణ వాహనాలు వెళ్లకుండా చూడాలని, హుజురాబాద్ పట్టణంలోని డివిజన్ల వారీగా సేకరించిన చెత్త డంప్ యార్డులో వేసేందుకు వివిధ ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. రహదారిని ఆనుకొని చెత్త వేయకుండా చూడాలని అన్నారు.కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో జల కుమారి, ఎన్. హెచ్. ఏ. ఐ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, తహసిల్దార్ నరేందర్ పాల్గొన్నారు.

# వనపర్తిలో రైస్‌మిల్లర్లపై బుల్‌డోజర్లు

**- ప్రభుత్వానికి భారీగా ఎగవేసిన మిల్లులు కూల్చివేత**

వనపర్తి,ఆగస్ట్27 : వనపర్తి జిల్లాలో సివిల్ సప్లై రంగానికి సంబంధించి నిబంధనలు ఉల్లంఘిస్తూ, ప్రభుత్వానికి కోట్లాది రూపాయల బకాయిలు పడిన రైస్ మిల్లులపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలకు దిగింది. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించి నిర్వహిస్తున్న చాముండి రైస్ మిల్ , సాంబశివ రైస్ మిల్లులను అధికారులు శనివారం కూల్చివేశారు. సివిల్ సప్లైస్ శాఖ, రెవెన్యూ విభాగం, ఇతర అధికారుల ఉమ్మడి ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించి బుల్డోజర్లతో మిల్లు నిర్మాణాలను నేలమట్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న మిల్లర్లకు ఈ చర్య ద్వారా అధికారులు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సివిల్ సప్లై బకాయిలను వసూలు చేసేందుకు అధికారులు ఎంత ప్రయత్నించినప్పటికీ రైస్ మిల్లుల యజమానులు ఏమాత్రం స్పందించలేదు. విచారణలో భాగంగా సాంబశివ రైస్ మిల్ ప్రభుత్వానికి రూ. 13 కోట్ల పైచిలుకు బకాయి పడగా, చాముండి రైస్ మిల్ ఏకంగా రూ. 39 కోట్ల మేర బకాయి పడినట్లు నిర్ధారణ అయ్యింది. మొత్తం రూ.52 కోట్లకు పైగా మొండిబకాయిలను చెల్లించకుండా తీవ్ర నిర్లక్ష్యం వహించడమే కాకుండా, కనీస అనుమతులు లేకుండా మిల్లులను నిర్వహించడంతో జిల్లా యంత్రాంగం చట్టపరమైన చర్యలను వేగవంతం చేసింది. రెవెన్యూ శాఖ సహకారంతో ఈ రెండు మిల్లులను పూర్తిగా కూల్చివేసి, బకాయిల రికవరీ దిశగా తదుపరి చర్యలు చేపట్టారు.


**తెలంగాణ ప్రభుత్వము**

రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టరేట్ :: మహబూబ్ నగర్

నెం. Rev/G1/LAG/0015/2026-G-Section
గజిట్ నెం. 58/2026 తేది: 03-08-2026

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి సబ్ రూల్ (1)25 (ప్రకారము)

**ఫారం – VII**

**రూఢి ప్రకటన**

మహబూబ్ నగర్ జిల్లా, భూత్ పూర్ మండలంలోని మద్దిగట్ల గ్రామ పరిధిలో మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం క్రింద ఘనపూర్ బ్రాంచ్ కెనాల్ పై కమాలుద్దీన్ మేజర్ లోని మైనర్ - 12R తవ్వకం అను ప్రజా ప్రయోజనార్థం, ఈ క్రింది షెడ్యూల్ లోపేర్కొన్న మొత్తం ఎ.15.0½ గుంటల భూమిని సేకరించవలసిన అవసరం ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ భావిస్తున్నారు.

కావున, పైన పేర్కొన్న ప్రాజెక్టు నిమిత్తం మహబూబ్ నగర్ జిల్లా, భూత్ పూర్ మండలం, మద్దిగట్ల గ్రామంలో ప్రామాణిక కొలత ప్రకారం సుమారు ఎ.15.012 గుంటల భూమిని సేకరించుటకు గాను ఈ రూఢి ప్రకటన చేయడమైనది. సేకరించనున్న భూముల సమగ్ర వివరాలు క్రింది విధంగా గలవు.

**షెడ్యూల్**

గ్రామము: మద్దిగట్ల మండలం: భూత్ పూర్ జిల్లా: మహబూబ్ నగర్

| క్ర.సం. | సర్వే నెం. | మెట్ట/మాగాణి | భూమి రకం | సేకరించు విస్తీర్ణం (ఎకరా) ఎ.గుం. | సంబంధిత వ్యక్తి పేరు & చిరునామా | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 430 | మెట్ట | పట్టా | 0.20 | ఉప్పరి చెన్నమ్మ భర్త చెన్నయ్య | | | | | బాదం చెట్టు | బోరు పైపు లైన్ |
| 2 | 431 | మెట్ట | పట్టా | 0.25 | కావలి పెద్దమ్మ భర్త కృష్ణయ్య | | | | | | |
| 3 | 431 | మెట్ట | పట్టా | 0.05 | 1) కాదిరె శేఖర్ రెడ్డి తండ్రి గణపతి రెడ్డి 2) దోమ సుదర్శన్ రెడ్డి తండ్రి దోమ జంగి రెడ్డి 3) దోమ లక్ష్మమ్మ భర్త దోమ జంగి రెడ్డి | | | | | | |
| 4 | 431 | మెట్ట | పట్టా | 0.04 | కావలి లింగం తండ్రి బాలకిష్టయ్య | | | | | | |
| 5 | 463 | మెట్ట | పట్టా | 0.09½ | 1) కాదిరె శేఖర్ రెడ్డి తండ్రి గణపతి రెడ్డి 2) దోమ సుదర్శన్ రెడ్డి తండ్రి దోమ జంగి రెడ్డి | | | | | | |
| 6 | 462 | మెట్ట | పట్టా | 0.07½ | 1) కాదిరె శేఖర్ రెడ్డి తండ్రి గణపతి రెడ్డి 2) దోమ సుదర్శన్ రెడ్డి తండ్రి దోమ జంగి రెడ్డి 3) కావలి పద్మమ్మ భర్త కృష్ణయ్య 4) ముస్తే అంజిలయ్య తండ్రి కర్రన్న | | | | | | |
| 7 | 462 | మెట్ట | పట్టా | 0.04 | కృష్ణమ్మ భర్త రాజు | | | | | | |
| 8 | 461 | మెట్ట | పట్టా | 0.02 | ఎం. అజమ్మ భర్త పెంటయ్య | | | | | | |
| 9 | 469 | మెట్ట | పట్టా | 0.07 | కె. సత్యనారాయణ గౌడ్ తండ్రి అంజనేయులు గౌడ్ | | | | | | |
| 10 | 469 | మెట్ట | పట్టా | 0.07 | గండికుంట కృష్ణయ్య తండ్రి మసయ్య | | | | | | |
| 11 | 469 | మెట్ట | పట్టా | 0.02½ | సౌత పెద్ద మసయ్య తండ్రి బాలయ్య | | | | | | |
| 12 | 469 | మెట్ట | పట్టా | 0.01½ | సౌత చిన్న మసయ్య తండ్రి బాలయ్య | | | | | | |
| 13 | 469 | మెట్ట | పట్టా | 0.02 | బుచ్చన్న తండ్రి చెన్నయ్య | | | | | | |
| 14 | 469 | మెట్ట | పట్టా | 0.03 | హరిజన్ నాగయ్య తండ్రి బాలయ్య | | | | | | |
| 15 | 470 | మెట్ట | పట్టా | 0.37 | కుప్పిరెడ్డి వెంకట్ రెడ్డి తండ్రి కృష్ణ రెడ్డి | | | | | | |
| 16 | 458 | మెట్ట | పట్టా | 0.06 | మేకల శ్రీనివాసులు తండ్రి పురుషోత్తం | | | | | | బోరు పైపు లైన్ |
| 17 | 458 | మెట్ట | పట్టా | 0.06 | మేకల వెంకటేష్ తండ్రి పురుషోత్తం | | | | | | |
| 18 | 458 | మెట్ట | పట్టా | 0.06 | మేకల సుమలత భర్త పురుషోత్తం | | | | | | |
| 19 | 457 | మెట్ట | పట్టా | 0.09 | టి. వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి | | | | | | |
| 20 | 457 | మెట్ట | పట్టా | 0.15 | పెరి భాగ్య లక్ష్మి భర్త తిరుపతి రెడ్డి | | | | | | |
| 21 | 456 | మెట్ట | పట్టా | 0.03 | కె. నర్సింహ రెడ్డి తండ్రి మన్నెపు రెడ్డి | | | | | | |
| 22 | 455 | మెట్ట | పట్టా | 0.02 | మూసి వెంకటయ్య భర్త రామయ్య | | | | | | |
| 23 | 455 | మెట్ట | పట్టా | 0.21 | కె. పవన్ కుమార్ రెడ్డి తండ్రి నర్సింహ రెడ్డి | | | | | | పైపు లైన్ |
| 24 | 455 | మెట్ట | పట్టా | 0.07 | కె. రజిత భర్త వెంకటేశ్వర రెడ్డి | | | | | | |
| 25 | 493 | మెట్ట | పట్టా | 0.08 | కె. ఆనంద రెడ్డి తండ్రి కొండ రెడ్డి | | | | | | |
| 26 | 493 | మెట్ట | పట్టా | 0.08 | కె. అశోక రెడ్డి తండ్రి కొండ రెడ్డి | | | | | | |
| 27 | 493 | మెట్ట | పట్టా | 0.12 | కె. వెంకటేశ్వర రెడ్డి తండ్రి మన్నెపు రెడ్డి | | | | | | |
| 28 | 494 | మెట్ట | పట్టా | 0.26 | కె. గోవర్ధన్ రెడ్డి తండ్రి వెంకట రెడ్డి | | | | | వేప - 1 | బోరు - 1 |
| 29 | 494 | మెట్ట | పట్టా | 0.12 | కె. రాజేందర్ రెడ్డి తండ్రి నర్సింహులు రెడ్డి | | | | | | |
| 30 | 495 | మెట్ట | పట్టా | 1.29 | కాదిరె శేఖర్ రెడ్డి తండ్రి గణపతి రెడ్డి | | | | | మామిడి (చిన్నవి-30), తాటి చెట్లు (పెద్దవి-130), టేకు-6, కొబ్బరి-5 | |
| 31 | 499 | మెట్ట | పట్టా | 0.03 | వెంకటమ్మ భర్త కావలి పెంటయ్య | | | | | | |
| 32 | 499 | మెట్ట | పట్టా | 0.10 | కాదిరె శేఖర్ రెడ్డి తండ్రి గణపతి రెడ్డి | | | | | | |
| 33 | 499 | మెట్ట | పట్టా | 0.10 | బాల్ నాగయ్య తండ్రి నాగయ్య | | | | | | |
| 34 | 499 | మెట్ట | పట్టా | 0.01 | రోడ్డు | | | | | | |
| 35 | 524 | మెట్ట | పట్టా | 0.05 | జిల్లేల బాల్ చందర్ తండ్రి హన్మంతు | | | | | | |
| 36 | 523 | మెట్ట | పట్టా | 0.04 | హెచ్. రామచంద్రయ్య తండ్రి హుస్సేనయ్య | | | | | | |
| 37 | 521 | మెట్ట | పట్టా | 0.20 | జక్క శివ తండ్రి నాగయ్య | | | | | చింత - 1 | |
| 38 | 521 | మెట్ట | పట్టా | 0.27½ | కుర్వ చిన్న నాగయ్య తండ్రి చిన్న బీరయ్య | | | | | | |
| 39 | 521 | మెట్ట | పట్టా | 0.10 | లక్ష్మమ్మ భర్త నడిపి నాగయ్య | | | | | | |
| 40 | 521 | మెట్ట | పట్టా | 0.10 | పెద్ద నాగయ్య తండ్రి చిన్న బీరయ్య | | | | | | |
| 41 | 519 | మెట్ట | పట్టా | 0.07 | చెన్నమ్మ భర్త మన్యం | | | | | | |
| 42 | 519 | మెట్ట | పట్టా | 0.14 | జి. బాల్ చెన్నయ్య తండ్రి చెన్నయ్య | | | | | | |
| 43 | 518 | మెట్ట | పట్టా | 0.12 | కుమ్మరి దేవమ్మ భర్త భద్రయ్య | | | | | | |
| 44 | 576 | మెట్ట | పట్టా | 0.28 | కె. వంశీ కుమార్ రెడ్డి తండ్రి కె. రవీందర్ రెడ్డి | | | | | | |
| 45 | 576 | మెట్ట | పట్టా | 0.05 | జె. నాగ మల్లేష్ తండ్రి పెద్ద నాగయ్య | | | | | | |
| 46 | 576 | మెట్ట | పట్టా | 0.02 | బండ్ల బాట (రోడ్డు) | | | | | | |
| 47 | 577 | మెట్ట | పట్టా | 0.06 | కె. ఆదిత్య రెడ్డి తండ్రి రవీందర్ రెడ్డి | | | | | టేకు - 10 | |
| 48 | 577 | మెట్ట | పట్టా | 0.01 | రోడ్డు (పార్సెస్) | | | | | | |
| 49 | 577 | మెట్ట | పట్టా | 0.15 | జె. నాగ మల్లేష్ తండ్రి జె. పెద్ద నాగయ్య | | | | | | |
| 50 | 578 | మెట్ట | పట్టా | 0.34 | 1. ఖాజా మొయినుద్దీన్ తండ్రి మహబూబ్ అలీ 2. సలామ్ తండ్రి మహబూబ్ అలీ 3. గోరిబీ తండ్రి మహబూబ్ అలీ 4. అబ్దుల్ గని తండ్రి మహబూబ్ అలీ | | | | | | |
| 51 | 578 | మెట్ట | పట్టా | 0.05 | కొత్తకపు కుర్మార్తి రెడ్డి తండ్రి కొత్తకపు జనార్ధన్ రెడ్డి | | | | | | |
| 52 | 578 | మెట్ట | పట్టా | 0.01 | కుర్వ బీరయ్య తండ్రి కాశన్న | | | | | | |
| 53 | 596 | మెట్ట | పట్టా | 0.12 | కొత్తకపు జనార్ధన్ రెడ్డి తండ్రి చిన్న చంద్రయ్య | | | | | | |
| 54 | 596 | మెట్ట | పట్టా | 0.01 | పి. మల్లేష్ తండ్రి బి. బాబు | | | | | | |
| 55 | 596 | మెట్ట | పట్టా | 0.11 | కుర్వ పెద్ద బెకయ్య తండ్రి సాయన్న | | | | | | |
| మొత్తం | | | | 15.01½ | | | | | | | |

భూసేకరణ చట్టం నెం.30/2013లోని సెక్షన్ 15 ప్రకారం సంబంధిత వ్యక్తుల అభ్యంతరాలను విచారించి, తగిన విచారణ జరిపిన అనంతరం ఈ రూఢి ప్రకటన చేయడమైనది. ఈ భూసేకరణ వలన పునరావాసం కల్పించవలసిన కుటుంబాలు ఏవీ లేవు.

సేకరించనున్న భూమిలో లేదా దానిలోని ఏదైనా భాగంలో భూగర్భంలో గల బొగ్గు, ఇనుప ఖనిజం, పలకరాయి తదితర ఖనిజాలు — ఏ ప్రయోజనం కొరకు భూమి సేకరించబడుతున్నదో ఆ ప్రాజెక్టు నిర్మాణ దశలో తవ్వవలసిన, తొలగించవలసిన లేదా వినియోగించవలసిన ఖనిజ భాగాలు మినహా — ఈ సేకరణలో చేర్చబడవు.

పైన పేర్కొన్న సేకరించనున్న భూమి యొక్క ప్లాన్ ను ఏదైనా పని దినమున, ప్రత్యేక ఉప కలెక్టర్, భూసేకరణ, పునరావాసం & పునఃస్థాపన, యూనిట్ - II, నీటిపారుదల ప్రాజెక్టు, మహబూబ్ నగర్ కార్యాలయంలో పరిశీలించవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్, భూసేకరణ, R&R యూనిట్ - II, నీటిపారుదల ప్రాజెక్టులు, మహబూబ్‌నగర్

సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), మహబూబ్‌నగర్

ఖుష్బూ గుప్తా, IAS జిల్లా కలెక్టర్, మహబూబ్‌నగర్

DIPR RO NO.773-LA/PP/ADVT/PUB/2026-27 తేది 27/08/2026

# కేజీబీవీలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా,ఆగష్టు 27,(విజన్ ఆంధ్ర); కేజీబీవీలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ భైంసా కేజీబీవీను (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, సిబ్బంది సంఖ్య, హాజరైన వారి సంఖ్య, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రతిరోజు అందిస్తున్న భోజనం, విద్య, తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, మెరుగైన వసతులను, మెనూ ప్రకారం ఆహారాన్ని తప్పనిసరిగా అందించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా, కల్పిస్తున్న సౌకర్యాలు, ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో అని వాకబు చేశారు. పదవ తరగతి విద్యార్థులతో ఇప్పటివరకు పూర్తయిన సిలబస్ నుండి గణితం, భౌతిక శాస్త్రం తదితర సబ్జెక్టుల్లో పలు పాఠాలను విద్యార్థులకు చెప్పి, ప్రశ్నలను వేసి వారి నుంచి జవాబులు రాబట్టారు. జవాబులు చెప్పిన విద్యార్థులను అభినంచి, పెన్నులు బహుమతులుగా ఇచ్చారు. కష్టపడి చదువుకోవాలని తెలిపారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎంపీడీవో నీరజ్ కుమార్, ఎంఈవో సుభాష్, ఎంపీఓ ప్రదీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల ను పరిష్కరించాలి





మంచిర్యాల టౌన్, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) : ఉద్యోగ ఉపాధ్యాయుల న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమిస్తామని జె.ఏ.సి సంఘాల నాయకులు స్పష్టం చేశారు. గురువారం టీఎన్జీవో పిలుపు మేరకు మంచిర్యాల కలెక్టరేట్ ఉద్యోగ జేఏసీ సంఘాల నాయకులు ర్యాలీగా వచ్చి నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రెండవ పిఆర్సిని తక్షణమే అమలు చేయాలని, ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న ఆరు డ. ఏ లను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఉద్యోగ పెన్షన్లు, పెన్షనర్లకు సంబంధించిన ఈ హెచ్ ఎస్ స్కీమును సమర్థవంతంగా అమలు చేసి పెండింగ్లో ఉన్న బిల్లులను క్లియర్ చేయడానికి ప్రతినెల 2000 కోట్లు విడుదల చేసి ఉద్యోగుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వచ్చేనెల 10వ తేదీలోపు ప్రభుత్వం స్పందించాలని లేదంటే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి పాలన తీరును విమర్శించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కన్వీనర్ గడియారం శ్రీహరి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దూష కృష్ణ, ఉపాధ్యక్షులు ఊదారపు రాజమౌళి, ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సర్' పున: ప్రక్రియను వినియోగించుకోవాలి: మోహన్ రాజ్



మల్కాజిగిరి, ఆగస్ట్ 27, (విజన్ ఆంధ్ర): 'సర్' పున: ప్రక్రియను అర్హులైన ఓటర్లు వినియోగించుకోవాలని కాంగ్రెస్ నాయకులు మోహన్ రాజ్ కోరారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు గురువారం ఆయన సర్ పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా నోటీసులు అందుకున్న ఓటర్లు, సర్ సమగ్ర ఓటరు జాబితా సవరణలో అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించి ఓటు హక్కు పొందవచ్చునని తెలిపారు.


**దక్షిణ తీర రైల్వే**
విశాఖపట్నం
మమ్మల్ని అనుసరించండి: X @SCoRailway
వెబ్‌సైట్: www.scor.indianrailways.gov.in

**టెండర్ నెం: B-E29-TRD-TNDR-18/2026-27**

భారత రాష్ట్రపతి తరపున, కింద సంతకం చేసిన అధికారి ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**పని పేరు:** BZA డివిజన్‌లో DSDC నడిపేందుకు సంబంధించి OHE ప్రొఫైల్ సర్దుబాటు మరియు తక్కువ క్లియరెన్స్ గల OHE నిర్మాణాల తొలగింపు. **సుమారు విలువ (₹):** 2,28,42,892.00 **బిడ్ సెక్యూరిటీ (EMD) (₹):** 4,56,900/- **పూర్తి కాలవ్యవధి:** 12 నెలలు **ముగింపు తేదీ:** 18.09.2026 **టెండర్ ఫారం ఖరీదు:** శూన్యం

పూర్తి వివరాలు మరియు నిబంధనల కోసం మా వెబ్‌సైట్ www.ireps.gov.in ను సందర్శించండి.

**గమనిక:** ప్రారంభ తేదీ సెలవు దినమైతే, ఆ తర్వాతి పని దినమున టెండర్ తెరవబడుతుంది.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, TrD, విజయవాడ**

**టెండర్ నోటీసు నెం. VSKP-TRS-OT-09-2026-27**

భారత రాష్ట్రపతి తరపున, కింద సంతకం చేసిన అధికారి ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**పని పేరు మరియు ప్రదేశం:** ELS/VSKP వద్ద మూడు దశల (త్రీ ఫేజ్) ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల కోసం OEM/OEM అధీకృత డీలర్ ద్వారా వీల్ ఫ్లాంజ్ లూబ్రికేషన్ సిస్టమ్‌కు మూడు సంవత్సరాల కాలానికి AMC. **పరిమాణం:** 124 లోకోలు. **టెండర్ విలువ (₹):** 1,78,14,497.76/- **జమ చేయవలసిన ఎర్నెస్ట్ మనీ (₹):** 2,39,100/- **టెండర్ ఫారం ఖరీదు (₹):** 5,900/- **కార్యాలయ చిరునామా:** సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (TRS), ఎలక్ట్రిక్ లోకో షెడ్, దక్షిణ తీర రైల్వే, NAD పోస్ట్, విశాఖపట్నం-530009 **పని పూర్తి కాలవ్యవధి:** 3 సంవత్సరాలు (36 నెలలు) **బిడ్డింగ్ విధానం:** రెండు ప్యాకెట్ల విధానం (ఇ-టెండరింగ్) **టెండర్ ముగింపు తేది మరియు సమయం:** 18.09.2026న 15.00 గంటలకు **వెబ్‌సైట్ వివరాలు:** http://www.ireps.gov.in

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (TRS), విశాఖపట్నం**
SCoR-A256

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి ఈ వెబ్‌సైట్‌ను సందర్శించండి: https://www.ireps.gov.in లేదా www.scor.indianrailways.gov.in


# జివో 97ను రద్దు చేయాల్సిందే

**- హరీష్ రావు డిమాండ్**

హనుమకొండ,ఆగస్ట్27 : పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 97 జీవోను రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు. అంతకుముందు హనుమకొండలోని కలెక్టరేట్ వద్ద టీఎన్జీవోలు నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.

# ఉత్తమ అధికారి బొజ్జ జయరాజు కు ఏసీబీ షాక్ !

**- అవార్డు నుంచి ఏసీబీ రైడ్స్ వరకు.. 12 రోజుల్లోనే సీన్ రివర్స్!**
**- 8 ప్రాంతాలలో ఏకకాలంలో తనిఖీలు...**
**- రూ.3.06 కోట్ల విలువైన ఆస్తుల గుర్తింపు**
**- విలేకరులకు వెల్లడించిన వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య**


ఉత్తమ అధికారిగా అవార్డు అందుకుంటున్న ఫైల్ ఫోటో





బోడుప్పల్,ఆగస్టు 27( విజన్ ఆంధ్ర) : ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై మైన్స్ అండ్ జియాలజీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ప్రస్తుతం వరంగల్ డిప్యూటీ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న బొజ్జ జయరాజుపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనకు సంబంధించిన కార్యాలయం,బంధువులు, సహచరులకు చెందిన మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో గురువారం ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలునిర్వహించారు.ఇప్పటివరకు సుమారు రూ.3.06 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది.ఇదిలా ఉండగా.. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జయరాజు ఉత్తమ అధికారిగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.విధి నిర్వహణలో ప్రతిభకు గుర్తింపుగా పురస్కారం అందుకున్న 12 రోజులకే ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ సోదాలు జరగడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**రూ.3.06 కోట్ల ఆస్తులు గుర్తింపు**

సోదాల్లో బోడుప్పల్‌లో సుమారు రూ.40 లక్షల విలువైన జీ+2 భవనం,హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో రూ.32.81 లక్షల విలువైన ఫ్లాట్, కీసరలో రెండు ప్లాట్లు సహా మొత్తం ఐదు ప్లాట్ల విలువ సుమారు రూ.15.77 లక్షలుగా గుర్తించారు. 3.21 ఎకరాల వ్యవసాయ భూమి విలువ రూ.8 లక్షలు, నగదు రూ.10.03 లక్షలు ఉన్నట్లు ఏసీబీ తెలిపింది. ఎల్ఐసీ,మ్యాక్స్ లైఫ్ పాలసీల్లో సుమారు రూ.19.86 లక్షలు, మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాల విలువ సుమారు రూ.40 లక్షలు, పోస్టాఫీస్ పొదుపు రూ.20.86 లక్షలు, 629 గ్రాముల బంగారు ఆభరణాలు సుమారు రూ.37.23 లక్షలు, ఇంటి సామగ్రి రూ.10.67 లక్షలు, మూడు బ్యాంకు ఖాతాల్లో రూ.71.27 లక్షల నిల్వలను అధికారులు గుర్తించారు. ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.3,06,53,177గా ఏసీబీ వెల్లడించింది.

**డ్రైవర్ ఖాతా నుంచి కుమార్తె ఖాతాకు రూ.24.80 లక్షలు**

సోదాల్లో డ్రైవర్ సత్తునూరి యాదయ్య మొబైల్ ఫోన్, బ్యాంకు లావాదేవీలను పరిశీలించిన ఏసీబీకి కీలక వివరాలు లభించినట్లు తెలిపింది. డ్రైవర్ ఖాతా నుంచి జయరాజు కుమార్తె బ్యాంకు ఖాతాకు పలుమార్లు మొత్తం రూ.24.80 లక్షలు బదిలీ అయినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించింది. ఇసుక రవాణా, సంబంధిత కార్యకలాపాల్లో పాల్గొనే వ్యక్తుల నుంచి ఈ మొత్తాన్ని సేకరించి, అధికారి కుమార్తె ఖాతాకు బదిలీ చేసినట్లు డ్రైవర్ విచారణలో వెల్లడించినట్లు ఏసీబీ పేర్కొంది.ఈ లావాదేవీల వెనుక ఉన్న మూలాలు,ఉద్దేశం,అక్రమ గ్రాటిఫికేషన్‌తో సంబంధం ఉందా అనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అధికార పరిధిని అడ్డుపెట్టుకుని అక్రమంగా ఆస్తులు కూడబెట్టారా? వివిధ రూపాల్లో వచ్చిన మొత్తాలు ఆస్తులుగా ఎలా మారాయి? అనే కోణాల్లో ఏసీబీ అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు.

**ఇంకా బయటపడాల్సిన ఆస్తులెన్ని?**

ఏసీబీ సోదాల్లో గుర్తించిన స్థిరాస్తుల మార్కెట్ విలువ అధికారిక, డాక్యుమెంట్ విలువ కంటే మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మరిన్ని ఆస్తులపై తనిఖీలు, ధ్రువీకరణ కొనసాగుతున్నాయి. బ్యాంకు ఖాతాలు, డిపాజిట్లు, బీమా పాలసీలు, భూములు, ప్లాట్లు, వాహనాలు, బంగారు ఆభరణాల వివరాలను జయరాజు చట్టబద్ధ ఆదాయ వనరులతో పోల్చి పరిశీలించనున్నారు. మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో జరిగిన ఈ సోదాలతో మైనింగ్ శాఖలో అధికార దుర్వినియోగం, అక్రమ ఆస్తుల వ్యవహారంపై మరోసారి చర్చ మొదలైంది. కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని ఆస్తులు, లావాదేవీలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఏసీబీ వర్గాలు తెలిపాయి.

# ఓటర్ల జాబితా సవరణకు వేగం

**- దుండిగల్‌లో ప్రత్యేక కేంద్రాల తనిఖీ..**
**ఏఈఆర్ఓ డాక్టర్ వెంకట మణి కరణ్ క్షేత్రస్థాయి పరిశీలన**
**- రోజుకు 40 మంది చొప్పున ప్రత్యేక షెడ్యూల్..**
**డేటా వ్యత్యాసాల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ**



దుండిగల్, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర): ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఏఈఆర్ఓ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక కేంద్రాల్లో జరుగుతున్న ప్రక్రియను పరిశీలించారు. సర్కిల్ పరిధిలోని దొమ్మరపోచంపల్లి వార్డు కార్యాలయం, బౌరంపేట వార్డు కార్యాలయం, మల్లంపేట అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయా కేంద్రాల్లో ఓటర్లకు అందుతున్న సేవలు, ధ్రువీకరణ పత్రాల పరిశీలన, వివరాల నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు.

***బూత్‌స్థాయి సిబ్బందితో సమీక్ష***

ప్రత్యేక కేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో బూత్‌స్థాయి అధికారులు, బూత్‌స్థాయి ఏజెంట్లు, సూపర్వైజర్లు, స్థానిక ఓటర్లతో ఏఈఆర్ఓ ముఖాముఖిగా మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు.

***డేటా వ్యత్యాసాల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు***

రెండువేల రెండో సంవత్సరం నాటి ఓటరు వివరాలు అందుబాటులో లేని వారు, పాత వివరాలకు ప్రస్తుత ఓటరు వివరాలకు మధ్య వ్యత్యాసం ఉన్నవారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. నోటీసుల్లో సూచించిన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఓటర్లకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. సమర్పించిన పత్రాలను పరిశీలించిన అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

***రోజుకు 40 మందికి షెడ్యూల్***

ప్రత్యేక కేంద్రాల వద్ద ఓటర్లు ఎక్కువసేపు వేచి ఉండకుండా ప్రతి వెన్యూ కేంద్రంలో రోజుకు 40 మంది చొప్పున ప్రత్యేక షెడ్యూల్ రూపొందించారు. కేటాయించిన సమయానికి ఓటర్లు కేంద్రానికి చేరుకుని అవసరమైన పత్రాలను సమర్పించేలా ఏర్పాట్లు చేశారు. పత్రాల పరిశీలన అనంతరం అర్హత ఉన్న వివరాలను అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

***హాజరు కానివారికి మరో అవకాశం***

కేటాయించిన తేదీన కేంద్రానికి హాజరుకాలేని ఓటర్లకు కూడా అధికారులు మరో అవకాశం కల్పించారు. వారు తమ సౌకర్యానుసారం మరుసటి రోజు రీ-షెడ్యూల్ చేసుకుని అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో ప్రత్యేక కేంద్రానికి హాజరుకావచ్చని తెలిపారు.

***అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి***

ప్రతి ఓటరు ప్రత్యేక సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని ఏఈఆర్ఓ సూచించారు. పేర్లు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉన్నా, పాతకొత్త వివరాల మధ్య వ్యత్యాసం ఉన్నా సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించి సరిచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బూత్‌స్థాయి అధికారులు, సూపర్వైజర్లు, బూత్‌స్థాయి ఏజెంట్లు, స్థానిక ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తప్పుల్లేని ఓటర్ జాబితా రూపకల్పనే ఎస్ఐఆర్ లక్ష్యం

**- అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించాలి**
**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



పెద్దకొత్తపల్లి రిపోర్టర్ (విజన్ ఆంధ్ర) ఆగస్టు 27 గురువారం : నోటీసులు జారీ చేసిన ఓటర్ల వివరాలను ఆధారాలతో పరిశీలించి, ఒక ఓటర్ వివరాలను అప్లోడ్ చేసిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, వెన్నిచర్లలో నోటీసుదారులతో నిర్వహించిన హియరింగ్ ప్రక్రియను పరిశీలించి, ఓటర్ జాబితాలోని చిన్నచిన్న తప్పులను సరిచేసి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా స్పష్టమైన, ఖచ్చితమైన ఓటర్ జాబితాను రూపొందించడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని, అందులో భాగంగానే నోటీసుదారులతో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. బుధవారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండలం వెన్నిచర్ల గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్లతో బీఎల్వో స్థాయిలో నిర్వహిస్తున్న హియరింగ్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హియరింగ్ నిర్వహిస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించి, ఒక ఓటర్ వివరాలను యాప్ లో అప్లోడ్ చేసిన జిల్లా కలెక్టర్, ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న వివరాలు, ఆధారాలు, అభ్యంతరాలపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ పరిధిలో మూడు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న మొత్తం 3010 మంది ఓటర్ల ఉండగా కేవలం 43 మంది ఓటర్లకు చిన్నచిన్న తప్పులను సరి చేసేందుకు నేటి నిర్వహించిన గ్రామ సభకు 43 మంది ఓటర్లు హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ... ఓటర్ జాబితా ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యమైన పత్రం అని అన్నారు. జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండటంతో పాటు, నమోదైన ఓటర్ల వివరాలు కూడా ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గుర్తించిన అంశాలపై సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి నుంచి వివరణలు, అవసరమైన ఆధారాలను స్వీకరిస్తున్నామని తెలిపారు. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరికి తన వాదనను వినిపించే అవకాశం కల్పించాలని, వారు సమర్పించే ఆధారాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా జాబితా నుంచి తొలగిపోకూడదు. అదే సమయంలో అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలు కూడా కొనసాగకుండా చూడాలి" అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్ జాబితాలోని ప్రతి నమోదును నిబంధనల మేరకు పరిశీలించి, అవసరమైన సవరణలను ఆధారాల ఆధారంగా మాత్రమే చేపట్టాలని సూచించారు. ఓటర్ల పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే సంబంధిత ఆధారాలతో వాటిని సరిచేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న హియరింగ్ కార్యక్రమాల ఉద్దేశాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించి, ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రక్రియను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. హియరింగ్‌కు హాజరయ్యే ప్రతి ఓటరును బాధ్యతాయుతంగా విచారించి, వారు సమర్పించే పత్రాలను పరిశీలించాలని బీఎల్వోలకు సూచించారు. హియరింగ్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి, నిబంధనల అమలు ప్రధానంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటి ఒత్తిళ్లు, పక్షపాతాలకు అవకాశం లేకుండా ప్రతి అభ్యర్థనను సమాన దృష్టితో పరిశీలించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి ఓటరు తమ ఓటర్ వివరాలను పరిశీలించుకోవాలని, గ్రామంలో మూడు పోలింగ్ కేంద్రాల పరిధిలో అందజేసిన నోటీసులు తక్కువగానే ఉన్నాయని , ఒకేరోజు నిర్వహిస్తున్న గ్రామ సభ ద్వారా ఏవైనా పొరపాట్లు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఓటర్ జాబితా సవరణకు సంబంధించి ప్రజలకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వాన్ని బీఎల్వోలు అందించాలని తెలిపారు. గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న హియరింగ్ కార్యక్రమాల ద్వారా ఓటర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు, తుది ఓటర్ జాబితా మరింత స్పష్టంగా, ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ జాబితాకు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి అధికారి, బీఎల్వో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వెన్నిచర్లలో నిర్వహించిన హియరింగ్ ప్రక్రియను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని నిర్ణీత నిబంధనల ప్రకారం పూర్తి చేసి, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామంలో మంచి చెరువు ఉందని, గ్రామంలోని ప్రజలు మంచి పంటలు పండించి జీవనోపాధి లక్ష్యంగా రాణించాలన్నారు. గ్రామానికి అవసరమైన మీసేవ కేంద్రాన్ని మంజూరు చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, తాహసిల్దార్ శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ , బి ఎల్ వోలు సంబంధిత ఎన్నికల అధికారులు, బీఎల్వోలు, ఎన్నికల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ విద్యతోనే పేదరికాన్ని జయించొచ్చు

**-ప్రముఖ సినీ నిర్మాత, సామాజికవేత్త, లయన్ బి శ్రీనివాస్ రెడ్డి**
**-ప్రముఖ సామాజికవేత్త లయన్ కవిత హీరానందాని స్పష్టీకరణ**
**-నాగోల్ సాయినగర్ గుడిసెలోని నిరుపేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ**



ఎల్బీనగర్ ఆగస్టు 28: నేటి పోటీ ప్రపంచంలో విద్యను మించిన సంపద లేదని, నేటి యువతరం స్వశక్తితో పాటు భారతీయ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ స్థాయికి చాటి చెప్పడానికి విద్య ఎంతో సులభమైన మార్గమని ప్రముఖ సినీ నిర్మాత, సామాజికవేత్త, లయన్ బి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్ సాయినగర్ గుడిసెల్లో నివాసం ఉంటున్నటువంటి నిరుపేద విద్యార్థులకు ప్రముఖ సామాజికవేత్త లయన్ కవిత హీరానందాని, ప్రముఖ సినీ రచయిత బి వెంకటరమణతో కలిసి విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డురాదని, క్రమశిక్షణ గల విద్యను నేర్చుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అవరోధించాలని వారు ఆకాంక్షించారు. పాఠశాల విద్య ఎంతో కీలకమని, విద్యతోపాటు విద్యార్థులకు అనుకోగా ఉన్నటువంటి క్రీడారంగంలో కూడా విద్యార్థులు రాణించాలని వారు విద్యార్థులకు సూచించారు. పేద విద్యార్థులను ఆదుకోవడానికి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడానికి తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు రక్షా బంధన్ శుభాకాంక్షలు





నిజామాబాద్, ఆగస్టు 27 :(విజన్ ఆంధ్ర )సోదర భావానికి ప్రతీక అయిన రక్షా బంధన్ (రాఖీ పండుగ) పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ రాఖీ పండగను సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. తమ సోదరీమణులకు ఏ ఆపద రాకుండా ఎల్లవేళలా అండగా నిలబడతామని సోదరులు భరోసాను అందించడం ఈ పండుగ విశిష్టత అని గుర్తు చేశారు."రాఖీ" కుటుంబ బంధాలను బలోపేతం చేసే వారధి అని అన్నారు. మహిళలకు భద్రత, గౌరవం ఎంతో ముఖ్యమనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని, కులమతాలకు అతీతంగా మానవత్వాన్ని, ప్రేమానురాగాలను చాటే ఈ పర్వదినం మన సంస్కృతి, ఔన్నత్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. సోదరభావంతో, ప్రేమానురాగాలతో ప్రతి సంవత్సరం శ్రావణమాసం పౌర్ణమి నాడు రాఖీలు కట్టుకుంటూ జరుపుకునే ఈ వేడుక భారతీయ సాంప్రదాయాల గొప్పదనాన్ని యావత్ ప్రపంచానికి చాటుతుందన్నారు. రాఖీ పౌర్ణమి వేడుక ప్రజల మధ్య ఆత్మీయతను మరింతగా పెంపొందించాలని వారు ఆకాంక్షించారు.

# భూభారతి 22-ఏ, సమగ్ర సర్వే



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 17,(విజన్ ఆంధ్ర); రాష్ట్రంలోని భూభారతి, 22–ఏ, సమగ్ర రిసర్వే చేసేందుకు నిర్దేశించిన అంశాల పై గురువారం రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ మాట్లాడుతూ, భూభారతి డాటా ఆధారంగా ఎక్కడైనా 22 ఎ ఎక్స్ టెంట్ లో తేడాలు వస్తే వాటిని భూభారతి పోర్టల్ లోనే పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22 ఎ కింద నమోదు అయినట్లు ఉంటే వాటిని గుర్తించి, నిర్ణీత ప్రొఫార్మాలో తహసిల్దార్ ల నుంచి సేకరించి నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం అమలు చేయాలని తెలియజేశారు. ఎస్ ఆర్ ఓ లో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో సమగ్రంగా భూ రీసర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వాటి సత్ఫలితాలు ఆధారంగా అన్ని గ్రామాల్లో రీ–సర్వే చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఈ వీసీలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హియరింగ్ నోటీసుల విషయమై ఆందోళన చెందవద్దు

**- నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్**

**- నిర్దేశించిన సమయానికి హాజరై ధృవీకరణ పత్రాలు అందజేయాలి**



నిజామాబాద్, ఆగస్టు 27 :( విజన్ ఆంధ్ర) ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) లో భాగంగా ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ను అనుసరిస్తూ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో హియరింగ్ నోటీసులు జారీ చేస్తున్నామని నగర పాలక సంస్థ కమిషనర్, అర్బన్ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి (ఈ.ఆర్.ఓ) దిలీప్ కుమార్ తెలిపారు. ఈ నోటీసుల విషయమై ఓటర్లు అనవసర ఆందోళనకు గురి కాకూడదని ఆయన సూచించారు. 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని వారికి, అదేవిధంగా పేరు, వయస్సు వంటి అంశాలలో వ్యత్యాసం ఉన్న వారికి హియరింగ్ కోసం నోటీసులు జారీ చేస్తున్నామని అన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో బీ.ఎల్.ఓ లు ఇంటింటికి తిరుగుతూ హియరింగ్ అవసరం అయిన వారికి నోటీసులు అందించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. నోటీసులు వచ్చిన వారు అందులో సూచించిన మేరకు నిర్ణీత సమయానికి, నిర్దేశిత వేదిక వద్దకు హాజరై ధృవీకరణ పత్రాలు అందజేయాలని కమిషనర్ కోరారు. ముసాయిదా ఓటరు జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 16 వరకు తెలియజేయవచ్చని సూచించారు. అలాగే, హియరింగ్ నోటీసుల పరిష్కారం ప్రక్రియ కూడా అక్టోబరు 15వరకు కొనసాగుతుందని వివరించారు. హియరింగ్ నోటీసుల విషయమై ఓటర్లు ఎవరూ ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, నోటీసులో సూచించబడిన సమయానికి హాజరై తగు ఆధారాలను నిర్ధారించే ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హత కలిగిన వారి పేర్లను ఓటరు జాబితాలో కొనసాగించడం జరుగుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ స్పష్టం చేశారు.

# మహాదేవపురంలో రూ.1.20 కోట్లతో సీసీ రోడ్లకు శ్రీకారం

**- కైసర్‌నగర్‌లో పలు ప్రాంతాల్లో రహదారి నిర్మాణ పనులకు ప్రారంభం**

**- కాలనీల అభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులే లక్ష్యం: కొలన్ హన్మంత్‌రెడ్డి**



గాజులరామారం, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మహాదేవ పురం ప్రాంతంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. 277వ డివిజన్ మహాదేవపురం పరిధిలోని కైసర్‌నగర్‌లో సీఎంసీ ప్రత్యేక నిధుల ద్వారా మంజూరైన రూ.1.20 కోట్లతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కైసర్‌నగర్‌లోని శివాలయం రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రోడ్ల నిర్మాణంతో కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు తొలగడంతో పాటు రహదారి సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన రహదారుల నిర్మాణం, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

***- కాలనీవాసుల కృతజ్ఞతలు***

మహాదేవపురం కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేయించడంపై కొలన్ హన్మంత్‌రెడ్డికి కాలనీవాసులు, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్ల నిర్మాణం పూర్తయితే స్థానికంగా రాకపోకలు మరింత సులభతరం అవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సిద్ధనోళ్ల సంజీవ్‌రెడ్డి, రాష్ట్ర మహిళా వైస్‌ప్రెసిడెంట్ అంజలి యాదవ్, మేడ్చల్‌మల్కాజిగిరి ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు, మైనారిటీ నాయకులు షఫీ, సుల్తాన్ మీర్జా, దేవేందర్‌నగర్ అధ్యక్షుడు అఫజల్‌భాయ్, వాలీభాయ్, ఫారూఖ్‌ఖాన్, అజీమ్‌భాయ్, మునావర్‌భాయ్, ఝఫర్, ఇమ్రాన్, అసిఫ్, మహేందర్, గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు, కాలనీవాసులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు గుంటనక్క కుట్ర

**- మెదక్ ఎమ్మెల్యేలతో రహస్య మంతనాలు.. కేసీఆర్ కు వెన్నుపోటు పొడిచే ప్రయత్నం**

**- అటు గుంపుమేస్త్రీ, ఇటు బీజేపీతో దోస్తానా?**

**- మంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్రా వ్యాపార సంస్థలతో రూ. వేల కోట్ల పాల వ్యాపారం**

**- గుంటనక్క, గుంపు మేస్త్రీ మధ్య లండన్ లో లలూచీ**

**- లండన్ మీటింగ్ వివరాలు ఒక్కొక్కటిగా టీఆర్ఎస్ బయటపెడుతుంది**

**- ముఖ్యమంత్రి పేరు అనుముల రేవంత్ రెడ్డి కాదు ఆంధ్రా రేవంత్ రెడ్డి**

**- తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెడుతూ ఆంధ్రా ఏజెంట్ గా పనిచేస్తున్నాడు**

**- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



నిజామాబాద్ ఆగస్టు27:( విజన్ ఆంధ్ర) బీఆర్ఎస్ ను హస్తగతం చేసుకునేందుకు గుంటనక్క (హరీష్ రావు) తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్ కు చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడిచిన మాదిరిగా కేసీఆర్ కు వెన్నుపోటు పొడిచేందుకు హరీష్ రావు తెరవెనుక కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. మెదక్ ఎమ్మెల్యేలతో ఇటీవలే రహస్య మంతనాలు సాగించాడని...కేసీఆర్ వారసత్వం కేటీఆర్ కు రావద్దని వారితో అన్నాడని చెప్పారు. అటు బీజేపీతోనూ, ఇటు గుంపు మేస్త్రీ తోనూ హరీష్ రావుకు లాలూచీ ఉందన్నారు. ఇక రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టి ఆంధ్రా ఏజెంట్ గా మారడని విమర్శించారు. ఇకనైనా రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల బాగు కోసం పనిచేయకుంటే ఊరుకోమని హెచ్చరించారు.

**బీఆర్ఎస్ ను హస్తగతం చేసుకునే కుట్ర**

చేరదీసి రాజకీయ బిక్ష పెట్టిన కేసీఆర్ కు వెన్నుపోటు పొడిచేందుకు హరీష్ రావు సిద్ధమయ్యాడని కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తిన్నింటి వాసాలు లెక్కపెడుతూ బీఆర్ఎస్ ను హస్తగతం చేసుకోవాలని కుట్ర చేస్తున్నాడన్నారు. తాను ఏదీ ఆధారాలు లేకుండా మాట్లాడనని...ఇటీవలే మెదక్ జిల్లా ఎమ్మెల్యేలలతో హరీష్ రహస్య మంతనాలు నిర్వహించాడని కవిత చెప్పారు. ఆ సమావేశంలో ఉన్న ఎమ్మెల్యే ఒకరు తనకు ఈ విషయాలు చెప్పారన్నారు. ఎన్టీఆర్ మాదిరిగానే కేసీఆర్ గొప్ప వ్యక్తి అని కానీ కేసీఆర్ వారసత్వం కేటీఆర్ కు రావద్దని ఆ మీటింగ్ లో హరీష్ రావు కామెంట్లు చేశారని చెప్పారు. బీఆర్ఎస్ ను హస్తగతం చేసుకునేందుకు అటు గుంపు మేస్త్రీతో ఇటు బీజేపీ తో దోస్తానా చేస్తున్నాడన్నారు. బీజేపీ తో హరీష్ రావు దోస్తీకి సంబంధించి తన వద్ద ఆధారాలున్నాయన్నారు. రాజ్ పుష్ప స్కైవాక్ ఓపెన్ విల్లాస్ లో బీజేపీ ముఖ్యనేతతో హరీష్ రావు తరచూ సమావేశం అవుతున్నారన్నారు. పొలల్లో పసుపు, మిరియాలు వేసుకోని తాగే ఆ నేత గురించి గూగుల్ చేస్తే తెలిసిపోతుందన్నారు. ఆయనతో మీటింగ్ ఉన్న రోజు హరీష్ రావు అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుంటున్నాడని చెప్పారు. ఇప్పుడు తాను బీఆర్ఎస్ లో లేనని ఆ పార్టీ ఎటు పోయిన సరే తనకు సంబంధం లేదని కవిత అన్నారు. కానీ తిన్నింటి వాసాలు లెక్కపెడుతున్న గుంటనక్క గురించి ప్రజలకు తెలియాలనే ఈ విషయం బయటకు చెబుతున్నానన్నారు.

**లండన్ లో గుంటనక్క, గుంపు మేస్త్రీ లాలూచీ**

బీజేపీ తో మాత్రమే కాకుండా గుంపు మేస్త్రీతోనూ ఈ గుంటనక్కకు లాలూచీ ఉందన్నారు. ఇటీవలే వీళ్లు లండన్ లో రహస్యంగా సమావేశమై అగ్రిమెంట్ చేసుకోని లాలూచీ పడ్డారని చెప్పారు. ఒకవేళ గుంటనక్కతో గుంపు మేస్త్రీకి ఎలాంటి లాలూచీ లేకపోతే ఆయన్ను క్విడ్ ప్రో కో కింద అరెస్ట్ చేయాలని కవిత డిమాండ్ చేశారు. హరీష్ రావు హెల్త్ మినిస్టర్ గా ఉన్న సమయంలో నారాయణ, చైతన్య కాలేజ్ లకు నెలకు రూ. 5 కోట్ల పాలు పోశారన్నారు. 8 ఏళ్ల పాటు ఆ రెండు సంస్థల ద్వారా 960 కోట్లు దండుకున్నారన్నారు. అంతేకాకుండా కామినేని, యశోద, కిమ్స్ లాంటి కార్పొరేట్ హాస్పిటల్స్ కు కూడా పాలు సరఫరా చేశారన్నారు. ఇదంతా క్విడ్ ప్రో కో కిందకు రాదా అని కవిత ప్రశ్నించారు. గతంలో ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అంశంలో హరీష్ పేరు ఎత్తిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఎందుకు సైలెంట్ అయ్యారో చెప్పాలని డిమాండ్ చేశారు. కచ్చితంగా వీరి మధ్య లండన్ లో లలూచీ అయ్యిందన్నారు. ఆ లాలూచీ కి సంబంధించిన వివరాలను టీఆర్ఎస్ తరఫున ఒక్కొక్కటిగా బయటపెడతానని కవిత చెప్పారు.

**రేవంత్ రెడ్డి ఆంధ్రావాళ్ల చేతిలో బందీ**

అటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రావాళ్ల చేతిలో బందీ అయ్యారని కవిత మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతూ ఆంధ్రా ఏజెంట్ గా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రహ్మణ పరిషత్ కు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ను ఆంధ్రావాళ్లను నియమించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రహ్మణ పరిషత్ ఛైర్మన్ గా ఉన్న బసవరాజు శ్రీనివాస రాజు అనే వ్యక్తి పచ్చి తెలంగాణ వ్యతిరేకి అన్నారు. తెలంగాణను ఉద్యమ సమయంలో రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తికి ఆ పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బ్రహ్మణులలో అర్హులు లేరా అని ప్రశ్నించారు. తెలంగాణ వాదులను, దళితులను ఇష్టానుసారంగా తిట్టిన వ్యక్తికి బ్రహ్మణ పరిషత్ ఛైర్మన్ పదవి ఇచ్చి దాన్ని రౌడీలకు అడ్డాగా మార్చారని మండిపడ్డారు. అటు యాదగిరి గుట్ట బోర్డు మెంబర్లలో ఆంధ్రా హీరో భార్యకు పదవి కట్టబెట్టారని విమర్శించారు. తెలంగాణ వాళ్ల పైసలతో కట్టిన గుడిలో ఆంధ్రావాళ్లకు పెత్తనం ఎలా ఇస్తారన్నారు. జనసేనకు చెందిన ఓ ఎంపీ కుమారుడు 6 కోట్ల కారు వేసుకోని ఒడిశాకు చెందిన 25 ఏళ్ల అమ్మాయిని గుద్ది చంపితే ముఖ్యమంత్రి పట్టించుకోలేదని కవిత గుర్తు చేశారు. ఆతని మీద నమోదు చేసిన ఎఫ్ఐఆర్ లో తండ్రి పేరు లేదని, అందులో ఎన్నో కాలమ్ లు ఖాళీగా పెట్టారని మండిపడ్డారు. వేరే కేసులలో కూడా ఇదే విధంగా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారా అంటూ ప్రభుత్వాన్ని, డీజీపీని ప్రశ్నించారు. ఇలాంటి డొల్ల ఎఫ్ఐఆర్ ను నమోదు చేసినందుకు పోలీసులు సిగ్గుపడాలని కవిత వ్యాఖ్యానించారు. అదే భోదన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు ప్రగతి భవన్ బారికేడ్లను గుద్దితేనే అతని జీవితాన్ని ఆగం చేశారని గుర్తు చేశారు. తెలంగాణకు చెందిన మైనార్టీ నాయకుని కుమారుడైనందుకే అలా చేశారన్నారు. కానీ ఆంధ్రా నాయకుల కొడుకు యాక్సిడెంట్ చేస్తే పట్టించుకోరా అని నిలదీశారు.

**అంతటా ఆంధ్రా పెత్తనమే**

రెడ్ కో ఛైర్మన్ గా, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ గా అటు ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ లలో కూడా ఆంధ్రా పెత్తనమే ఉందన్నారు. బయోకాన్ లో తెలుగు మాట్లాడినందుకు 2 వందల మందిని తీసేస్తే ఈ ముఖ్యమంత్రి మాట్లాడడని కవిత అన్నారు. తెలంగాణ జలాలు ఆంధ్రా నాయకుల దోచుకుంటే కూడా ముఖ్యమంత్రికి సోయి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ కూడా కాంట్రాక్టులన్నీ ఆంధ్రా వాళ్లకే ఇస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రా ఏజెంట్ గా మారారన్నారు. తెలంగాణ ఇందుకోసమే తెచ్చుకున్నామా అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సీఎం అమెరికా టూర్ కు కేంద్రం పర్మిషన్ ఇవ్వకపోతే ఆయనకు తెలంగాణ గుర్తుకు వచ్చిందన్నారు. కానీ తెలంగాణకు ఇన్ని నష్టాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నిజంగా ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బ్రహ్మణ పరిషత్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు గా తెలంగాణ వారిని నియమించాలన్నారు. అదే విధంగా తెలంగాణ ప్రయోజనాల కోసం రేవంత్ రెడ్డి పనిచేయాలని సూచించారు.

**వ్యవస్థీకృత నేరాలు చేసిన బీఆర్ఎస్**

కాంగ్రెస్ పార్టీ అరాచకాలను ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ పూర్తిగా కాంప్రమైజ్ అయ్యిందని కవిత అన్నారు. పాల వ్యాపారం కోసం హరీష్ రావు, ఆంధ్రా దోస్తులు, రియల్ ఎస్టేట్ బిజినెస్ కోసం కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించటం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఫెయిల్ అయ్యిందని ఇక తామే అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ అంటోందని కవిత చెప్పారు. కానీ అధికారంలో ఉండగా బీఆర్ఎస్ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిందని కవిత చెప్పారు. ఇరిగేషన్, పాలు వ్యాపారం ఒకరు, రియల్ ఎస్టేట్ ఒకరు, ఇసుక దందాను ఒకరు పంచుకున్నారన్నారు. నేరాలను వ్యవస్థీకృతంగా చేసిన బీఆర్ఎస్ కు మళ్లీ అవకాశం ఇద్దామా అంటూ ప్రశ్నించారు. ఆ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని చెప్పారు. పారదర్శకమైన, అవినీతి లేని, కొత్తవాళ్లకు అవకాశం ఇచ్చేందుకు తాము వచ్చామని కవిత చెప్పారు. తమ పార్టీకి అవకాశం ఇస్తే తెలంగాణ ప్రయోజనాల కోసం పనిచేస్తామని చెప్పారు.

# దళితుల బైండ్‌ఓవర్‌పై దళిత సంఘాల ఆగ్రహం

**- నోటీసు లేకుండా బైండ్‌ఓవర్ చేశారంటూ ఆరోపణలు**

**- తహసీల్దార్ తీరుపై దళిత యువజన నాయకుడు అభిషేక్ అభ్యంతరం**

**- ఉత్తర్వులు రద్దు చేయకుంటే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరిక**

**- బైండ్‌ఓవర్ ప్రక్రియపై సమగ్ర విచారణకు డిమాండ్**

**- కలెక్టర్, ఆర్డీవో జోక్యంతో న్యాయం చేయాలని వినతి**

కుత్బుల్లాపూర్, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర): దళితులను నోటీసు ఇవ్వకుండా బైండ్‌ఓవర్ చేశారన్న ఆరోపణలపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అల్వాల్ తహసీల్దార్ రాములు చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా ఏడాది కాలానికి బైండ్‌ఓవర్ చేసినట్లు బాధితులు ఆరోపిస్తూ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, మల్కాజిగిరి ఆర్డీవోకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

***హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వివాదం***

అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో 791/2026 నంబరుతో కేసు నమోదైందని బాధితులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టులో క్రిమినల్ పిటిషన్ 13382/2026 దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 31లోగా దర్యాప్తు అధికారిని కలవాలని, హాజరైన అనంతరం భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని 35(3) సెక్షన్ కింద నోటీసు జారీ చేసి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలని కోర్టు ఆదేశించినట్లు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు అధికారిని కలిసి 35(3) సెక్షన్ కింద నోటీసు అందుకున్నప్పటికీ, ఆగస్టు 24న తహసీల్దార్ ఎదుట బైండ్‌ఓవర్ కోసం హాజరు కావాలని చెప్పారని బాధితులు ఆరోపించారు. ముందస్తు నోటీసు, తగిన విచారణ లేకుండా బైండ్‌ఓవర్ చేయడం చట్టపరమైన విధానానికి, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు.

***దళిత యువజన నాయకుడి అభ్యంతరం***

ఈ వ్యవహారంపై దళిత యువజన నాయకుడు అభిషేక్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దళితులను అక్రమంగా బైండ్‌ఓవర్ చేయడం సరికాదని, బైండ్‌ఓవర్ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత ఉత్తర్వులను రద్దు చేయని పక్షంలో తహసీల్దార్ రాములుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు.

***ఆర్టీఐతో వివరాల సేకరణ***

ఆగస్టు 24న బైండ్‌ఓవర్ చేసిన అనంతరం దానికి




సంబంధించిన ఉత్తర్వులు, విచారణ ప్రక్రియ, ఇతర రికార్డుల ప్రతులను ఇవ్వాలని కోరుతూ ఆగస్టు 25న అల్వాల్ తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినట్లు బాధితులు తెలిపారు. వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కుకు సంబంధించిన అంశంగా పేర్కొంటూ 48 గంటల్లో సమాచారం ఇవ్వాలని కోరినప్పటికీ సమాచారం అందలేదని తెలిపారు. దీంతో ఆగస్టు 27న మల్కాజిగిరి ఆర్డీవోకు మొదటి అప్పీల్ దాఖలు చేసినట్లు వెల్లడించారు.

***విచారణ జరిపి న్యాయం చేయాలి***

బైండ్‌ఓవర్ ప్రక్రియలో నిబంధనలు పాటించారా? సంబంధిత వ్యక్తులకు ముందస్తు నోటీసులు ఇచ్చారా? విచారణ నిర్వహించారా? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరపాలని దళిత సంఘాలు కోరుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు తేలితే వాటిని వెంటనే రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, ఆర్డీవో తక్షణమే జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని దళిత సంఘాల ప్రతినిధులు కోరారు.

# ఓటరు సవరణకు బీఎల్‌ఓలకు సహకరించాలి

**- అవసరమైన పత్రాలు అందిస్తే తుది జాబితాలో పేర్లు**

**- గ్రామసభల్లో సందేహాలు నివృత్తి చేసుకోవాలి: అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర): ఓటరు సవరణ ప్రక్రియలో ప్రతి ఓటరు బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓ) సహకరించి, అవసరమైన పత్రాలను సమర్పించాలని మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కీసర మండలం చీర్యాల గ్రామంలో గురువారం నిర్వహించిన ఓటరు సవరణపై గ్రామసభకు అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. 2002 నాటి ఓటరు జాబితాలోని వివరాలను ప్రస్తుత ఓటరు జాబితాలోని వివరాలతో పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఎన్యూమరేషన్ ఫారాల్లో 2002 నాటి వివరాలు లేకపోయినా, చిన్నపాటి పొరపాట్లు లేదా సవరణలు ఉన్నా సంబంధిత పత్రాలను పరిశీలించి నిబంధనల మేరకు సరిచేస్తామని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన బీఎల్‌ఓలు ఓటర్లకు నోటీసులు అందజేస్తారని, ఓటరు గుర్తింపు, చిరునామా తదితర వివరాలకు సంబంధించిన అవసరమైన పత్రాలను సమర్పిస్తే తుది ఓటరు జాబితాలో పేరు ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటర్లు తమ వద్ద అందుబాటులో ఉన్న 11 రకాల అర్హత పత్రాల్లో సంబంధిత పత్రాలను బీఎల్‌ఓలకు అందజేయాలని సూచించారు. తద్వారా ఓటరుతో పాటు కుటుంబ సభ్యుల పేర్లు కూడా తుది జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా చూడవచ్చన్నారు. గ్రామసభలో బీఎల్‌ఓలు తమ పరిధిలోని ఓటరు జాబితాలను పరిశీలిస్తూ మరణించిన వ్యక్తులు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల నమోదైన పేర్ల వివరాలను చదివి వినిపించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు ఫారం6, మరణించిన లేదా అర్హత కోల్పోయిన ఓటర్ల పేర్ల తొలగింపునకు ఫారం7, పేరు, ఫోన్ నంబర్, చిరునామా తదితర వివరాల్లో మార్పులు చేయాల్సిన వారు ఫారం8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వివరించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే గ్రామసభలలోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓలు, అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన చేయూత పెన్షన్ దరఖాస్తు సమాచారం అందరికీ చేరాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27,(విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేయూత పెన్షన్లను మంజూరు చేయనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సమాచారం చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, అధికారులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన పెన్షన్ల కొరకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ చివరి గడువు కావడంతో. మారుమూల గ్రామాల ప్రజలకు సైతం సమాచారం చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు శశిధర్, ఎ.పి.ఓ. (పెన్షన్) రామకృష్ణ, ఎ.పి.ఓ. ధన్‌రాజ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'శక్తి స్కీమ్' జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీవై పార్టీ నిరసన



హైదరాబాద్ ఆగష్టు 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ.విశ్వనాథ్ ) : స్కిల్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనీషియేటివ్(శక్తి)విభాగంలో విలీనం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ,బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శక్తి స్కీమ్ జీవో నంబరు 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్ లో బీసీవై పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ బీసీవై పార్టీ పీఏసీ కమిటీ సభ్యులు రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. పీపీపీ మోడల్‌లో ఈ వ్యవస్థను నిర్వహించడం అంటే ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయడమేనని వారు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ బీసీవై పార్టీ పీఏసీ సభ్యులు బొడ్డు వెంకన్న యాదవ్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, విజయ్ ముదిరాజ్, వివేక్ యాదవ్,పార్టీ కార్యకర్తలు వి.ధనరాజ్, పవన్ ఇతరులు పాలిటెక్నిక్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 22-ఎ భూముల వివరాలు సేకరించండి

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**




వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) : జిల్లాలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22-ఎ (నిషేధిత భూములు) కింద నమోదైన భూముల వివరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, నిర్ణీత ప్రొఫార్మాలో సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లతో 'భూభారతి', 22-ఎ భూములు, సమగ్ర రీ-సర్వే అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూభారతి డేటా ఆధారంగా 22-ఎ భూముల విస్తీర్ణంలో తేడాలు వస్తే, వాటిని భూభారతి పోర్టల్ ద్వారానే సరిచేయాలి. తహసీల్దారుల నుంచి వివరాలు సేకరించి నివేదిక ఇచ్చేందుకు 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' పాటించాలి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని సమగ్ర భూ రీ-సర్వే చేపట్టాలి. అక్కడి ఫలితాల ఆధారంగా మిగిలిన గ్రామాల్లోకి సర్వేను విస్తరిస్తారు. వీసీ అనంతరం జిల్లా రెవెన్యూ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. మండలాల వారీగా 22-ఎ పరిధిలోకి వచ్చే భూములను త్వరితగతిన గుర్తించి నివేదిక అందించాలన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీ-సర్వే నిర్వహించేందుకు వీలుగా వెంటనే సర్వేయర్లను కేటాయించాలని ల్యాండ్ సర్వే ఏడీని ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ టి.వినోద్ కుమార్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ల్యాండ్ సర్వే ఏడీ శ్రీనివాసులు, డి-సెక్షన్ సూపరింటెండెంట్ సునీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో డాక్టర్ చల్మారెడ్డి సేవలు మరువలేనివి

**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) : వైద్య వృత్తి ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన డాక్టర్ చల్మారెడ్డి మృతి వనపర్తి ప్రాంతానికి, వైద్య రంగానికి తీరని లోటని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం వనపర్తిలోని చల్మారెడ్డి స్వగృహానికి వెళ్లిన ఎమ్మెల్యే, ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డాక్టర్ చల్మారెడ్డి వైద్య వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా ప్రజాసేవకే అంకితం చేశారని కొనియాడారు. ముఖ్యంగా విద్యార్థులు వైద్య సేవల కోసం ఆశ్రయించినప్పుడు వారి ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా ఉచితంగా వైద్యం అందించేవారని గుర్తుచేసుకున్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో అనుబంధం ఉన్నప్పటికీ, వైద్యం అందించే విషయంలో ఎలాంటి కుల, మత, వర్గ భేదాలు చూడకుండా ప్రతి ఒక్కరికీ సమానంగా వైద్యసేవలు అందించిన గొప్ప వ్యక్తి ఆయన అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 10 రోజుల్లో టౌన్‌హాల్ పనులు పూర్తి చేయాలి

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) : పట్టణంలోని పాత మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మిస్తున్న టౌన్‌హాల్ పనులను వచ్చే 10 రోజుల్లోగా పూర్తి చేసి అప్పగించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం ఆయన తుది దశకు చేరిన టౌన్‌హాల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సెప్టెంబర్ 15న జరిగే తదుపరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఈ నూతన టౌన్‌హాల్‌లోనే నిర్వహించేలా త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ నిరంజన్, ఇతర అధికారులు ఉన్నారు.

# ఇంధన సౌకర్యాల విస్తరణతో గ్రామీణ ప్రాంతాల రూపురేఖల్లో మార్పు

**చౌటకూరులో పెట్రోల్ బంక్ ప్రారంభం**

**రైతులు, వాహనదారులకు మరింత సౌకర్యం**

**ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి**





చౌటకూర్, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర): గ్రామీణ ప్రాంతాల్లో ఇంధన సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కేంద్రంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఓం ప్రకాష్‌కు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పెట్రోల్ బంక్‌ను గురువారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ బంకులు ఏర్పాటు చేయడం వల్ల రైతులు, వాహనదారులు, సాధారణ ప్రజలకు ఎంతో సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. గతంలో ఇంధనం కోసం సమీప పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేదని, స్థానికంగానే పెట్రోల్, డీజిల్ లభించడం వల్ల ప్రజలకు సమయం, రవాణా ఖర్చులు ఆదా అవుతాయని తెలిపారు.వ్యవసాయ అవసరాలకు సకాలంలో ఇంధనంవ్యవసాయ సీజన్‌లో ట్రాక్టర్లు, పంట కోత యంత్రాలు, డీజిల్ పంపుసెట్లు తదితర వ్యవసాయ పనులకు ఇంధనం సకాలంలో లభించడం రైతులకు పెద్ద ఉపశమనమని ఎమ్మెల్యే అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంధన కేంద్రాలు ఉండటం వల్ల వ్యవసాయ పనుల్లో ఆలస్యం తగ్గడంతో పాటు నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుతాయని స్పష్టం చేశారు.

వాహనదారులకు సౌలభ్యం

స్థానికంగా పెట్రోల్ బంక్ అందుబాటులోకి రావడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, ఇతర వాహనదారులకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయిందని, అత్యవసర సమయాల్లో ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.గ్రామీణ ఉపాధి, ఆర్థిక వ్యవస్థకు ఊతంగ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో మరిన్ని పెట్రోల్, డీజిల్ అవుట్‌లెట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఇలాంటి సౌకర్యాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్కల రాంరెడ్డి, వార్డు సభ్యుడు జైపాల్ రెడ్డి, నాయకులు కాశీరెడ్డి, వీరారెడ్డి, సార గోవర్ధన్ ముదిరాజ్, పల్లె జనార్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ ధ్యేయం

**- బండరావిపాకుల ముంపు బాధితులకు 8.33 కోట్ల పరిహారం అందజేత**

**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి**







వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) : సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు అండగా నిలిచి పూర్తి న్యాయం చేయడమే ప్రజా ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఏదుల రిజర్వాయర్ పరిధిలోని బండరావిపాకుల ముంపు గ్రామానికి చెందిన 125 మంది బాధితులకు రూ.8.33 కోట్ల విలువైన పరిహారపు చెక్కులను గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బండరావిపాకుల, కొంకలపల్లి ముంపు నిర్వాసితుల పరిహారం కోసం ప్రభుత్వం మొత్తం రూ.67 కోట్లు విడుదల చేసిందని వెల్లడించారు. సాంకేతిక, బ్యాంకు ఖాతాల సమస్యలు, ఇతర కారణాల వల్ల చెక్కులు అందని మిగతా వారికి త్వరలోనే పరిహారం అందజేస్తామన్నారు. బాధితుల కష్టాలను గుర్తించి తక్కువ వ్యవధిలోనే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పునరావాస గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు :

బండరావిపాకుల, కొంకలపల్లి, నాగరాల ఆర్ అండ్ ఆర్ కేంద్రాల్లోని అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు అర ఎకరం భూమి కేటాయింపుతో పాటు, పర్యాటక శాఖ ద్వారా రూ.2 కోట్ల నిధులు తీసుకువచ్చేలా చర్యలు వేగవంతం చేస్తున్నామన్నారు. గ్రామాల్లో ఇప్పటికే బిటి రోడ్లు, విద్యుత్, బోర్‌వెల్ సౌకర్యాలు పూర్తి కాగా, పెండింగ్‌లో ఉన్న నీటి ట్యాంకుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందించిన పరిహారాన్ని నిర్వాసితులు భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడేలా ఆర్థిక ప్రణాళికతో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేగంగా బాధితులకు పరిహారం – కలెక్టర్ ఆదర్శ్ సురభి

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ముంపు బాధితులకు పరిహారం వేగంగా విడుదలయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. లబ్ధిదారులు ఈ పరిహారాన్ని తమ జీవనోపాధిని మెరుగుపరుచుకోవడానికి వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, గోపాల్‌పేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకటేష్, వైస్ ఛైర్మన్ సత్య శీలా రెడ్డి, ఆర్ అండ్ ఆర్ కమిటీ సభ్యులు, రెవెన్యూ అధికారులు, సర్పంచ్ రాజు, ప్రజాప్రతినిధులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావులేదు

**- మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి,**

**- ఫారం పాండ్ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశం,**

**- వెన్నచర్ల పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



పెద్దకొత్తపల్లి ఆగస్టు 27 : (విజన్ ఆంధ్ర) : మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలకు పట్టణ ప్రాంతాల్లో లభించే స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురువారం కొల్లాపూర్ నియోజకవర్గం పెద్దకొత్తపల్లి మండలంలోని వెన్నచర్ల, నక్కలపల్లి గ్రామాలలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వెన్నచర్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, చికిత్స విధానం, ప్రసూతి సేవలు, అత్యవసర వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్యం అందించాలని, వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. వైద్య సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ సేవాభావంతో పనిచేయాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత నమ్మకం కలిగేలా కృషి చేయాలని ఆదేశించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెల ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి, ఎంతమంది రోగులకు ఓపీ సేవలు అందుతున్నాయి, ఎన్ని రక్త నమూనాలు సేకరిస్తున్నారు అనే వివరాలను వైద్యులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రిలోని ప్రసవ గది, ప్రయోగశాలను పరిశీలించడంతో పాటు సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ఓపీకి వస్తున్న రోగుల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నక్కలపల్లి గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ గ్రామసభలో కలెక్టర్ పాల్గొని. అనంతరం గ్రామానికి చెందిన రైతు బోలె ఈశ్వరయ్య పొలంలో వి.బి.జీ. రాంజీ పథకం కింద నిర్మించనున్న ఫారం పాండ్ నిర్మాణ పనులను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రారంభించారు. నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని తెలిపారు.వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం, పంటలకు అవసరమైన నీటిని అందుబాటులో ఉంచడంలో ఫారం పాండ్లు కీలకంగా ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న నీటి సంరక్షణ కార్యక్రమాలు ఆశించిన ఫలితాలు ఇవ్వాలంటే పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న ఫారం పాండ్ పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం, నిర్ణీత గడువులో పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజాధనం సద్వినియోగం అయ్యేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు గ్రామీణ ప్రజలకు నేరుగా చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు అందించే ప్రతి సేవలో పారదర్శకత, జవాబుదారీతనం, నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ బన్సీలాల్, తహశీల్దారు, గ్రామ సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

# మహాయాగం ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా కేంద్రంలో ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 13 వరకు నిర్వహించనున్న 92వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవ ఏర్పాట్లను స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి గురువారం పరిశీలించారు. శ్రీ కృష్ణ యాగచక్రం ఆధ్వర్యంలో, శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ దివ్య మంగళ శాసనములతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యాగశాల పనుల పురోగతిని నిర్వాహకులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, కార్యక్రమ విజయవంతానికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఏర్పాట్లకు సంబంధించి ఏ అవసరం ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మాధవి రమేష్, వైస్ ఛైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్ విభూది మహేశ్వరి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కదిరే రాముడు, జిల్లా యూత్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, పెబ్బేరు మండల అధ్యక్షుడు యాపర్ల రామిరెడ్డి, నాయకులు బ్రహ్మంచారి, బి. కృష్ణ, చుక్క రాజు, పాల రవి, చీర్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- నోడల్ అధికారిపై చర్యలకు ఆదేశం**

**- ప్రభుత్వ, ప్రైవేటు వైద్యుల సమీక్షా సమావేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో డెంగ్యూ నివారణకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. వర్షాకాల సీజనల్ వ్యాధుల నియంత్రణపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇటీవల వనపర్తి పట్టణంలో డెంగ్యూతో బాలిక మృతి చెందిన ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడంలో నిర్లక్ష్యం వహించిన నోడల్ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్వోను ఆదేశించారు. ఇకపై జిల్లాలో ఒక్క డెంగ్యూ మరణం కూడా సంభవించకూడదని స్పష్టం చేశారు. జ్వరంతో ఆసుపత్రులకు వచ్చే వారికి నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయాలి. అనుమానితులకు ర్యాపిడ్, ఎలిసా పరీక్షలు నిర్వహించి ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించాలి. డెంగ్యూ పాజిటివ్ రోగుల పేరు, చిరునామా వివరాలను తక్షణమే ఆరోగ్య శాఖకు తెలియజేయాలి. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత, యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టడానికి వీలవుతుంది. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి. నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి. డెంగ్యూ, సీజనల్ వ్యాధుల రహిత జిల్లాగా మార్చేందుకు వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీ శాఖలు కలిసికట్టుగా పనిచేయాలి. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ బాబు, ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు పాల్గొన్నారు.

# జలమండలి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**-బీఆర్ఎస్ కేవీ మల్కాజిగిరి అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్**



మల్కాజిగిరి, ఆగస్ట్ 27,(విజన్ ఆంధ్ర) : జలమండలిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు కోరారు. గురువారం వారు, బీఆర్ఎస్ కేవీ మల్కాజిగిరి అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను, ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కేటగిరి2 కార్మికుల సమస్య లతో పాటు, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు సంబంధించిన సమస్య లను త్వరితగతిన పరిష్క రించాలని కోరారు. కార్మి కుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ కేవీ నాయకులు అశోక్, ప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ వరదల్లో మాజీ ఎమ్మెల్యే భార్య గల్లంతు

కోల్‌కతా,ఆగస్ట్27 : తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే శుభ్రాన్షు రాయ్ భార్య శర్మిష్ట భౌమిక్ రాయ్ నేపాల్ వరదల్లో గల్లంతయ్యారు. శర్మిష్ట కోల్‌కతాకు చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా కైలాస మానససరోవర యాత్ర కోసం ఆగస్టు 21వ తేదీన నేపాల్ వెళ్లారు. ఆమె ఆగస్టు 25వ తేదీ మంగళవారం రాత్రి 11:30 గంటల సమయంలో శుభ్రాన్షు రాయ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తాను టిబెట్ సరిహద్దుకు సమీపంలోని 'కైరోంగ్' ప్రాంతంలో ఉన్నట్లు భర్తతో చెప్పారు. బుధవారం ఉదయం నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో భారీ ఎత్తున మెరుపు వరదలు వచ్చాయి. అప్పటినుంచి శర్మిష్టతో కమ్యూనికేషన్ పూర్తిగా తెగిపోయింది. తన భార్య పేరు మిస్సింగ్ లిస్ట్‌లో ఉందని శుభ్రాన్షు రాయ్ ధ్రువీకరించారు. కేవలం శర్మిష్ఠ మాత్రమే కాకుండా, ఆమెతో పాటు యాత్రకు వెళ్లిన కోల్‌కతాకు చెందిన 32 మంది యాత్రికుల బృందం ఆచూకీ లేకుండా పోయింది. వారి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు భారత రాయబార కార్యాలయాన్ని, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆశ్రయించారు.

## ఆర్టీసీ ఎక్స్ రోడ్స్‌లో ఏఎస్‌బిఎల్ లెగసీ ప్రారంభం




హైదరాబాద్, ఆగస్ట్ 27 (విజన్ ఆంధ్ర) : సెంట్రల్ హైదరాబాద్‌లోని ఆర్టీసీ ఎక్స్ రోడ్స్‌లో ఏఎస్‌బిఎల్ తన కొత్త నివాస ప్రాజెక్ట్ ఏఎస్‌బిఎల్ లెగసీని ప్రారంభించినట్లు ఏఎస్‌బిఎల్ సీఈఓ, వ్యవస్థాపకుడు అజితేష్ కొరుపోలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సుమారు 7.97 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో జి ప్లస్ 50 అంతస్తుల మూడు టవర్లు, 3, 4 బీహెచ్‌కే గృహాలు ఉన్నాయన్నారు. రూ.1.99 కోట్ల ప్రారంభ ధరతో అందుబాటులో ఉండే ఈ ప్రాజెక్ట్‌లో 74 వేల చదరపు అడుగుల క్లబ్‌హౌస్, 50కి పైగా సౌకర్యాలు, 73.25 శాతం ఓపెన్ స్పేస్ ఉన్నాయని తెలిపారు. లెగసీలో స్విమ్మింగ్ పూల్, బ్యాడ్మింటన్, ఫుట్‌సాల్, పికిల్‌బాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు, క్రికెట్ నెట్స్, స్కేటింగ్ రింక్, జాగింగ్ ట్రాక్, పెట్ పార్క్ తదితర సౌకర్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. సెంట్రల్ హైదరాబాద్‌లో గేటెడ్ కమ్యూనిటీలకు డిమాండ్ ఉన్నప్పటికీ, పెద్ద స్థలాల కొరత కారణంగా సరఫరా తక్కువగా ఉందన్నారు. 2017లో స్థాపితమైన ఏఎస్‌బిఎల్ ఇప్పటికే ఏఎస్‌బిఎల్ బ్రాడ్‌వే, ఏఎస్‌బిఎల్ ల్యాండ్‌మార్క్ వంటి ప్రాజెక్టులను చేపట్టినట్లు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తా

**- 57 వ డివిజన్ కార్పొరేటర్ గాజుల ముఖేష్ గౌడ్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 27,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లోని 57 వ డివిజన్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించే విదంగా కృషి చేస్తానని భారతీయ జనతా పార్టీ 57 వ డివిజన్ కార్పొరేటర్ గాజుల ముఖేష్ గౌడ్ అన్నారు. గురువారం 57 వ డివిజన్ లో ఏర్పాటు చేసిన వార్డు సభలో అయన మాట్లాడారు. వార్డులో కొన్ని చోట్ల తొలగించాల్సిన విద్యుత్ ఎలక్ట్రికల్ పోల్ లు,వీధి దీపాలు సంబంధిత విద్యుత్ ఏ ఈ కి తెలియజేశారు. అదేవిదంగా డివిజన్ లోని వార్డులో శానిటేషన్ సమస్యలను వార్డు ఇంచార్జి మహేందర్ కు తెలుపడం జరిగింది.అంతే కాకుండ వార్డులో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ లోని వార్డుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ఎలాంటి సమస్యలు ఉన్న త్వరితగతిన పరిష్కరిస్తానని పేర్కొన్నారు. సర్ (ఎస్ ఐ ఆర్ ) సవరణ అనంతరం నోటీసులు వచ్చిన వారు ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఏదైన ధ్రువీకరణ పత్రం సమర్పించలన్నారు.ఈ కార్యక్రమం లో 57వ డివిజన్ ఇంచార్జ్ తరుణ్ సింగ్, మైలారం శ్రీనివాస్, శ్రీవిజయ్,బిజెపి జిల్లా వివిధ కోకన్వీనర్లు పెండం సతీష్, కె.సదానందం, గడియారం మురళి, కే.భాస్కర్ ,తదితరాలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27,(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఏకరూప దుస్తులు, బూట్లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చదువులు రాణించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలకు గైర్హాజరు అవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఇంగ్లీష్ గణితం సైన్స్ సబ్జెక్టులలో విద్యార్థులు పట్టు సాధించేలా ప్రయోగాత్మకంగా బోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జి.సి.డి.ఓ. శకుంతల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలతో నివేదికలు సమర్పించాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27, (విజన్ ఆంధ్ర) : జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలతో నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. వినయ్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసిల్దార్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలతో కూడిన నివేదికలు సిద్ధం చేయాలని తెలిపారు. లావుని పట్టా, సీలింగ్, ప్రభుత్వ భూములు, అటవీ, దేవాదాయ, వక్ఫ్, రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఆస్తులు, విచారణ సంస్థలు అటాచ్ చేసిన ఆస్తులను నిషేధిత జాబితాలోని కేటగిరీలలో చేర్చాలని తెలిపారు. ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు, కాలువల అభివృద్ధి పనుల కొరకు సేకరించిన భూములను జాబితాలో చేర్చాలని తెలిపారు. సాదాబైనమా, రెవెన్యూ సదస్సులు, భూభారతిలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ప్రజావాణిలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, నాయబ్ తహసిల్దార్లు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 30లోపు సమస్యలు పరిష్కరించాలి లేకుంటే చలో అసెంబ్లీ తప్పదు.

**- సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాల్సిందే.**

**- టీజీజాక్ జిల్లా చైర్మన్ నరసింహారెడ్డి..**



నారాయణపేట, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) : ఉద్యోగుల సహనానికి కూడా ఒక హద్దు ఉంటుందని, ఆ హద్దును దాటితే ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ (టీజీజాక్ ) జిల్లా చైర్మన్ నరసింహారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 30లోపు ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని అమలు చేయాలని,



లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేసి చలో అసెంబ్లీకి పిలుపునిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ఉద్యోగ జేఏసీ పిలుపు మేరకు గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు ఎదుట జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో భారీ మహాధర్నా నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. హామీలు అమలు చేయాలి.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి.. పీఆర్సీ వెంటనే ప్రకటించాలి.. డీఏలు విడుదల చేయాలి.. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం ఉద్యోగుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంకకు అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. కరోనా అనంతరం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఉద్యోగులు రెండున్నరేళ్ల పాటు తమ వ్యక్తిగత ఆర్థిక ఇబ్బందులను పక్కనపెట్టి ప్రభుత్వానికి సహకరించారని తెలిపారు. అయితే ఉద్యోగుల సహనాన్ని ప్రభుత్వం బలహీనతగా భావించడం సరికాదన్నారు. నెల రోజుల్లో పీఆర్సీ అమలు చేస్తామని ఉద్యోగ జేఏసీకి ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాకపోవడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఉద్యోగులు ప్రజా పాలనకు వెన్నెముకలాంటి వారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేస్తున్న ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగించడం సాధ్యం కాదన్నారు. ఉద్యోగుల కష్టాన్ని, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని, పదవీ విరమణ అనంతర భద్రతను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని సూచించారు. ఇకపై హామీలతో కాలం వెళ్లదీయడం, కమిటీల పేరుతో జాప్యం చేయడం, సమస్యలను నాన్చడం వంటి విధానాలను సహించబోమని స్పష్టం చేశారు.ఉద్యోగుల నుంచి ప్రతి నెలా ఆరోగ్య పథకానికి చందాలు వసూలు చేస్తున్న ప్రభుత్వం.. అదే ఉద్యోగులకు అవసరమైన సమయంలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందించడంలో ఎందుకు జాప్యం చేస్తోందని నరసింహారెడ్డి ప్రశ్నించారు. ఉద్యోగుల జీతాల నుంచి మూడు నెలలుగా ఆరోగ్య పథకం చందాలను క్రమం తప్పకుండా వసూలు చేస్తూ, పథకం అమలులో మాత్రం నిర్లక్ష్యం చేయడం ఉద్యోగులను మోసం చేయడమేనని మండిపడ్డారు. ఉద్యోగులు తమ జీతాల నుంచి చందాలు చెల్లిస్తున్నప్పుడు వారికి, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఉద్యోగ ఆరోగ్య పథకాన్ని కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా ఆసుపత్రుల్లో సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగుల వేతనాలకు అనుగుణంగా జీవన వ్యయం పెరిగిందన్నారు. సమయానికి రావాల్సిన డీఏలను నిలిపివేయడం, పీఆర్సీని ఆలస్యం చేయడం వల్ల ఉద్యోగులు ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఉద్యోగుల హక్కులను వాయిదా వేస్తూ పోతే ఆ వాయిదా ఉద్యమాల రూపంలో ప్రభుత్వానికే తిరిగి వస్తుందని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులను కూడా తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు చేసిన పనికి సంబంధించిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం వల్ల వ్యక్తిగత ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఉద్యోగులకు వృద్ధాప్యంలో సామాజిక భద్రత కల్పించాలంటే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాల్సిందేనని జేఏసీ భాగస్వామ్య సంఘాల నాయకులు స్పష్టం చేశారు.దశాబ్దాల పాటు ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. పెన్షన్ అనేది ఉద్యోగుల దయనీయ పరిస్థితిపై ఆధారపడే అంశం కాదని, అది వారి దీర్ఘకాలిక సామాజిక భద్రతకు సంబంధించిన హక్కు అని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయంలో ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోరని తేల్చిచెప్పారు.విద్యాశాఖలో కామన్ సర్వీస్ రూల్స్ లేకపోవడం వల్ల ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ తీవ్రంగా ప్రభావితమవుతోందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఏళ్ల తరబడి పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.విద్యాశాఖ ఉద్యోగులకు కామన్ సర్వీస్ రూల్స్‌ను వెంటనే అమలు చేసి, పదోన్నతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఉపాధ్యాయులలో నెలకొన్న అసంతృప్తిని ప్రభుత్వం మరింత పెంచకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు.ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సెప్టెంబర్ 30లోపు స్పష్టమైన నిర్ణయం తీసుకుని అమలు చేయాలని టీజీజాక్ నాయకులు డెడ్‌లైన్ విధించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని దశలవారీగా తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఉద్యోగుల సహనాన్ని పరీక్షించొద్దు.. సమస్యలను ఇకపై నాన్చొద్దు.. సెప్టెంబర్ 30లోపు డిమాండ్లు పరిష్కరించండి. లేకపోతే చలో అసెంబ్లీకి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారు అని నరసింహారెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల హెచ్చరికను తేలికగా తీసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వంపై ఉద్యోగులు చేస్తున్న ఒత్తిడి కాదని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మాత్రమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ భాగస్వామ్య సంఘాల నాయకులు దామోదర్, వై. జనార్దన్‌రెడ్డి, శివరాములు, దేవేంద్రప్ప, హైమావతి, వెంకటస్వామి, సూర్యచంద్ర, యశ్వంత్, కో-కన్వీనర్లు రెడ్డప్ప, బాలాజీ, మల్లికార్జున్, హుస్సేనప్ప, వెంకటప్ప, గజలప్ప, బాలరాజ్, శంకర్, మాణిక్యప్ప, రమేష్, రాజేందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్, మోహన్‌రావు, ఏ. సత్యనారాయణరెడ్డి, రఘువీర్, హనుమాన్ శేఖర్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యాలయానికి ఫ్యాన్ బహుకరణ విద్యార్థుల శ్రేయస్సే ప్రథమ కర్తవ్యం..

**- సేవా కార్యక్రమాలతో దంపతుల వివాహ వార్షికోత్సవం**



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27(విజన్ ఆంధ్ర);- వివాహ వార్షికోత్సవాన్ని వేడుకలకు మాత్రమే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమానికి వేదికగా మార్చుకున్నారు వర్ధన్నపేట పట్టణానికి చెందిన ప్రజాకలం వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఎంజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసునూరి మురళిఅరుణ దంపతులు. తమ రెండు దశాబ్దాల వైవాహిక జీవితాన్ని పురస్కరించుకుని జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలకళాశాల డార్మిటరీకి ఫ్యాన్‌ను బహుకరించారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించాలన్న ఉద్దేశంతో ఈ సహాయ కార్యక్రమాన్ని చేపట్టారు. తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గత 20 ఏళ్లుగా వృద్ధులు, అనాథ పిల్లలు, రోగులు తదితరులకు తమకు తోచిన రీతిలో సహాయం చేయడం ద్వారా ఆత్మసంతృప్తి పొందుతున్నామని పసునూరి మురళి తెలిపారు.

**సేవలోనే నిజమైన సంతృప్తి**

సమాజంలో అవసరంలో ఉన్న వారికి చేయూత అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆడంబరాలకు దూరంగా, తమ సంతోషాన్ని ఇతరుల అవసరాలకు ఉపయోగపడేలా మలచుకోవడమే తమ కుటుంబం అనుసరిస్తున్న విధానమన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అందించే చిన్నపాటి సహాయం కూడా వారి చదువు, ఆరోగ్యం, భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతుందని తెలిపారు. దేవుడు చల్లగా దీవిస్తే రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలు, అనాథలు, వృద్ధులు, విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తానని మురళి తెలిపారు. వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ద్వారా తమ ఆనందాన్ని మరింత రెట్టింపు చేసుకున్నామని ఆయన అన్నారు.

**విద్యార్థుల అవసరాలకు అండగా నిలవాలి**

గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల అవసరాలను గుర్తించి దాతలు, స్వచ్ఛంద సంస్థలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ముందుకు రావాలని పలువురు కోరారు. విద్యార్థుల సౌకర్యాల కోసం అందించే ప్రతి సహాయం వారి విద్యాభ్యాసానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. మురళిఅరుణ దంపతుల సేవాభావాన్ని పలువురు అభినందించారు.

## నీట్ పీజీ పరీక్షకు పటిష్టమైన భద్రతా చర్యలు

**- అన్ని శాఖల సమన్వయంతో పూర్తి ఏర్పాట్లు**

**- మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణ రెడ్డి**

**- శ్రీచక్ర కాలేజీలో డిజిటల్ పరీక్షా కేంద్రం పరిశీలన**



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర ) : నీట్ పీజీ పరీక్షకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణ రెడ్డి చెప్పారు. ఇబ్రహీంపట్నం శేరిగూడ శ్రీచక్ర కాలేజీలో టీసీఎస్ ఐఓఎన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి పరిశీలించారు. శ్రీ చక్ర కాలేజీలో టిసిఏస్ ఐఓఎన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో ఈనెల 30న నిర్వహించనున్న నీట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరుకానున్న నేపథ్యంలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ రాజు, తహసీల్దార్ సునీతరెడ్డి, సీఐ మహేందర్ రెడ్డి గురువారం పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, అభ్యర్థుల రాకపోకలు, పరీక్షా కేంద్రం వద్ద కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై అధికారులు సమీక్షించారు. పరీక్ష సమయాల్లో విద్యార్థులు, వారి వెంట వచ్చే తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డీసీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ... నీట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వాహనాల రాకపోకలను నియంత్రిస్తామని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని డీసీపీ వెల్లడించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో అనవసరంగా వాహనాలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, పరీక్షకు వచ్చే విద్యార్థులు సమయానికి కేంద్రానికి చేరుకునేలా ట్రాఫిక్ సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ జితేందర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.




## బ్యాంక్ ఉద్యోగులకు ఐదురోజుల పని దినాలు అమలు చేయాలి

**- యూ ఎఫ్ బి యూ ఆధ్వర్యంలో నిరసన**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 27,(విజన్ ఆంధ్ర ) : బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఐదురోజుల పనిదినాలు అమలు చేయాలని గురువారం పట్టణంలోని రెడ్డి కాలనీలో గల ఎస్ బి ఐ బ్రాంచ్ వద్ద సాయంత్రం వివిధ బ్యాంక్ ల ఉద్యోగులు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ బి ఐ ఎస్ యు హెచ్ ప్రాంతీయ కార్యదర్శి కే. శ్రీనివాస్ మాట్లాడుతూ యు ఎఫ్ బి యు ఇచ్చిన పిలుపుమేరకు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. జోగుల మధ్య విభజన చేస్తూ పక్షపాత ధోరణిని అవలంబించడం సరైనది కాదని బ్యాంకింగ్ ఉద్యోగులకు అందరికీ సమాన పి ఎల్ ఐ వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. బ్యాంకింగ్ రంగంలో తీసుకుని ఏ నిర్ణయమైనా యూనియన్ తో చర్చించి అమలు చేసే దిశగా కృషి చేయాలన్నారు. బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న అనేక సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. యు ఎస్ బి యు ఆధ్వర్యంలో చేపట్టే బ్యాంకింగ్ ఉద్యోగుల సమస్యలపై ఐక్యతతో పోరాటం చేస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజిఎస్ సతీష్ కుమార్ ఎం వసంత్ కుమార్ బాలరాజు విష్ణు కుమారస్వామి చంద్రమౌళి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించే వరకు పోరాటం కొనసాగిస్తాం..



సూర్యాపేట ఆగస్టు 27:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని మున్సిపల్ మాజీ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం రైతు బజార్ వద్ద సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కోసం బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో 14వ రోజు కూర్చున్న ఐద్వా మహిళలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ వెళ్లడం ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అని పేర్కొన్నారు. ప్రతిపాదిత అలైన్‌మెంట్‌ను మార్చకుండా సూర్యాపేట, కోదాడ మీదుగా బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధించే వరకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సూర్యాపేట అభివృద్ధి, భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల డిమాండ్‌ను సానుకూలంగా పరిశీలించాలని కోరారు. బుల్లెట్ ట్రైన్ సాధన కోసం కొనసాగుతున్న దీక్షకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ దీక్షలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎల్గూరి జ్యోతి, 8వ వార్డు టిఆర్ఎస్ కౌన్సిలర్ పోతురాజు ఇందుశ్రీ, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ బంధంతో మేడిపల్లి పోలీసులు..

**- సహచరి మహిళలతో ఆత్మీయ కలయిక**



మేడిపల్లి, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర): రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మేడిపల్లి పోలీస్ ఇన్స్పెక్టర్ జలేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సహచరి మహిళలతో ఆత్మీయ కార్యక్రమం నిర్వహించారు. గురువారం పోలీసు అధికారులు, ఎస్ఐలు, పెట్రోలింగ్ సిబ్బంది, బీసీఎస్ సిబ్బంది సహచరి ఇండ్లను సందర్శించారు. ఈ సందర్భంగా సహచరి సభ్యులు పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోలీసు సిబ్బంది మహిళలకు చీరలు, బ్లౌజ్‌లు, శాలువాలు, పసుపు, కుంకుమ తదితర కానుకలను అందజేశారు. పోలీసులకు, మహిళలకు మధ్య ఆత్మీయతను పెంపొందించేలా ఈ కార్యక్రమం సాగింది. అనంతరం సహచరి సభ్యులతో పోలీసు అధికారులు ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, మహిళల భద్రత, వ్యక్తిగత రక్షణ, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తత వంటి అంశాలపై వివరించారు. సైబర్ నేరగాళ్ల మోసపూరిత కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించకుండా జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద లావాదేవీలు జరిగినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్లు నర్సింగ్ రావు, రవి, పెట్రోలింగ్ కానిస్టేబుల్లు రమేష్, తదితరులు పాల్గోన్నారు.

# నిషేధిత గడ్డి మందు అక్రమ రవాణా ఇద్దరు వ్యక్తులు అరెస్ట్




బెజ్జూర్ ఆగస్టు 27(విజన్ ఆంధ్ర) కొమరం భీం జిల్లా బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత గడ్డి మందును అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. బెజ్జూర్ మండల సులుగుపల్లి గ్రామ నివాసులయిన బోర్కుట్ పురుషోత్తం మరియు డేటి సుధాకర్ అను ఇద్దరూ మహారాష్ట్ర రాష్ట్రంలోని అహేరి ప్రాంతం నుంచి నిషేధిత గడ్డి మందును కొనుగోలు చేసి, 20 లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు క్యాన్లలో తీసుకువచ్చారు. సులుగుపల్లి గ్రామం మరియు పరిసర ప్రాంతాల్లో ప్రజలను మోసం చేసే ఉద్దేశంతో నిషేధిత గడ్డి మందును విక్రయించేందుకు తరలిస్తున్న సమయంలో, విశ్వసనీయ సమాచారం మేరకు బెజ్జూర్ పోలీసులు కృష్ణపల్లి బ్రిడ్జి వద్ద ఈరోజు ఉదయం సుమారు 6:00 గంటలకు వారిని పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న నిషేధిత గడ్డి మందుతో కూడిన 20 లీటర్ల రెండు క్యాన్లను, అలాగే రెండు మొబైల్ ఫోన్లను ఒక స్కూటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై బెజ్జూర్ పోలీసులు కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిషేధిత మందులు, అక్రమ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు లేదా రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితా పై సమీక్ష

**- వికారాబాద్ మునిసిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 ( విజన్ ఆంధ్ర ) : భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో 25 జూన్ 2026 నుండి ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం నిర్వహింపబడినదని వికారాబాద్ మునిసిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి అన్నారు. 17 ఆగస్ట్ 2026 న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మీ పేరు లేనట్లయితే బిఎల్ఓ, ఏఈఆర్ఓ, ఈఆర్ఓలను సంప్రదించాలని ఆయన సూచించారు. 17.08.2026 నుండి 16.09.2026 వరకు క్లెయిములు, అభ్యంతరాలు స్వీకరిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఫారం-6 : 01.01.2026 నాటికి 18 సం. నిండిన వారికి కొత్త ఓటు నమోదు. ఫారం-7 : చనిపోయిన లేదా డూప్లికేట్ ఓటర్ల తొలగింపు. ఫారం-8 : మొబైల్ నెంబర్, చిరునామా, ఓటర్ కార్డు సవరణలకు, తుది ఓటర్ల జాబితా ప్రచురణ 19.10.2026. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ స్వర్ణలత మున్సిపల్ కమిషనర్ జై సింహా రెడ్డి డ్యూటీ ఎమ్మార్వో శ్రీనివాస్ గౌడ్ జిపిఓ సుధా వార్డ్ ఆఫీసర్ శ్రీకాంత్ బిఎల్ఓలు యాదమ్మ, సునంద మాజీ కౌన్సిలర్ రెడ్యా నాయక్ మాజీ కౌన్సిలర్ జైదుపల్లి మురళి నంది అంజయ్య బాలరాజు కురువ శీను భాగయ్య రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ హియరింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రతిమా సింగ్

**- నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులోగా ధృవపత్రాలు సమర్పించాలి**

**- హియరింగ్ తేదీలపై గ్రామాల్లో దండోరా ద్వారా విస్తృత ప్రచారం చేయాలి**



కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 27(విజన్ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపాలిటీ 10వ వార్డు, గాంధారి మండలం చాడ్మల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) హియరింగ్ కేంద్రాలను జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హియరింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందుతున్న సేవలు, నోటీసులు అందుకున్న వారి వివరాలు, ధృవపత్రాల సమర్పణ ప్రక్రియ, హియరింగ్ నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులోగా సంబంధిత ధృవపత్రాలను హియరింగ్ కేంద్రంలో తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ అభ్యంతరాలు, ఆధారాలను సమర్పించేలా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. హియరింగ్ తేదీలపై ఓటర్లకు ముందస్తుగా సమాచారం అందేలా అన్ని మండలాల తహసీల్దార్లు సంబంధిత గ్రామాల్లో దండోరా వేయించి విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. హియరింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో ఎల్లారెడ్డి ఆర్డీవో రొడ్డ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్, గాంధారి తహసీల్దార్, సంబంధిత సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక వడ్డీ రుణాలు.. ఉద్యోగాల పేరుతో మోసాలు

**- మోసగాళ్లను ఉపేక్షించేది లేదు: ఎస్పీ రోహిత్ రాజు**



కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 28(విజన్ ఆంధ్ర) : అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసేవారితో పాటు, ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసి డబ్బులు వసూలు చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ హెచ్చరించారు. ప్రజల ఆర్థిక అవసరాలు, ఇబ్బందులను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ వ్యక్తులు అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి, అనంతరం అసలు మొత్తానికి మించి భారీగా డబ్బులు వసూలు చేయడం, రుణాలు చెల్లించలేని పరిస్థితుల్లో బెదిరింపులు, వేధింపులకు పాల్పడడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమ వడ్డీ వ్యాపారాలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. ప్రజలు అత్యవసర ఆర్థిక అవసరాల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద రుణాలు తీసుకునే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రుణం తీసుకునే ముందు వడ్డీ రేటు, తిరిగి చెల్లింపు విధానం, ఇతర నిబంధనలను పూర్తిగా తెలుసుకోవాలని తెలిపారు. అధిక వడ్డీలు వసూలు చేస్తూ బెదిరింపులకు లేదా వేధింపులకు పాల్పడే వారి గురించి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

**ఉద్యోగాల పేరుతో మోసాలకు దూరంగా ఉండాలి**

ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగ యువతను ప్రలోభపెట్టి డబ్బులు వసూలు చేసే మోసగాళ్ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ముందుగానే డబ్బులు అడిగే వ్యక్తుల మాటలను నమ్మవద్దని, ఉద్యోగం కోసం ఎటువంటి ముందస్తు చెల్లింపులు చేయవద్దని స్పష్టం చేశారు. ఉద్యోగాలకు సంబంధించిన ఖాళీలు, నియామక ప్రక్రియ, ఎంపిక విధానం తదితర వివరాలను సంబంధిత సంస్థల అధికారిక వెబ్‌సైట్లు, అధికారిక నోటిఫికేషన్ల ద్వారా మాత్రమే నిర్ధారించుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, మధ్యవర్తులు లేదా సోషల్ మీడియా ప్రకటనలను నమ్మి డబ్బులు చెల్లిస్తే మోసపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉద్యోగాలు, ఆర్థిక ప్రయోజనాలు, రుణాలు తదితర అంశాల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, సోషల్ మీడియా ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, ఏటీఎం లేదా ఇతర ఆర్థిక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. అధిక వడ్డీలు వసూలు చేస్తూ ప్రజలను వేధిస్తున్న వారు, ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేస్తున్న వ్యక్తుల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసు అధికారులకు తెలియజేయాలని ఎస్పీ రోహిత్ రాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలను ఆర్థికంగా దోచుకునే, మోసాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.


# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉంది

**- ఎమ్మెల్యే నాయిని**



హనుమకొండ, జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 ( విజన్ ఆంధ్ర ) : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలో తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలనే తనకు కూడా ఉందని, సమస్యలపై పోరాడకుండా, తప్పించుకుని తిరగడం తనకు అలవాటు లేదన్నారు. ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఇప్పటికే చర్చించిన తర్వాతే తాను ధర్నా కార్యక్రమానికి హాజరయ్యానని తెలిపారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లైన రెండో పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం ( సిపిఎస్ ) పునరుద్ధరణ, పెండింగ్‌లో ఉన్న డీఏల మంజూరు, ఉద్యోగులుపెన్షనర్ల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే శుభవార్త వస్తుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. హెల్త్ కార్డులు, రిటైర్మెంట్‌కు సంబంధించిన సమస్యలతో పాటు ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఇతర ఇబ్బందుల పరిష్కారానికి సంబంధిత మంత్రులు, ఆర్థిక శాఖతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ, ఒక్కో సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు ఎలాంటి సమస్యను ఎదుర్కొన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ముఖ్యమంత్రిని కలసి సమస్యపై చర్చించేందుకు తాను కూడా వారితో కలిసి వస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా, వ్యవస్థాత్మకంగా ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉద్యోగులు వివిధ పార్టీలకు అభిమానులుగా ఉండవచ్చుని, అయితే ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరిపి, సమన్వయంతో ముందుకు వెళ్తే సమస్యలు తప్పకుండా పరిష్కారమవుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తాను ధర్నాకు వచ్చే ముందు కూడా ప్రభుత్వ పెద్దలతో సమస్యలపై సుదీర్ఘంగా చర్చించానని, ఏ విధంగా ముందుకు వెళ్లాలి, సమస్యలను ఎలా పరిష్కరించాలి అనే అంశాలపై చర్చించిన తర్వాతే ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆశీర్వాదంతో ఈ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా జన్ను నర్సయ్య



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు27(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలంలోని గోపనపల్లి గ్రామానికి చెందిన జన్ను నర్సయ్య తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఎంపిక కావడంతో గ్రామ సర్పంచ్ నాంపల్లి విజయ అశోక్ ల ఆధ్వర్యంలో నర్సయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాంపల్లి విజయ అశోక్ మరియు ఉపసర్పంచ్ కొలిపాక రావాలి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మిట్టపెల్లి నాగార్జున మరియు ఆలయ చైర్మన్ కారింగుల రాము వార్డ్ మెంబర్లు నాంపల్లి నీలమ్మ, రొడ్డ దిలీప్, అల్లాడి సుజాత వివిధ పార్టీ నాయకులు బాధ నరసింగరావు, నాంపల్లి బిక్షపతి, ముంజల సారయ్య ,ముప్పిడి కొమ్మాలు ,దొనకల బచ్చయ్య బెల్లం కొమురయ్య, కొల్లిపాక ఉపేంద్ర లో పాల్గొన్నారు

# ద్వారక నగర్‌లోని 8, 9వ వార్డుల్లో ఓటర్ల జాబితాపై వార్డు సభ



కాగజ్‌నగర్, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ పట్టణంలోని ద్వారక నగర్ 8, 9వ వార్డుల్లో గురువారం SIR ఫేజ్-2 ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా పరిశీలన కోసం వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఓటర్ల జాబితాను వార్డు ప్రజలకు చదివి వినిపించారు. జాబితాలోని ఓటర్ల పేర్లు, వివరాలను స్థానికుల సమక్షంలో పరిశీలించారు. ఓటర్ల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలను అధికారులు స్వీకరించారు. పేర్లలో తప్పులు ఉన్నట్లయితే వాటి సవరణకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. అలాగే ఓటర్ల చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు ఉంటే వాటిని నమోదు చేశారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఓటర్లు తమ పేర్లు, వివరాలను స్వయంగా పరిశీలించుకోవాలని సూచించారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని తెలిపారు. SIR ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాలను పారదర్శకంగా పరిశీలిస్తున్నట్లు అధికారులు వివరించారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య లక్ష్మణ్ పాల్గొన్నారు. 9వ వార్డు కౌన్సిలర్‌తో పాటు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు యూసఫ్ ఖాన్ హాజరయ్యారు. బీఎల్ఓలు, స్థానిక ప్రజలు పాల్గొని ఓటర్ల జాబితాను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించేలా జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక - రాఖీ పండుగ.



నారాయణపేట, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థి విద్యార్థినులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని నీవు నాకు రక్ష నాకు నీవు రక్ష మనమందరము దేశానికి రక్ష నిదానంతో విద్యార్థులు ఆనందంగా ఒకరికొకరు రాఖీలు రక్షాబంధన్ కార్యక్రమంలో భాగంగా కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాకేష్, పాఠశాలప్రధానోపాధ్యాయులు భారతి మాట్లాడుతూ , రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి లేదా జంధ్యాల పూర్ణిమ పిలుస్తారని అన్నారు. అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారు. అన్నకుగాని తమ్మునికిగాని ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ అని పిలిచే ఒక పట్టీని కట్టడం ఈ పండుగ ప్రాధాన్య విశేషం. రాఖీ అనగా రక్షణ బంధం. ఇది అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ళు జరుపుకునే మహోత్తరమైన పండుగ. చెల్లి తన అన్నయ్య మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ అన్నయ్యకు కట్టేదే ఈ రాఖీ. సాధారణంగా జంధ్యాన్ని ధరించేవారు ఈ రోజునే పాతది వదిలి కొత్త దానిని ధరిస్తారు. ఉపనయనం అయిన వారు జంధ్యాల పౌర్ణమి రోజు గాయత్రీ పూజచేసి కొత్త య్జ్ఞోపవీతాన్ని ధరించి పాతది తీసివేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం విజయ మధుసూదన్ భాను ప్రకాష్ నరసింహ ప్రతాప్ నర్సింలు రఘురాంరెడ్డి నిర్మల శ్రీదేవి శశిరేఖ మంగళ సంగీత సురేష్ బుద్ధి శ్రీనివాస్ చంద్రమోహన్ ఆలుగడ్డ రవి శ్రీధర్ లక్ష్మణ్ రవి తదితరులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా కార్యదర్శిగా రామినేని అశోక్

**- రైతు సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పోరాడతా**



సూర్యాపేట,ఆగస్ట్ 27 ( విజన్ ఆంధ్ర ): భారతీయ జనతా పార్టీ సూర్యాపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శిగా గరిడేపల్లి మండలానికి చెందిన రామినేని అశోక్ నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. నియామక పత్రాన్ని అందుకున్న రామినేని అశోక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కంచర్ల నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, బొబ్బ భాగ్యారెడ్డితో పాటు పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయిలో నిరంతరం పోరాడతానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు చేరువ చేస్తామని చెప్పారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ కిసాన్ మోర్చా తరపున ముందుండి పోరాడతామని అన్నారు. పార్టీ బలోపేతంతో పాటు అన్నదాతల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని సెక్రెటరీ రామినేని పేర్కొన్నారు. ఆయన నియామకంపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గరిడేపల్లి మండల యువత హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# భూ సంబంధిత దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**- సి సి ఎల్ ఎ కమిషనర్ లోకేష్ కుమార్**




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27,(విజన్ ఆంధ్ర) : సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సి సి ఎల్ ఎ కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్ లోని సి సి ఎల్ ఎ కార్యాలయం నుండి రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి సి ఎల్ ఎ కమిషనర్ మాట్లాడుతూ భూ భారతి పోర్టల్, సాదా బైనమా, రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. లావుని పట్ట, సీలింగ్, పట్టా, దేవాదాయ, వక్ఫ్, అటవీ భూములు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఆస్తులు, దర్యాప్తు సంస్థలు అటాచ్ చేసిన భూముల వివరాలు కేటగిరిలుగా నమోదు చేసి జాబితా రూపొందించాలని తెలిపారు. నిషేధిత భూములపై పత్రికలలో, ప్రచార సాధనాలలో వచ్చే వార్తలపై వెంటనే స్పందించాలని, వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలతో నివేదికలు అందించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాదాబైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ భూములు, లావుని పట్టా, సీలింగ్, అటవీ, దేవాదాయ, వక్ఫ భూములు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల వివరాలను కేటగిరీలుగా నిషేధిత జాబితాలో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ల సంక్షేమాన్ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం...

సూర్యాపేట ఆగస్టు 27:(విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ ప్రభుత్వం డ్రైవర్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదనిమాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మన్నెం సదాశివారెడ్డి ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ డ్రైవర్ల కోసం అమలు చేసిన ప్రమాద బీమా పథకంలో భాగంగా తుంగతుర్తి నియోజకవర్గం మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామానికి చెందిన కొడవలికంటి యాకయ్య కుటుంబ సభ్యులకు 5 లక్షల బీమా చెక్కును బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌడ్‌చర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం డ్రైవర్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు.డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రమాద బీమా పథకాన్ని అమలు చేసిందన్నారు. డ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం డ్రైవర్ల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రజాక్, గ్రామ శాఖ అధ్యక్షుడు రేసు వెంకన్న, మధు, లింగారెడ్డి, వినోద్, మల్లారెడ్డి, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు.




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర): మహబూబాబాద్‌లోని స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్లో రక్షాబంధన్ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా మరియు ఆనందంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాఖీలు కట్టుకుని, సోదర సోదరీమణుల మధ్య ఉండే ప్రేమ, ఆప్యాయత, అనురాగం, గౌరవం, రక్షణ వంటి విలువలను చాటిచెప్పారు. రక్షాబంధన్ పండుగ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఖ. చంద్ర మౌళి ప్రధానోపాధ్యాయులు మధు మాట్లాడుతూ రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టుకునే పండుగ మాత్రమే కాదని, కుటుంబ బంధాలు, పరస్పర ప్రేమ, గౌరవం, బాధ్యతలను గుర్తుచేసే పవిత్రమైన పండుగ అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరులను గౌరవిస్తూ, ఆప్యాయతతో మెలుగుతూ సమాజంలో సోదరభావం, ఐక్యతను పెంపొందించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల ఉత్సాహభరితమైన పాల్గొనడాన్ని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. సోదరసోదరీమణుల అనుబంధం ఎల్లప్పుడూ ఇలాగే బలంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ, ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

# తొలగించబడిన అర్హుల పేర్లను పునరుద్ధరించాలి

**- కాంగ్రెస్ ఓబీసీ విభాగం రాష్ట్ర జాయింట్ కో-ఆర్డినేటర్ గొంటి విక్రమ్ యాదవ్**



హైదరాబాద్, ఆగస్ట్ 27 (విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అర్హులైన ఓటర్ల పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగిస్తున్నారనే ఫిర్యాదులపై ఎన్నికల సంఘం పారదర్శకంగా విచారణ జరిపి అనుమానాలను నివృత్తి చేయాలని కాంగ్రెస్ ఓబీసీ విభాగం రాష్ట్ర జాయింట్ కో–ఆర్డినేటర్, జీహెచ్‌ఎంసీ ఇన్‌చార్జ్ గొంటి విక్రమ్ యాదవ్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా నిరక్షరాస్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపుపై ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన విలువైన ప్రజాస్వామ్య హక్కు అని, సరైన కారణం లేకుండా ఏ అర్హుడి పేరునూ తొలగించరాదని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హుల పేర్లు తొలగించబడితే వెంటనే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ శ్రేణులు ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించి, పేర్లు లేని అర్హులైన ఓటర్లకు ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానంలో దరఖాస్తు చేయించి ఓటు హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 27,(విజన్ ఆంధ్ర ) : జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డిసిపి ఎ. భాస్కర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్య రహిత మంచిర్యాల జిల్లా సాధనలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 49 కేసులు నమోదు చేయడం జరిగిందని, ఇందులో 103 మందిని గుర్తించడం జరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగదారులను గుర్తించి కోర్టు ద్వారా 30 మందిని డ్రగ్ డి–అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంస్థలలో విద్యార్థులచే యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, వారి ద్వారా ప్రతి నెల అవగాహన కార్యక్రమాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై క్విజ్, డ్రాయింగ్ మొదలగు పోటీలను నిర్వహించాలని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించడం, పొగాకు సంబంధిత ఉత్పత్తులను అమ్మడం నిషేధించడం జరిగిందని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మెడికల్, ఐటిఐ, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలలో నిత్యం మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులను గమనిస్తూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గంజాయి తదితర మొక్కల సాగు చేసే వారిని గుర్తించాలని తెలిపారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో మెడికల్ షాప్ లను నిత్యం పర్యవేక్షించాలని, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయించే షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్.టి.సి., విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, ఇతర రోడ్డు భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 95 లైసెన్సులు రద్దు చేయడం జరిగిందని, ఫిట్ నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాలలో, అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై సంచరించే పశువులను అందుబాటులో ఉన్న గోశాలకు తరలించాలని, నూతన గోశాల ఏర్పాటుకు భూమిని కేటాయించడం జరిగిందని త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ల ఏసిపిలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ అధికారులు పాఠశాలలను పర్యవేక్షించాలి

**- ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపడకుంటే తగు చర్యలు**

**- విద్యార్థుల నమోదు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర బ్యూరో) : విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను తరచు సందర్శిస్తూ అక్కడి కార్యకలాపాలు సజావుగా జరిగేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లాలో విద్యాశాఖ పనితీరుపై గురువారం కలెక్టర్ తన చాంబర్ నుంచి అన్ని మండలాల ఎంఈఓ లు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, తదితరులతో వెబ్ ఎక్స్ మీట్ ద్వారా సమీక్షించారు. పదేపదే సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదన్నారు. ఎఫ్ఎల్ఎన్, ఏఎక్స్ఎల్ ఆన్‌బోర్డింగ్, విద్యార్థుల నమోదు, డ్రాప్‌బాక్స్ పెండింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలోని 87 ఎఫ్ఎల్ఎన్ కాంపొనెంట్ పాఠశాలల్లో విద్యార్థుల వారీగా అభ్యసన ఫలితాలను నమోదు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన బేస్‌లైన్ అసెస్‌మెంట్ ఫలితాలను సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయ సమావేశాల్లో చర్చించి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఏ సబ్జెక్టులో, ఏ సామర్థ్యంలో వెనుకబడి ఉన్నాడో గుర్తించి, మూడు నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. అవసరమైన వారికి రెమిడియల్, అదనపు తరగతులు నిర్వహించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో విద్యార్థుల నమోదు ఆశించిన స్థాయిలో లేదని కలెక్టర్ పేర్కొన్నారు. సుమారు 6 వేల మంది విద్యార్థులను ఇంకా పాఠశాలల్లో చేర్పించాల్సి ఉందని తెలిపారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు మండల స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కొత్తగా విద్యార్థుల నమోదును పెంచాలని ఆదేశించారు. ఎంఈఓలు, సీహెచ్ఎంల పాఠశాల సందర్శనలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ తక్కువగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి మండలంలో పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి, విద్యార్థుల అభ్యసన స్థాయి, ఎఫ్ఎల్ఎన్ నమోదు, హాజరు, తదితర అంశాలను పరిశీలించాలని సూచించారు. ఉపాధ్యాయుడి పేరు, హోదా, బోధిస్తున్న సబ్జెక్టు, విద్యార్హతలు, బీఈడీ, డీఈడీ వంటి వృత్తిపరమైన అర్హతలు, అదనపు డిగ్రీలు, ప్రత్యేక శిక్షణలు, ఇతర నైపుణ్యాల వివరాలను సేకరించాలని తెలిపారు. పాఠశాల వారీగా ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య, గూగుల్ ఫారంలో నమోదైన వివరాల సంఖ్య సరిపోలేలా చూసి ఏ ఒక్క ఉపాధ్యాయుడి వివరాలు మిస్ కాకుండా డేటాను సిద్ధం చేయాలని ఆదేశించారు. పూర్తయిన యూనిఫాంలను ఆగస్టు 31లోగా విద్యార్థులందరికీ అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. మిగిలిన వాటికి అవసరమైన చర్యలు తీసుకుని పంపిణీని పూర్తి చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల పనితీరు రాబోయే రోజుల్లో గణనీయంగా మెరుగుపడాలని, లేదంటే తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఈవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారులు ప్రసాద్, మైఖేల్, కర్రెప్ప, ఎంఈఓ లు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, సిఆర్పిలు, తదితరులు పాల్గొన్నారు.

# SIR ప్రక్రియలో భాగంగా కొత్మీర్‌లో గ్రామసభ



దహేగాం, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర): కొమురం భీం జిల్లా దహేగాం మండలంలోని కొత్మీర్ గ్రామంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ాx= ప్రక్రియలో భాగంగా గ్రామసభ నిర్వహించారు.గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ స్టేషన్ వారీగా ఓటర్ల జాబితాను గ్రామసభలో చదివి వినిపించారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రతి ఓటరు పేరును వివరంగా ప్రజలకు తెలియజేశారు.జాబితాలో ఉన్న ఓటర్ల పేర్లను గ్రామస్థుల సమక్షంలో పరిశీలించారు.తొలగించిన ఓటర్ల పేర్లను కూడా గ్రామసభలో వెల్లడించారు.ఓటర్ల పేర్లు తొలగించడానికి గల కారణాలను అధికారులు ప్రజలకు వివరించారు.ఓటర్ల జాబితాపై ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు.అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఓటరు పేరు తొలగింపుపై అభ్యంతరం ఉన్నవారు సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.పేరు చేర్పు, తొలగింపు లేదా మార్పులకు సంబంధించి నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.గ్రామసభకు హాజరైన ఓటర్లకు SIR ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఓటర్ల జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.ఎలాంటి అర్హత కలిగిన ఓటరు పేరు జాబితాలో మిస్ కాకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా అనర్హులైన వారి పేర్లపై అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రామసభలో గ్రామ సర్పంచ్ నాయికిని సత్యనారాయణ ధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, ఓటర్లు పాల్గొన్నారు.



# కలెక్టర్‌కు రాఖీ కట్టిన జిల్లా అధికారులు

వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 27 ( విజన్ ఆంధ్ర ) : రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా అధికారులు డి పి ఓ జయసుధ, డి పి ఆర్ ఓ చెన్నమ్మ, వ్యవసాయ అధికారి కవిత లు జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి పండుగను జరుపుకుంటామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, సోదరభావంతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్బంగా జిల్లా ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలి


**- రహదారి ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి**

**-అదనపు కలెక్టర్ విక్టర్**



కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 27(విజన్ఆంధ్ర) జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను పటిష్టంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ విక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రధాన రహదారులపై ప్రమాదాలకు కారణమయ్యే ప్రాంతాలను గుర్తించి, అవసరమైన రహదారి భద్రతా చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.అటవీ ప్రాంతాల గుండా వాహనాలు ప్రయాణించే సమయంలో వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అటవీ అధికారికి సూచించారు. అటవీ ప్రాంతాల్లో వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని, వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని కోరారు.జాతీయ రహదారుల వెంబడి అనధికారికంగా నిర్వహిస్తున్న అక్రమ ధాబాలు, రహదారి భద్రతకు అవరోధంగా ఉన్న అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు.జిల్లాలో రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు రహదారుల పరిస్థితి, ప్రమాదకర మలుపులు, అవసరమైన సూచిక బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు తదితర అంశాలపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రహదారి భద్రతతో పాటు పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణకు సమాన ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ విక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, అటవీ శాఖ అధికారి నీరజ్, ఆర్అండ్‌బీ ఈఈ అజ్మీరా రామ, ఎక్సైజ్ శాఖ అధికారి ముకుంద రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి ప్రసన్న, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవితేజతో పాటు సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సామూహిక రక్షాబంధన్ నిర్వహించిన డిసిసి అధ్యక్షురాలు...



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27(విజన్ ఆంధ్ర) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు,డీసీసీ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని సామూహిక రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు,ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ నియోజకవర్గ ఇంచార్జి అజ్మీర శ్యామ్ నాయక్,మండల అధ్యక్షుడు రాపర్తి మురళి, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా,కాంగ్రెస్ కార్యకర్తలకు రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని అందరికి రాఖీ కట్టి మిఠాయిలు తినిపించుకొని అన్నా చెల్లెలి అనుబంధానికి ప్రతికాక రక్ష బంధన్ కార్యక్రమం నిర్వహించారు.

# వన మహోత్సవం లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27,( విజన్ ఆంధ్ర ) : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో గల ఖాళీ ప్రదేశాలలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, జిల్లా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. జిల్లాకు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ భూములు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, కాలువ గట్లు, చెరువు గట్లపై, రహదారికి ఇరువైపులా అవసరమైన మొక్కలను నాటి వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వామలై మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, సంబంధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# విపత్తు నిర్వహణకు పక్కా ప్రణాళిక అవసరం

**- విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర బ్యూరో) : వరదలు, అగ్ని ప్రమాదాలు, తదితర విపత్తుల సమయంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, దీనికి పక్కా ప్రణాళిక అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో జిల్లా డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్షన్ ప్లాన్ పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. బీచుపల్లి, అలంపూర్, నది అగ్రహారం వంటి నదీ పరివాహక తీర ప్రాంతాల్లో అత్యవసర సమయంలో రక్షణ చర్యలు చేపట్టేందుకు సరైన ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా నదుల్లో ప్రమాదవశాత్తు ఎవరైనా మునిగిపోతుంటే కాపాడేందుకు అక్కడి గజ ఈతగాళ్లు, మత్స్యకారులకు బోట్స్, లైఫ్ జాకెట్స్, తాళ్లు, తదితర పరికరాలను అందుబాటులో ఉంచేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఎవరైనా వ్యక్తులు తప్పిపోతే వెతికేందుకు, ఇతర అవసరాలకు డ్రోన్ కెమెరాలు వంటి యంత్రాలను కొనుగోలు చేయాలని సూచించారు. గద్వాల, ఆలంపూర్ లోని అగ్నిమాపక కేంద్రాల్లో ఫ్లోటింగ్ పోర్టబుల్ పంప్స్, రిమోట్ లైఫ్ బాయ్, తదితర రెస్క్యూ పరికరాలను తెప్పించేందుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లతోపాటు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో, కలెక్టరేట్లో కూడా ఫైర్ సేఫ్టీ కోసం అవసరమైన యంత్రాలను తెప్పించేందుకు ప్రతిపాదనలు పంపాల్సిందిగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిపిఒ శ్రీకాంత్, అగ్నిమాపక కేంద్రం ఎస్సై రాకేష్, డి సెక్షన్ పర్యవేక్షకులు నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మేనకోడలు వివాహ వేడుకలో సీఎం రేవంత్ రెడ్డి గారిని కలిసిన మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి



రంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 27(విజన్ ఆంధ్ర ): ఈ వివాహ వేడుకకు ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు హాజర య్యారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి గారు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గారు మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి గారిని ఆత్మీయంగా పలకరించి, సాదరంగా అభివాదం చేశారు. వివాహ వేడుక సందర్భంగా ఇరువురి మధ్య ఆత్మీయ పలకరింపు జరిగింది.

# నేషనల్ టాలెంట్ పరీక్ష ద్వారా 2.5 కోట్ల స్కాలర్షిప్లు

**- 2026 లాంఛనంగా ప్రారంభం**



హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 ( విజన్ ఆంధ్ర ) : జాతీయస్థాయిలో ప్రతి ఏటా ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆకాష్ విద్యాసంస్థలు నిర్వహించే నేషనల్ టాలెంట్ హంట్ పరీక్ష 'అంతే 2026' కు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ వైస్ ప్రెసిడెంట్ (అడ్మిషన్స్) అరబింద్, స్టేట్ హెడ్ అమిత్ , బ్రాంచ్ హెడ్ రాజేష్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం హనుమకొండ లో గల ఆకాష్ విద్యా సంస్థల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఉచితంగా నీట్, జేఈఈ కోర్సులలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 2.5 కోట్ల రూపాయల స్కాలర్షిప్ లను ఈ ఆంతే పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు కూడా అందిస్తామని తెలిపారు. ఈ పరీక్షలు అక్టోబర్ 27 నుంచి నవంబర్ ఒకటో తేదీ వరకు ఆన్లైన్లోనూ అదేవిధంగా ఆఫ్లైన్లో ఆకాష్ కేంద్రాలలో మరియు వివిధ ఆకాష్ నిర్వహించే కేంద్రాలలో అక్టోబర్ 11,25 నవంబర్ 1 తేదీలలో ఈ పరీక్షలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు 9 నుంచి 12వ తరగతి చదివే వారు ఎవరైనా ఆన్ లైన్లో తమ వెబ్ సైటు లో నమోదు చేసుకొని పోటీ పరీక్షలకు హాజరయి స్కాలర్షిప్ సాధించాలని పేర్కొన్నారు. అంతే 2026ను గత 16 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ పోటీ పరీక్ష ఇప్పటివరకు కోటి మంది పైగా విద్యార్థులు పాల్గొన్నారు పేర్కొన్నారు. వేలాదిమంది ఉచితంగా శిక్షణ పొంది జాతీయ స్థాయిలో మొదటి పది ర్యాంకులలో తమ స్థానాలు పదిలపరుచుకున్నారని తెలిపారు. వరంగల్ ప్రాంతంలో కూడా నీట్, జేఈఈ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ అకాడమిక్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడి విధానాలతో రైతులకు మేలు

**- నానో యూరియా వినియోగించేలా ప్రోత్సహించాలి**

**- ఆయిల్ పామ్ తోటలతోనూ మంచి ఆదాయం**

**- రైతు బీమా దరఖాస్తులను పెండింగ్ లో ఉంచవద్దు**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

గద్వాల ఆగస్టు 27 ( విజన్ ఆంధ్ర న్యూరో) : పంట మార్పిడి విధానాలతో రైతులకు మేలు జరుగుతుందని, ప్రస్తుత ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున అన్నదాతలు ఆరుతడి పంటలు సాగు చేసేలా సంబంధిత అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ సహకారంతో, వ్యవసాయ, ఇఫ్కో క్రిడ సంస్థల ఆధ్వర్యంలో గురువారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లాలోని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులకు నానో ఎరువులపై నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలను తీసుకోవాలని, అన్నదాతలకు నష్టం వాటిల్లకుండా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేయలన్నారు. జూరాల ప్రాజెక్టుకు ఇన్ఫ్లో తగ్గడంతో రైతులు కాలువలు ద్వారా సాగునీటిపై ఎక్కువగా ఆధారపడకుండా కూరగాయలు, పప్పు దినుసులు వంటి స్వల్పకాలిక ఆరుతడి పంటలపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ లో పంటలు సాగు చేయని రైతులు రబీ సీజన్ కు త్వరగా వెళ్లే అవకాశం ఉన్నందున రబీ సీజన్ లో కూడా వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కలిగించాలన్నారు.



ప్రభుత్వం నిర్దేశించిన ఏడు రకాల వరి విత్తనాలకు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా బోనస్ చెల్లించడం జరుగుతుందని ఇప్పటికే ప్రకటించినందున అధికారులు ఆ రకాలను సాగు చేసిన రైతుల వివరాలను సంబంధిత పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. ఇప్పటికే ఖరీఫ్ లో వరి సాగు చేసిన రైతులకు సాగునీరు సరిపోని సమయంలో బోరుబావులపై ఆధారపడాల్సి వస్తుందని, రబీలో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయకుండా ఆరుతడి పంటలకే ప్రోత్సహించా లన్నారు. సాధారణ యూరియాను అధిక మొత్తంలో వాడడం వలన నేల సారవంతత కోల్పోతుందని దీని స్థానంలో రైతులు నానో యూరియాను పెద్ద ఎత్తున వినియోగించేలా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కలిగించాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలతో మహిళా రైతులు డ్రోన్లను కొనుగోలు చేసి కూడా ఎరువుల పిచికారికి వినియోగించు కోవచ్చన్నారు. జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే శాతం పెరగాలని, రైతు భీమా దరఖాస్తులు పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు క్లెయిమ్ చేస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ తోటలతో రైతులకు మంచి రాబడులు ఉంటాయని, ఇందులో అంతర పంటలు సాగు చేసి కూడా అదనపు ఆదాయాన్ని అర్జించవచ్చన్నారు. పిఎండిడికేవై పారామీటర్స్ లో ఉన్నతి సాధించేలా వ్యవసాయ శాఖ అధికారులు పనిచేయాలన్నారు. ప్రకృతి, ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ప్రతి గ్రామం నుంచి చాంపియన్ ఫార్మర్స్ గుర్తించి డేటా పంపాలని ఆదేశించారు. వన మహోత్సవంను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల్లో న్యూట్రి గార్డెన్స్ కు కృషి చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో రైతుల సంక్షేమానికి వ్యవసాయ శాఖ అధికారులు ఎల్లవేళలా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పలువురు రైతులు నానో యూరియాను వినియోగించి తాము సాగు చేసిన పంటల గురించి అనుభవాలను తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్, ఇఫ్కో మేనేజర్ కృపాశంకర్, క్రిడ సీనియర్ శాస్త్రవేత్త గిరిజాదేవి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం.. అయోమయంలో ఓటర్లు.

**ఓ వార్డుకుచెందినవ్యక్తికిమరో వార్డులో ఓటు హక్కు.**

నారాయణపేట, ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర) : అధికారుల నిర్లక్ష్యంతో ఓటర్లు అయోమయంలో పడ్డారని మూడవ వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ ఆరోపించారు. గురువారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సార్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ఆయా వార్డుల్లో అన్ని ప్రజలను కలిసి ఓటరు జాబితాను తయారు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ వారికి తోచిన విధంగా తయారు చేశారని ఆరోపించారు. మూడవ వార్డులోని ప్రజలను ఓటర్లుగా నమోదు చేయడం తో పాటు కొంతమందిని వార్డులో ఉన్నవారికి వేరే వార్డులో నమోదు చేసి ఆ వాటిలో ఉన్న వారిని మూడో వార్డులో నమోదు కావడం ఈ అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం అని అన్నారు. అంతేకాకుండా 137 బూతులో ఉన్న ఓటర్ల కలర్ ఫోటోలను కూడా జాబితాలో వేయకపోవడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. 137 బూతులో ఉన్న ఓటర్లను 127 అలాగే135 బూతు జాబితాలో అధికారులు నమోదు చేశారని ఆమె అన్నారు. 127, 135బూతులోని ఓటర్లను137 బూతులో నమోదు చేయాలని ఆమె అధికారులకు కోరారు. ఓటర్లను కూడా అదే బూతులు కలర్ ఫోటోలతో సహా ఓటర్ జాబితాలో నమోదు చేయాలని ఆమె అధికారులకు కోరారు.ప్రభుత్వ అధికారులే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించి ఓటర్ల నమోదు జాబితాను తప్పుల తడకగా తయారు చేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. 38



మందిని 137 బూతులో నమోదు చేయాలని అధికారులకు వినతి పత్రం ఇచ్చినా కూడా అధికారులు 137 లో నమోదు చేయకపోవడం ఎంతవరకు సమంజసం అని అన్నారు .అధికారులు మాత్రం 135 లో ఉన్న ఓటర్లను వేరే బూతులలో నమోదు చేయడం సరైనది కాదని ఆమె అన్నారు . ఓటర్ల కలర్ ఫోటోలు కూడా నమోదు చేయకపోవడంతో పాటు అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని ఆమె ప్రశ్నించారు. అధికారులకు వార్డులోని ప్రజలు సహకరించినా కూడా ఓటర్ జాబితా తయారు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తూ జాబితాను తయారు చేయడం ఇది ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు.

# సెప్టెంబర్ 3న నగరంలో జీప్యాక్ట్స్-26 సదస్సు



హైదరాబాద్, ఆగస్ట్ 27 (విజన్ ఆంధ్ర) : ఫార్మా రంగంలో ఏఐ, కంప్లయన్స్, సైబర్ భద్రత, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ అంశాలపై జీప్యాక్ట్స్-2026 సదస్సు సెప్టెంబర్ 3న నోవాటెల్ హెచ్ఐసీసీలో నిర్వహించనున్నట్లు జీప్యాక్ట్స్ డైరెక్టర్లు షిప్రా సింగ్, రవీంద్ర వారంగ్ లు గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఏఐ, డేటా రక్షణ, సైబర్ భద్రత, ఎంఈఎస్, డిజిటల్ ట్విన్స్, నాణ్యతా వ్యవస్థలపై ఆచరణాత్మక చర్చలు సదస్సులో జరుగుతాయని తెలిపారు. హనీవెల్తో, థర్మో ఫిషర్ సైంటిఫిక్, రాక్వెల్ ఆటోమేషన్, నివిడస్ సాఫ్ట్వేర్ సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆల్కెమ్ ల్యాబొరే టరీస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, వోక్హార్ట్, గ్రాన్యూల్స్ ఇండియా, బయోలాజికల్ ఇ సంస్థల ప్రతినిధుల తోపాటు 350 నుంచి 400 మంది ఫార్మా రంగ ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 27,(విజన్ ఆంధ్ర ) : జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం కర్ణమామిడి, లక్షెట్టిపేట మండలం చందారం గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన గ్రామసభలలో ఆయా మండలాల తహసిల్దార్లు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచి, అందులో గుర్తించిన అనామలీస్ ఓటర్ల వివరాలను గ్రామసభలో చదివి వినిపించాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఎ.ఎస్.డి. (ఆబ్సెంట్ , షిఫ్టెడ్ , డెడ్ ) ఓటర్లకు సంబంధించి నోటీసులను నిబంధనల ప్రకారం జారీ చేసి, తదుపరి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి దశను పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులు, సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఛాతి వ్యాధుల శస్త్రచికిత్సలో మినిమల్లీ ఇన్వాసివ్ థొరాసిక్ సర్జరీ

హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 27 (విజన్ ఆంధ్ర ) : ఊపిరితిత్తులు, అన్నవాహిక, ఛాతి మధ్య భాగం మీడియస్టాటినం, డయాఫ్రమ్, ఛాతి గోడకు వచ్చే వ్యాధులను గుర్తించి చికిత్స చేయడానికి సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ అత్యాధునిక విధానాలను ఉపయోగిస్తోంది. ముఖ్యంగా మినిమల్లీ ఇన్వాసివ్, రోబోట్ సహాయంతో చేసే సర్జరీ ద్వారా మెరుగైన వైద్యం అందిస్తోంది. వ్యాధిని త్వరగా గుర్తించడం వల్ల, పేషెంట్లకు మరింత సురక్షితమైన ఆపరేషన్లను ఆసుపత్రి అందిస్తోంది. దీని ద్వారా ఖచ్చితమైన చికిత్స లభించడమే కాకుండా, పేషెంట్లు త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఇంటికి వెళ్లగలుగుతున్నారు.థొరాసిక్ సర్జరీ అంటే గుండెను మినహాయించి, ఛాతిలో వచ్చే ఇతర వ్యాధులకు చేసే ప్రత్యేకమైన ఆపరేషన్. కొన్ని క్లిష్టమైన సమస్యలకు ఛాతిని పూర్తిగా తెరిచి చేసే ఓపెన్ సర్జరీ తప్పనిసరి అయినప్పటికీ, ఇప్పుడు ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. వీడియో కెమెరా సాయంతో చేసే సర్జరీ వాట్స్ రోబోట్ సహాయంతో చేసే సర్జరీ రాట్స్ వంటి పద్ధతుల ద్వారా కేవలం ఒక చిన్న రంధ్రం లేదా కోతతో ఆపరేషన్లు చేస్తున్నారు. వీటివల్ల పేషెంట్లకు సర్జరీ కోత, నొప్పి చాలా తక్కువగా ఉంటాయి. ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం కూడా ఉండదు. పేషెంట్లు చాలా త్వరగా తమ పనులు తాము చేసుకోగలుగుతారు. డాక్టర్లు కూడా చుట్టుపక్కల ఉండే అవయవాలకు ఎలాంటి హాని కలగకుండా చాలా ఖచ్చితత్వంతో ఈ



ఆపరేషన్ చేయగలుగుతారు.యశోద హాస్పిటల్స్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి సి మాట్లాడుతూ గత పదేళ్లలో ఛాతి సర్జరీలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఈరోజుల్లో చిన్న కోతతో లేదా రోబోట్ సహాయంతో ఆపరేషన్లు చేస్తున్నాం. దీనివల్ల సంక్లిష్టమైన సమస్యలకు కూడా శరీరానికి పెద్దగా ఇబ్బంది కలగకుండా, ఖచ్చితంగా చికిత్స చేయగలుగుతున్నాం అని చెప్పారు. వ్యాధిని ముందుగానే గుర్తించడం, ఆధునిక సర్జరీ నైపుణ్యాలు మరియు అన్ని విభాగాల వైద్యులు కలిసి క్యాన్సర్కు వైద్యం చేయడం వల్ల పేషెంట్లకు అత్యుత్తమ చికిత్స అందుతోంది. వారు త్వరగా కోలుకొని సాధారణ జీవితం గడపగలుగుతున్నారు. ప్రతి పేషెంట్ కు వారి ఆరోగ్య పరిస్థితికి తగ్గట్టుగా, ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తూ, వైద్యం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రూపేష్యుండే, మేనేజర్ పవన్ అసిస్టెంట్ మేనేజర్ పాల్గొనడం జరిగింది.

# ప్రాణాపాయ స్థితిలో ఉన్న గర్భిణికి పునర్జన్మనిచ్చిన వరంగల్ మెడికవర్ వైద్యులు

హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు,27 ( విజన్ ఆంధ్ర ) : ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరిన 32 ఏళ్ల మహిళకు మెడికవర్ హాస్పిటల్ వరంగల్ వైద్యులు సకాలంలో చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. రప్చర్డ్ ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ (గర్భాశయం వెలుపల ఏర్పడిన గర్భం పగిలిపోవడం) కారణంగా తీవ్ర అంతర్గత రక్తస్రావానికి గురైన రోగిని అత్యవసర శస్త్రచికిత్స ద్వారా కాపాడడమే కాకుండా, శస్త్రచికిత్స అనంతరం గుండె ఆగిపోయిన పరిస్థితిలోనూ తిరిగి ప్రాణం పోసి విజయవంతంగా కోలుకునేలా చేశారు.శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తీవ్రమైన కడుపు నొప్పి వంటి లక్షణాలతో బాధపడుతున్న 32 ఏళ్ల మహిళ మెడికవర్ హాస్పిటల్‌లో చేరారు.ప్రారంభంలో లక్షణాలను పరిశీలించిన కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డా. శ్రవణ్ కుమార్ పర్యవేక్షణలో చికిత్స ప్రారంభించారు.రోగి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఆమెను క్రిటికల్ కేర్ విభాగానికి తరలించారు. డా. దీపక్ మరియు క్రిటికల్ కేర్ బృందం అవసరమైన పరీక్షలు, వైద్య మూల్యాంకనాలు నిర్వహించగా సమస్య గైనకాలజీకి సంబంధించినదిగా గుర్తించారు.తదుపరి పరీక్షల్లో రోగికి రప్చర్డ్ ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీతో పాటు భారీ హీమోపెరిటోనియం (కడుపులో రక్తం పేరుకుపోవడం) ఉన్నట్లు నిర్ధారణ అయింది. సుమారు 3.5 లీటర్ల రక్తం అంతర్గతంగా పేరుకుపోవడంతో ఆమె పరిస్థితి అత్యంత విషమంగా మారింది.ఈ



పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డా. అమిత ఆధ్వర్యంలో అత్యవసరంగా లాపరోస్కోపిక్ శస్త్రచికిత్స నిర్వహించి పగిలిపోయిన ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీని తొలగించారు. శస్త్రచికిత్స సమయంలో రోగికి భారీ స్థాయిలో రక్త మార్పిడి అవసరమై, మొత్తం 8 యూనిట్ల రక్త భాగాలను అందించారు.శస్త్రచికిత్స పూర్తయిన అనంతరం, ఇంకా ఆపరేషన్ థియేటర్‌లోనే ఉన్న సమయంలో రోగికి అకస్మాత్తుగా కార్డియాక్ అరెస్ట్ (గుండె ఆగిపోవడం) సంభవించింది. వెంటనే డా. వాసు మరియు ఆయన బృందం అత్యవసరంగా సీపీఆర్ మరియు పునరుజ్జీవన చికిత్సలు ప్రారంభించి, రోగిని విజయవంతంగా తిరిగి ప్రాణాలతో నిలబెట్టారు.ఆ తర్వాత రోగిని ఒక రోజు పాటు వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉంచి అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షించారు. అనంతరం ఆమె పూర్తిగా కోలుకుని ఎటువంటి ఇతర సమస్యలు లేకుండా ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారు.ఈ కేసు క్లిష్ట వైద్య పరిస్థితుల్లో సకాలంలో నిర్ధారణ, మల్టీడిసిప్లినరీ వైద్య బృందాల సమన్వయం మరియు అత్యవసర చికిత్స ఎంత కీలకమో మరోసారి నిరూపించింది. ఈ విజయవంతమైన చికిత్సలో కార్డియాలజీ, క్రిటికల్ కేర్, గైనకాలజీ, అనస్థీషియా మరియు ఆపరేషన్ థియేటర్ బృందాల సమిష్టి కృషి కీలక పాత్ర పోషించింది.ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ నమ్రత, డీఎంఎస్ డా. అనిత మరియు మార్కెటింగ్ హెడ్ హరినాథ్ గుప్తా పాల్గొన్నారు.

# నేడే రక్షాబంధన్ - ముడిపడిన ప్రేమ బంధం!

- చెల్లి చేతి రాఖీకి కరిగే అన్న హృదయం
- శ్రావణ పౌర్ణమి వేళ అనుబంధాల పండుగ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటిన సంబురాలు



అన్న శ్రీకృష్ణునికి గాయం అవడంతో చెల్లి చీరతో కట్టు కడుతున్న ఫోటో....




అన్నకు రాఖీ కడుతున్న చెల్లి....

**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 27:** రక్తం పంచుకున్న బంధం కంటే మనసు పంచుకున్న బంధం గొప్పదని చాటే పండుగ నేడు. అన్నా చెల్లెళ్ల మధ్య ప్రేమకు, ఆప్యాయతకు, జీవితాంతం తోడుంటాననే భరోసాకు ప్రతీక అయిన రాఖీ పండుగ నేడు శనివారం దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు. ఎక్కడో దూరంగా ఉన్న అన్నయ్య కోసం చెల్లి గుండె వేయి కళ్లతో ఎదురుచూసే రోజు ఇది. ఒక్క రాఖీతో ఏడేడు జన్మల బంధాన్ని గుర్తు చేసే పండుగ ఇది. శ్రావణ మాసం పౌర్ణమి రోజున వచ్చే ఈ పండుగకు తెలుగు రాష్ట్రాల్లో విశేష ప్రాధాన్యత ఉంది. తెల్లవారుజాము నుండే చెల్లెళ్లు లేచి కొత్త బట్టలు కట్టుకుని, పూజా పళ్లెంలో రాఖీలు, కుంకుమ, అక్షింతలు, స్వీట్లతో, హారతి పళ్లెంతో అన్నయ్య కోసం ఎదురుచూస్తారు. అన్న చేతికి రాఖీ కట్టి, నుదుటన తిలకం దిద్ది, నోరు తీపి చేసి, దీర్ఘాయుష్మాన్ భవ అని దీవిస్తుంది. ఆ క్షణంలో అన్న కళ్లలో కనిపించే ఆనందం, చెల్లి మొహంలోని తృప్తి మాటల్లో చెప్పలేనిది. చిన్నప్పుడు కొట్టుకున్నా, తిట్టుకున్నా, చివరకు అదే చెల్లి రాఖీ కడుతుంటే అన్న మనసు కరిగిపోవాల్సిందే. అప్పుడు అన్న తన చెల్లికి "నేనున్నాను, నీకు ఏ కష్టం వచ్చినా నేను చూసుకుంటా" అని ఇచ్చే మాటే ఈ పండుగలోని అసలు బహుమతి, అసలు రక్ష.

**మరి ఈ రాఖీ పండుగ ఎందుకు జరుపుకుంటారో తెలుసా?**

దీని వెనుక మన పురాణాల్లో ఒక గొప్ప కథ దాగి ఉంది. ఒకసారి శ్రీకృష్ణుడి చేతికి సుదర్శన చక్రంతో గాయమై రక్తం కారుతుంటే, పక్కనే ఉన్న ద్రౌపది తన ఖరీదైన పట్టు చీర కొంగును ఏ మాత్రం ఆలోచించకుండా చింపి ఆ గాయానికి కట్టు కడుతుంది. ఆ చిన్న ప్రేమకు, ఆ త్యాగానికి కృష్ణుడు చలించిపోతాడు. తర్వాత కౌరవ సభలో దుశ్శాసనుడు ద్రౌపదికి వస్త్రాపహరణం చేస్తున్న వేళలో, భీష్మ, ద్రోణులాంటి పెద్దలు సైతం తలదించుకున్న వేళలో, ఎవరూ ఆదుకోని సమయంలో ఆమె "కృష్ణా" అని పిలవగానే అండగా నిలిచి అక్షయ వస్త్రాలను ప్రసాదించి రక్షిస్తాడు. ఒక చిన్న వస్త్రపు ముక్కకు అంత పెద్ద రక్షణ ఇచ్చిన కథే రాఖీ పండుగకు మూలమని పెద్దలు చెబుతారు. అప్పటి నుంచి రక్షణ కోసం కట్టే దారమే రక్షాబంధనంగా మారింది. అందుకే దీనిని రక్షాబంధన్ అన్నారు. నేడు ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా మార్కెట్ లలో మొత్తం రాఖీలతో కళకళలాడుతోంది. నిన్నటి నుండి మార్కెట్ లో ఎక్కడ చూసినా రాఖీలే. చిన్నారుల కోసం చోటా భీమ్, స్పైడర్ మ్యాన్, డోరేమాన్ బొమ్మల రాఖీలు, యువత కోసం డిజైనర్ రాఖీలు, సిల్వర్ రాఖీలు, స్టోన్ రాఖీలు, పెద్దల కోసం రుద్రాక్ష రాఖీలు, లుంబా రాఖీలు దుకాణాల్లో దర్శనమిస్తున్నాయి. పది రూపాయల నుంచి ఐదు వందల రూపాయల వరకు రాఖీలు అందుబాటులో ఉండటంతో అన్నా చెల్లెళ్లు తమ అభిరుచికి తగ్గట్టుగా ఎంపిక చేసుకుంటున్నారు. బట్టల దుకాణాలు, స్వీట్ షాపుల్లో కూడా నిన్నటి నుంచి కిటకిట రద్దీ నెలకొంది. హైదరాబాద్ నుండి తమ అన్నల కోసం వచ్చిన చెల్లెళ్లతో బస్టాండ్ కిటకిటలాడుతోంది. కొందరు అన్నలు తమ చెల్లెళ్ల ఇంటికి బహుమతులతో వెళ్తున్న దృశ్యాలు జిల్లాల రోడ్లలో కనిపిస్తున్నాయి. నిజానికి రాఖీ అంటే కేవలం ఒక దారం కాదు, అది జీవితాంతం గుర్తుండిపోయే ఒక మాట, ఒక భరోసా, ఒక బాధ్యత, ఒక కంటి తడి. ఈ పండుగ రోజున ప్రతి అన్న తన చెల్లికి "నేనున్నాను" అని చెప్పాలి. ప్రతి చెల్లి తన అన్నకు "నువ్వు బాగుండాలి" అని కోరుకోవాలి. అదే నిజమైన రక్షాబంధన్.




రాఖీల దుకాణం....

# రాఖీ పౌర్ణమి....

## అన్నా చెల్లి అనుబంధపు సందడి!!

- రీల్స్ యుగంలోనూ కరిగిపోని 'రక్ష'
- ప్రతి ఇంటా అనుబంధాల పండుగ
- చిన్ననాటి అల్లర్లకు మధుర జ్ఞాపకాలు
- తీపి జ్ఞాపకాలను మోసుకొచ్చే రాఖీ

*రాఖీ ప్రత్యేకత.... అన్నా చెల్లి అక్క తమ్ముడు అనుబంధం దారం విలువ, విశిష్టత తెలిపే "రాఖీ పండుగ"పై "విజన్ ఆంధ్ర సెంటిమెంట్ స్టోరీ".*








**హైదరాబాద్, ఆగస్టు 28:** టీవీ రిమోట్ కోసం మొదలయ్యే చిన్ననాటి యుద్ధాల నుంచి, జీవితంలో ఎదురయ్యే ఎలాంటి తుఫానునైనా ఎదుర్కొనేందుకు నిలబడే కొండంత ధైర్యం వరకు... అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల బంధం ఒక తీపి కావ్యం. క్యాలెండర్‌లో రాఖీ పౌర్ణమి వచ్చిందంటే చాలు, ప్రతి ఇల్లూ పట్టుబట్టల రెపరెపలతో, స్వీట్ల ఘుమఘుమలతో, అన్నింటికీ మించి పాత జ్ఞాపకాల సవ్వడులతో కొత్త శోభను సంతరించుకుంటుంది.

**రీల్స్ యుగంలోనూ చెక్కుచెదరని రక్షాబంధం**

డిజిటల్ యుగంలో లైఫ్‌స్టైల్ ఎంత మారినా, రాఖీ తెచ్చే స్వచ్ఛమైన భావోద్వేగం మాత్రం ఎప్పటికీ పాతబడదు. ఒకప్పుడు ఊరి నుంచి వచ్చే ఉత్తరంతో మొదలైన ఈ వేడుక, నేడు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, వాట్సాప్ వీడియో కాల్స్, అమెజాన్ డెలివరీల దాకా చేరింది. అయితే వేల మైళ్ల దూరంలో ఉన్న అన్నయ్య చేతిని ఆ చిన్న పట్టుదారం తాకినప్పుడు కళ్లలో చిగురించే ఆనందభాష్పాలు మాత్రం మారలేదు. స్క్రీన్ల వెనుక జీవితాలు గడుపుతున్న నేటి తరం కూడా, ఈ ఒక్కరోజు మాత్రం పాత తరంలా మారిపోయి అనుబంధాలను ఆత్మీయంగా అల్లుకుంటోంది.

**'నాకు నువ్వున్నావ్.. నీకు నేనున్నా' భరోసా**

"నాకు నువ్వున్నావ్... నీకు నేనున్నాననే" నిశ్శబ్ద భరోసాయే రాఖీ. ఇది కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు; వేర్వేరు దారుల్లో సాగిపోతున్న జీవితాల్లో ఒకరికొకరు ఎప్పటికీ అండగా ఉంటామనే బలమైన ప్రతిన. ఆమె దిద్దే తిలకంలో నిండు మనసుతో కూడిన ఆశీర్వాదం ఉంటే, అతడు అందించే కానుకలో ఆమె ముఖంపై చిరునవ్వు చూడాలనే తపన ఉంటుంది. కాలంతో పాటు వచ్చిన మనస్పర్థలు, బిజీ లైఫ్‌లో పేరుకుపోయిన దూరాలు... అన్నీ ఈ ఒక్క పట్టుదారపు స్పర్శతో మంచులా కరిగిపోతాయి.

**చిన్ననాటి అల్లర్లు మళ్లీ గుర్తొచ్చే వేళ**

చిన్ననాటి అల్లర్లు, పంచుకున్న చాక్లెట్లు, ఒకరికొకరు దాచిన రహస్యాలు... అన్నీ ఈ పౌర్ణమి వేళ మళ్లీ ప్రాణం పోసుకుంటాయి. వయసుతో పాటు బాధ్యతలు పెరిగినా, బ్రతుకు పోరాటంలో నగరాలు మారినా, ప్రతి ఇంటా రాఖీ పౌర్ణమి నింపే ఈ అనుబంధాల వెలుగులు కలకాలం నిలిచే అమూల్యమైన ఆస్తులు. ఈ పండుగ ఒక వేడుక మాత్రమే కాదు... జీవితాంతం గుండెల్లో నిలిచిపోయే ఒక తియ్యని సంస్కృతి.

**కరిగిపోని మమకారం... చేతికి కట్టిన పట్టుదారం**

పెళ్లయి అత్తారింటికి వెళ్లిన చెల్లి, పుట్టింటి గుమ్మం తొక్కగానే ఆమె కళ్లలో మెరిసే వెలుగు... చేతికి రాఖీ కడుతూ చేతులు వణికే ఆ క్షణంలో దాగివున్న చెప్పలేని వేదన... మాటల్లో వర్ణించలేనివి. చిన్నప్పుడు "నాకు వీడేం వద్దమ్మా" అంటూ అలకబూనిన అదే చెల్లి, నేడు అన్నయ్య ఆయురారోగ్యాల కోసం దీవిస్తూ నుదుట తిలకం దిద్దుతుంటే, గంభీరంగా కనిపించే అన్న కళ్ల చివర కూడా నీటి తెరలు కమ్ముతాయి. కాలం ఎన్ని బాధ్యతలను నెత్తిన పెట్టినా, ఎన్ని మైళ్ల దూరాన్ని మధ్యలో నింపినా... ఆ చిరు పట్టుదారపు ముడి పడగానే ఇద్దరి మనసులూ మళ్లీ ఆ పాత ఊయల జ్ఞాపకాల్లోకి, పంచుకు తిన్న జ్ఞాపకాల గూటిలోకి చేరిపోతాయి. "నేనున్నానమ్మా నీకు" అని గుండె లోతుల్లోంచి ఇచ్చే ఆ చిన్న స్పర్శ, ఈ ప్రపంచంలో మరే సంపదా ఇవ్వలేని కొండంత ధైర్యం.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**

# కల్వకుర్తిలో ఫుట్ పాత్ ఆక్రమణలపై అధికారుల కొరడా - జేసీబీ లతో కూల్చివేత!

**రాఖీ పండగ ముందు పొట్ట కొట్టొద్దంటూ చిరు వ్యాపారుల ఆవేదన**

### 10 రోజుల ముందే నోటీసులు పట్టించుకోని వ్యాపారులు గురువారం భారీ ఆపరేషన్



జెసిబి తో షెటర్లను తొలగిస్తున్న దృశ్యం....

**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 27:** కల్వకుర్తి పట్టణంలో ఫుట్ పాత్ లను ఆక్రమించిన చిరు వ్యాపారుల దుకాణాలు, ప్రధాన దుకాణాల ముందు అక్రమంగా వేసిన రేకుల షెడ్లపై నేషనల్ హైవే అధికారులు, మున్సిపల్ అధికారులు గురువారం జేసీబీ లతో విరుచుకుపడ్డారు. పది రోజుల ముందే చిరు వ్యాపారులకు, ప్రధాన దుకాణాల వ్యాపారులకు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో గురువారం అధికారులు ఈ ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

**పొట్ట కొట్టొద్దంటూ బాధితుల ఆవేదన:**

కల్వకుర్తి పట్టణంలో కొన్ని సంవత్సరాలుగా ఫుట్ పాత్ మీదనే ఆధారపడి బతుకుతున్న మాలాంటి బీదల పరిస్థితిని అర్థం చేసుకోకుండా చిరు వ్యాపారాలను తొలగించడం ఎంతవరకు సమంజసం అని బాధితులు ఆరోపిస్తున్నారు. పొట్ట చేత పట్టుకుని రోడ్డుమీద బతుకుతున్న ప్రజల పొట్ట కొట్టడం సరైనది కాదని అధికారులను వేడుకున్నారు. రెండు మూడు రోజుల గడువు ఇవ్వాలని, రాఖీ పండుగ ఉందని, ఇప్పటికే గిరాకీలు లేక వ్యాపారాలు సరిగా నడవట్లేదని ప్రజలు అధికారులను ప్రాధేయపడినా వినకుండా వారి పని వారు చేసుకుంటూ వెళ్లారని బాధితులు వాపోయారు. చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించడంతో బాధితులు అధికారులపై విరుచుకుపడ్డారు. ఒక మహిళ తన చిన్నపాటి వస్తువులు పెట్టుకునే ఐరన్ ర్యాక్ ను జేసీబీ తో నాశనం చేయడంతో ఆమె రాయితో అధికారులపైకి రావడంతో పోలీసులు అడ్డుకున్నారు.

**రంగంలోకి మాజీ వైస్ చైర్మన్ షాహెద్ - అధికారులతో వాగ్వివాదం:**

విషయం తెలుసుకున్న మాజీ వైస్ చైర్మన్, ప్రస్తుత కౌన్సిలర్ షాహెద్ అక్కడికి చేరుకొని నేషనల్ హైవే అధికారులతో, మున్సిపల్ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఫుట్ పాత్ లపై ఉన్న 33 ఖ౦, 11 ఖ౦ విద్యుత్ లైన్లను తొలగించారా? నేషనల్ హైవే రూల్స్ ప్రకారం డ్రైనేజీ సరిగ్గా నిర్మించారా? అంటూ అధికారులను నిలదీశారు. వాటన్నింటిని తొలగించిన తర్వాతనే చిరు వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని, అప్పటివరకు ఈ దాడులను ఆపాలని వారితో వాదించారు. ఇన్ని రోజులు ఆగిన అధికారులు కనీసం రెండు మూడు రోజులు కూడా ఆగలేరా అంటూ ప్రశ్నించారు. అనవసరంగా ముందు వేసిన షాపుల ముందు ఉన్న రేకులను, చిరు వ్యాపారుల షట్టర్లను జేసీబీ తో అక్రమంగా కూల్చడం దారుణమని, రూపాయి రూపాయి కూడబెట్టుకుని చేపించుకున్న ఐరన్ షట్టర్లను దారుణంగా నాశనం చేయడం వారి జీవనోపాధిపై కొట్టడమే అని ఆయన మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తాము అధికారంలో ఉన్నప్పుడు సిగ్నల్స్ ఏర్పాటు చేసి కొంత మేరకు ట్రాఫిక్ ను, ప్రమాదాలను అరికట్టామని, నేషనల్ హైవే రూల్స్ ప్రకారం డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు డ్రైనేజీలోకి వెళ్లకుండా రోడ్డు నుంచి పోలీస్ స్టేషన్ వరకు ప్రవహిస్తోందని, రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ నేషనల్ హైవే పాటించిన తర్వాతనే చిరు వ్యాపారుల మీద అధికారం చలాయించాలని ఆయన అన్నారు.

**రోడ్డుపైనే బైఠాయింపు - రెండు రోజుల గడువు:**

మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ ను రెండు మూడు రోజుల గడువు ఇవ్వాలని కోరుతూ కమిషనర్ మాట వినకపోవడంతో రోడ్డుపైనే మాజీ వైస్ చైర్మన్ కూర్చోవడంతో మీ మాట ప్రకారం రెండు రోజుల సమయం ఇస్తానని కమిషనర్ తెలిపారు.

**పట్టణ ప్రజల ఆగ్రహం:**

కల్వకుర్తి పట్టణ ప్రజలు మాత్రం పెద్ద పెద్ద పట్టణాలలో కూడా ట్రాఫిక్ సమస్య లేదు, ఎటువంటి ప్రమాదాలు జరగడం లేదు కానీ కల్వకుర్తిలో మాత్రం చిరు వ్యాపారుల మీద పడడం సరైనది కాదని, ఫుట్ పాత్ మీద బతికే మాకు దిక్కు లేకుండా చేయడం ఎంతవరకు సమంజసం అని నిలదీస్తున్నారు. సరైన వసతులు ఏర్పాటు చేసి అందరికీ ఒకే చోట అమ్మకాలు జరుపుకునే విధంగా చూసిన తర్వాతనే మున్సిపల్ అధికారులు గానీ, నేషనల్ హైవే అధికారులు గానీ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. హైదరాబాదులో హైడ్రా మాదిరి కల్వకుర్తి పట్టణంలో కూడా చిరు వ్యాపారుల మీద అధికారులు ప్రతాపం చూపడం కరెక్ట్ కాదని కల్వకుర్తి పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.




దుకాణాల ముందున్న రేకుల షెడ్ ను తొలగిస్తు...

**అధికారుల వాదన:**

నేషనల్ హైవే అధికారులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ప్రకారం ఫుట్ పాత్ ల మీద అక్రమంగా ఆక్రమణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాల మేరకే వీటిని తొలగిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ అధికారులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని అన్నారు.



తన చిన్నపాటి ఐరన్ ర్యాక్ ను తొలగించడంతో బోరున విలపిస్తున్న మహిళ....



నేషనల్ హైవే అధికారులతో మాట్లాడుతున్న మాజీ వైస్ చైర్మన్ షాహెద్...



రెండు రోజుల గడువు ఇవ్వాలని అధికారులతో మాట్లాడుతున్న మాజీ వైస్ చైర్మన్....



మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడుతున్న బాధితులు....

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.